అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 9-8-2017
సంపుటి : 3 సంచిక : 222 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 14+ 16 పేజీలు వెల : 5.00

నిజాల పాతర

ఆదాయం ముసుగులో భారీగా అక్రమాలు

ఇసుక పేరు చెప్తేనే ప్రభుత్వ పెద్దలకు అసహనం పెరుగుతున్నది. సిరిసిల్ల జిల్లా నేరెళ్ళలో ఇసుక లారీల కింద దళితులు మృతి చెందిన తర్వాత పెల్లుబికిన విమర్శల తాకిడికి ఉక్కిరిబిక్కిరైన ప్రభుత్వం ఆత్మస్తుతి, పరనిందతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గనుల శాఖను తనయుడే నిర్వహిస్తుండటంతో ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి స్వయంగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగారు. గతంలో ఎన్నడూ రాని విధంగా మూడు సంవత్సరాల్లో ప్రభుత్వానికి ఇసుక ద్వారా రూ. వెయ్యి కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పుకొచ్చారు. అయితే ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో నిజమెంతో తెలుసుకోవడానికి **నవతెలంగాణ** చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆదాయం ముసుగులో జరుగుతున్న అక్రమాలు, మాఫియాగా మారిన ఇసుక కాంట్రాక్టర్ల అక్రమ సంపాదన, జీఓలకే పరిమితమైన ఆదర్శం, అడుగడుగునా గులాబీ నేతలు మంత్రుల ప్రమేయం తెలియవచ్చాయి. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను సైతం తుంగలోకి తొక్కిన వైనం స్పష్టమైంది.



కొండూరి రమేశ్‌బాబు

ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ సొసైటీలను డమ్మీలుగా మార్చిన ప్రభుత్వం వారికి దక్కాల్సిన ఇసుక ఆదాయాన్ని కాంట్రాక్టర్ల పరం చేసింది. కంచే చేను మేసిన చందంగా ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడిచింది. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్డు ప్రాంతంలో ఉన్న ఏజెన్సీలో ప్రకృతి వనరులన్నీ ఆదివాసీలకే దక్కాలని కేంద్రం నిర్ణయించింది. భూరియా కమిటీ సిఫారసుల తర్వాత దేశవ్యాప్తంగా గనుల విధానంలో మార్పులు తెచ్చింది. షెడ్యూల్డు ప్రాంతాలకు పంచాయితీరాజ్ విస్తరణ (పీసా) చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో పీసా చట్టం అమలు కోసం 2011లో పంచాయితీరాజ్ శాఖ జీఓ నంబర్ 66 ద్వారా మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. ఇసుక వంటి చిన్నతరహా ఖనిజాలపై వచ్చే ఆదాయం పూర్తిగా ఆదివాసీలకే దక్కాలని చట్టం చెప్తున్నది. 'పీసా' చట్టం ప్రకారం గ్రామసభల నిర్ణయం మేరకే ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంది. అందుకే ఇసుక తవ్వకాలను ఆదివాసీ సహకారం సంఘాలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ...9లో

సుప్రీం సీజేగా దీపక్‌మిశ్రా

ఖేహార్ సిఫారసుకు కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానానికి తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ఈ పదవికి దీపక్ మిశ్రా సమర్థుడని ప్రస్తుత చీఫ్ జస్టిస్ జగదీశ్‌సింగ్ ఖేహార్ చేసిన ప్రతిపాదనకు కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ మంగళవారం ఆమోదం తెలిపింది. ఖేహార్ పదవీకాలం ఈనెల 27తో ముగియనున్నది. మరోవైపు చీఫ్ జస్టిస్‌గా ఒడిషాకు చెందిన దీపక్ మిశ్రా 14 నెలల పాటు(2018 అక్టోబర్ 2 వరకు) సేవలందిస్తారు. ఇదే రాష్ట్రం నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఇంతకుముందు ఇద్దరు(రంగనాథ్ మిశ్రా, గోపాల్ బల్లవ్ పట్నాయక్) పని చేశారు. నిర్భయ కేసులో నిందితులకు కింది కోర్టు విధించిన మరణశిక్షను సమర్థించిన సుప్రీంకోర్టు బెంచ్‌కు దీపక్‌మిశ్రా నేతృత్వం వహించారు.

స్కూళ్లలో యోగా తప్పనిసరి చేయలేం..



9లో

సమాచార కమిషన్‌కు కమిషనర్లను నియమించాలి

తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

వివరాలు 2లో



జీఎస్టీతో కోట్లల్లో నష్టం

విన్నవించినా కేంద్రం వినడం లేదు

- ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం: మంత్రి ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

నవతెలంగాణ-నిజామాబాద్

జీఎస్టీతో రాష్ట్రానికి రూ.కోట్లల్లో నష్టం జరుగుతుందని రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. నిజామాబాద్ నగరంలో రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగినప్పుడల్లా రాష్ట్రం తరపున 33 అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేశామని చెప్పారు. జీఎస్టీ అమలులోకి రాకముందు నుంచి రాష్ట్రప్రభుత్వం మిషన్ భగీరథ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూం, రోడ్లు తదితర రూ.లక్షల కోట్ల విలువ గల అభివృద్ధి పనులు చేపడుతున్నదన్నారు. ప్రజలకు అవసరమైన పథకాలను అమలు చేయడానికి జీఎస్టీ రూపంలో రూ.కోట్లల్లో పన్నులు చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఊరుకోబోమని ఆయన అన్నారు. ఒక్కో రాష్ట్రం తమ ప్రయోజనాల దృష్ట్యా ప్రతిపాదనలు పంపితే వాటిపై సరైన నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే జీఎస్టీకి అంగీకరించబోమని ముందేచెప్పామన్నారు. జీఎస్టీ ఎంపవర్ కమిటీ వివిధ దేశాల్లో అధ్యయనం చేసిన పిదప అమలుకు కౌన్సిల్ ఏర్పాటు అనంతరం దాన్ని చట్టం చేశారని వివరించారు. జీఎస్టీ చట్టం చేసే సమయంలో ఏ వస్తువుకు ఏ శ్లాబ్ అనేది నిర్ణయం కాలేదన్నారు. పేదలు వాడుకునే వస్తువులు, చిన్నతరహా పరిశ్రమలు, గ్రానైట్, రైతులకు అందించే ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, బీడీ కార్మికులు వంటి వాటిపై ట్యాక్స్ తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విన్నవించినా బీజేపీ సర్కారు పట్టించుకోవడం లేదని చెప్పారు. ప్రజల అవసరాల కోసం చేసిన కార్యక్రమాలకు 18శాతం ట్యాక్స్ నిర్ణయిస్తే చెల్లించడం సమంజసంగా లేదన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తాను ...9లో

రమేశ్ రాథోడ్ X రేఖానాయక్

- రోడ్డున పడ్డ టీఆర్ఎస్ గ్రూపు విభేదాలు
- మంత్రి సమక్షంలోనే దూషణల పర్వం
- అనుచరుల నినాదాలతో హోరెత్తిన సమావేశప్రాంగణం
- వద్దని వారించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-ఖానాపూర్

నిర్మల్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీలో గ్రూపు విబేధాలు భగ్గుమన్నాయి. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌లు నువ్వెంత అంటే నువ్వెంత అని వాగ్వివాదానికి దిగారు. 'బత్కడానికొచ్చినోళ్లు బతకడానికొచ్చినట్లే ఉండాలి' అని ...9లో

గుజరాత్‌లో హైడ్రామా

రాజ్యసభ సభ్యుల ఎన్నిక కౌంటింగ్ సస్పెన్స్

వివరాలు 2లో

నిరుద్యోగుల వయోపరిమితి పదేండ్లు సడలింపు

2019, జులై 26 వరకు పెంపు వర్తింపు.. ఉత్తర్వులు జారీ

9లో

అండగా నేనుంటా..

డీఐజీ నివేదిక రాగానే చర్యలు

- నేరెళ్ల ఘటనను టీఆర్ఎస్ సర్కారు ప్రోత్సహించదు
- పరామర్శకొచ్చే వాళ్లు టూరిస్టులు:కేటీఆర్

నవతెలంగాణ - వేములవాడ

'నేరెళ్ల బాధితులకు అండగా నేనుంటా. ఇలాంటి ఘటనలను టీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదు. డీఐజీ నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం' అని రాష్ట్ర రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కే.తారకరామారావు ...9లో



బాధితున్ని పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

మంత్రి పరామర్శ... కవరేజికి నిరాకరణ.. పాత్రికేయుల అసహనం

మీడియా నెల రోజులుగా నేరెళ్ల ఘటన పరిమాణా లను కవరేజీ చేసింది. జాతీయ స్థాయి నాయకులు వచ్చి పరామర్శించేలా ఈ ఘటనను వెలుగులోకి తెచ్చింది. రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ తాను బాధితులను పరామర్శించేందుకు ఆస్పత్రి ఆవరణలోకి వెళ్లగా కవరేజి కోసం వెళ్లిన మీడియాను పోలీసులు అడ్డుకున్నారు. ఎవరినీ లోనికి వెళ్లనీయలేదు. పరామర్శ అనంతరం మంత్రి తమ వాణిని విలేకరులకు వినిపించారు. ఏదేమైనా పరామర్శ సమయంలో బాధితుల్లోంచి వచ్చిన అసహనం, డిమాండ్లను ఎక్కడ మీడియా జనాలకు చూపుతుందోనన్న భయం వెంటాడి ఉండొచ్చన చర్చ అటు అధికారపార్టీ వర్గాల్లోనూ సాగడం గమనార్హం. కవరేజీ నిరాకరణపై పాత్రికేయులు అసహనం వ్యక్తం చేశారు.

చైనాలో భూకంపం

- 100 మంది దుర్మరణం?
- అప్రమత్తమైన పోలీసులు
- రిక్టర్ స్కేలుపై తీవ్రత 7గా నమోదు

వివరాలు 12లో

15 రోజుల్లో ఫీజుల వివరాలు

- ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలకు అల్టిమేటం
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా వివరాల సేకరణ

వివరాలు 2లో

క్రమబద్ధీకరణలో పేరు లేదని..

కేటీపీఎస్ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య



9లో



విధాన నిర్ణయాలతో.. రైతులకు గడ్డు కాలం

డబ్ల్యూటీవో ఒత్తిళ్లకు తలొగ్గిన కేంద్రం?

- సంక్షేమ పథకాలకు కోత.. వ్యవసాయ ఉత్పత్తులపై భారీగా తగ్గనున్న దిగుమతి సుంకం
- ప్రపంచ మార్కెట్ పోటీలో అన్నదాత బతుకు ఆగం
- డిసెంబర్‌లో బ్యూనోస్ ఎయిర్స్‌లో జరిగే తీర్మానాలపై ఆందోళన

నవతెలంగాణ - జనరల్ డెస్క్

మార్కెట్ వ్యవస్థలోకి గుత్తాధిపత్య సంస్థల చొరబాటు వల్ల ధరల నిర్ణయం రైతులు, ప్రభుత్వం చేతుల్లోంచి బడా కంపెనీల అజమాయిషీలోకి వెళ్లనున్నది. 2017,డిసెంబర్ 10 నుంచి 13 వరకు భారత ప్రజలకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన తేదీలు. అయితే, క్రికెట్ వరల్డ్ కప్ వల్లనో లేక జాతీయస్థాయి ఎన్నికల వల్లనో కాదు. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)11వ మంత్రుల స్థాయి సమావేశాలు బ్యూనోస్ ఎయిర్స్‌లో ఆ రోజుల్లో జరగనున్నాయి. అభివృద్ధి ఎజెండాలో ఆహార భద్రత, రైతుల ...9లో



అంతర్రాష్ట్ర ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

- ఏపీ, తెలంగాణ ఉమ్మడి మార్గదర్శకాలు జారీ

వివరాలు 2లో

విద్యుత్ సంస్థల ఎన్నికలు వాయిదా

వివరాలు 12లో

విద్యార్థులపై వార్డెన్ అసభ్య ప్రవర్తన

12లో

31 నుంచి గురుకులాల రాతపరీక్షలు

- సవరణ షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ

వివరాలు 2లో

గుజరాత్‌లో అర్ధరాత్రి వరకు హైడ్రామా

- రాజ్యసభ సభ్యుల ఎన్నిక కౌంటింగ్‌పై సస్పెన్స్
- బరిలో నలుగురు, ముగ్గురు సభ్యుల ఎన్నికపై ఉత్కంఠ
- కాంగ్రెస్ ఫిర్యాదుతో ఇద్దరు రెబెల్ ఎమ్మెల్యేల ఓట్లను రద్దు చేసిన ఈసీ

గాంధీనగర్/ఢిల్లీ: గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుల ఎన్నిక సంబంధించిన కౌంటింగ్ అంశం అనూహ్య మలుపులు తిరిగింది. వివరికి ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో కౌంటింగ్‌పై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. కేంద్ర ఎన్నికల కమిషన్ గాంధీనగర్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారిని మంగళవారం అర్ధరాత్రి కౌంటింగ్‌కు ఆదేశించారు. దాంతో, రాత్రి 1-30 వరకూ కౌంటింగ్ ప్రారంభించలేదు. గుజరాత్ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులను ఎన్నుకునేందుకు మంగళవారం పోలింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు పోలింగ్ ముగిసింది. ఆ తర్వాత సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌంటింగ్, కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడంతో వాయిదా పడింది.

తమ పార్టీకి చెందిన ఇద్దరు తిరుగుబాటు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటమేగాక, తామెవరికి ఓటు వేస్తున్నదీ చెబుతూ బ్యాలెట్ పేపర్లను బీజేపీ ఏజెంట్‌తోపాటు రాజ్యసభ అభ్యర్థి అమిత్‌షాకు చూపారని కాంగ్రెస్ ఆరోపించింది. తమ పార్టీ తిరుగుబాటు ఎమ్మెల్యేలైన రాఘవ్‌జీ పటేల్,భోలా గోహిల్‌పై కాంగ్రెస్ ఈ ఆరోపణలు చేసింది. దీనిపై ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వారిద్దరి ఓట్లను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మరోవైపు బీజేపీ కేంద్ర మంత్రులుసహా ఆ పార్టీ నేతలు కూడా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి కౌంటింగ్ ప్రారంభించాలని కోరారు. దాంతో, కమిషన్ సభ్యులు సమావేశమై ఆ నిర్ణయం తీసుకోవాల్సొచ్చిందానిపై రాత్రి 11-30 వరకూ మల్లగుల్లాలు పడ్డారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఇద్దరు కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేల ఓట్లను రద్దు చేస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకున్నది. గుజరాత్ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికలో మొత్తం నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. బీజేపీ తరఫున ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ, బీజేపీ బలపరిచిన కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి బల్వంత్‌సింగ్‌రాజ్‌పుత్, కాంగ్రెస్ తరఫున సోనియాగాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్‌పటేల్ పోటీ పడ్డారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 182మంది సభ్యులున్నారు. వారిలో బీజేపీకి 121మంది, కాంగ్రెస్‌కు 57మంది, ఎన్‌సీపీకి ఇద్దరు, జేడీ(యూ)కు ఒక సభ్యుడున్నారు. అయితే, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత శంకర్‌సింగ్‌వాఘేలాసహా ఆరుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేశారు. రాజ్యసభ అభ్యర్థి విజయానికి ఒక్కొక్కరికి 44 ఓట్లు అవసరం. దాంతో, నాలుగో అభ్యర్థిగా ఎవరు గెలుస్తారన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది.

ఆర్టికల్ 370 గడువుపై వివరణ ఇవ్వండి : సుప్రీం

న్యూఢిల్లీ: జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను సూచించే ఆర్టికల్ 370 గడువుపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని భారత సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం ఆదేశించింది. ప్రత్యేక హోదాపై ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ విజయలక్ష్మి ఝా.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో చీఫ్ జస్టిస్ జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రం స్పందనకు నాలుగువారాల గడువు ఇచ్చింది. ఆర్టికల్ 370ని తాత్కాలికంగా తీసుకొచ్చారని, దాని గడువు ఎప్పుడు ముగుస్తుందో చెప్పాలంటూ ఈ పిటిషన్ దాఖలు చేయగా దానిని ఢిల్లీ హైకోర్టు ఏప్రిల్ 11న కొట్టివేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇదివరకే తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది.

కోడలికి అత్త బాసట

- కర్నాటక మాజీ మంత్రి కుమారుడి విడాకుల కేసు...

బెంగళూరు : కర్నాటక దివంగత మాజీ మంత్రి ఎస్ఆర్ కాషప్పనవర్ కుమారుడి విడాకుల కేసుపై జిల్లా ఫ్యామిలీ కోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. అయితే, ఈ కేసులో ప్రతివాది తల్లి కోడలుకు మద్దతుగా నిలిచి సాక్ష్యం చెప్పడం గమనార్హం. పిటిషనర్ వాదనలతో జస్టిస్ కె.భాగ్య ఏకీభవించారు. పిటిషనర్‌కు 60రోజుల్లో రూ.4కోట్ల శాశ్వత భరణం చెల్లించాలని ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న దేవానంద్ కాషప్పనవర్‌ను ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం...2011, మే22న దేవానంద్, పిటిషన్‌ల వివాహం జరిగింది. దేవానంద్ తన కుటుంబ సభ్యుల కోరిక మేరకు మేనకోడలైన పిటిషనర్‌ను వివాహం చేసుకున్నారు. దీంతో, ఆమె డిగ్రీ కోర్సును మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. దేవానంద్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఈ విషయం తెలిసిన పిటిషనర్ అతన్ని పలుమార్లు నిలదీసింది. దీంతో, ఇరువురి మధ్య పలుమార్లు వాగ్వాదం జరిగి అభిప్రాయ బేధాలు తలెత్తాయి. అంతేగాకుండా, పిటిషనర్‌పై దేవానంద్ పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. ఉమ్మడి కుటుంబంలో నివసిస్తుండటంతో అతని తల్లి ఈ విషయాన్ని గమనించేది. కొడుకును నచ్చజెప్పేందుకు తరచూ ప్రయత్నిస్తుండేది. అయినా, అతను పట్టించుకునేవాడు కాదు. దీంతో, తన భర్త వేధింపులు తాళలేక పోతున్నానని, చట్టపరంగా విడాకులు మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ ఫ్యామిలీ కోర్టులో బాధితురాలు పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. తన కుమారుడికి విలువైన భూములు, క్వారీ, తదితర వ్యాపార లావాదేవీలున్నాయని ప్రతివాది తల్లి విచారణ సమయంలో వాంగ్మూలం ఇచ్చింది. దీంతో, ప్రతివాది నుంచి రూ.4కోట్లు శాశ్వత భరణాన్ని రాబట్టి పిటిషనర్‌కు అందజేయడమే సరైందని తీర్పు సమయంలో న్యాయమూర్తి వెల్లడించారు.

రక్షాబంధన్ సాక్షిగా..

- విద్యార్థినులపై సీఆర్‌పీఎఫ్ జవాన్ల లైంగికవేధింపులు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో పాఠశాల విద్యార్థినులపై సీఆర్‌పీఎఫ్ సిబ్బంది లైంగిక దాడికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై అధికారులు దర్యాప్తుకు ఆదేశించారు. దంతేవాడ జిల్లాలో రక్షాబంధన్ సందర్భంగా ఒక ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్లు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై విచారణకు ఐదుగురు సభ్యులతో కూడిన పానెల్‌ను ఏర్పాటుచేస్తున్నట్టు దంతేవాడ జిల్లా కలెక్టర్ సౌరబ్ కుమార్ చెప్పారు. పల్నార్ గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో జులై 31న రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పాఠశాలల్లో గత తొమ్మిదేండ్లుగా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దండేవాడలో వావోయిస్టులను ఎదుర్కొనేందుకు గాను పారామిలటరీ దళాలను నియమించారు. '31న కార్యక్రమం జరుగగా.. ఆగస్టు 1న హాస్టల్ వార్డెన్ మాకు ఫిర్యాదు చేశారు. సోదాల పేరుతో బాలికలను యూనీఫాం వేసుకున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పిల్లలను అసభ్యంగా తాకారని. వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు' అని కలెక్టర్ చెప్పారు.

అయోధ్యలో మందిరం ఓకే

బాబ్రీ కేసులో షియా బోర్డు దగ్గర్లోనే మసీదు కూడా

న్యూఢిల్లీ : వివాదాస్పద రామాలయ స్థలంలో ఆలయ నిర్మాణానికి ఉత్తరప్రదేశ్ షియా వక్ఫ్ బోర్డు సమ్మతి తెలిపింది. దానికి దగ్గరలోనే ముస్లింలు ప్రార్థన చేసుకునేందుకు మసీదు నిర్మాణం చేపట్టవచ్చని బోర్డు సుప్రీం కోర్టుకు మంగళవారం తెలిపింది. 30 పేజీల అఫిడవిట్‌లో బాబ్రీ మసీదు ప్రదేశంపై తమకే పూర్తి హక్కులు ఉన్నాయని, అది తమ ఆస్తుల్లో భాగమని రామ మందిర నిర్మాణం విషయంలో ఏ చర్చలైనా తమతోనే జరపాలని బోర్డు కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ నెల 11 నుంచి సుప్రీం కోర్టు ఈ వివాదాస్పద అంశంపై విచారణ జరపనున్న సమయంలో వక్ఫ్ బోర్డు సమర్పించిన అఫిడవిట్ కేసును మరో మలుపు తిప్పింది. ఈ సమస్యకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు తమకు కొంత వ్యవధి ఇవ్వాలని బోర్డు కోర్టును కోరింది. సున్నీ ముస్లింల వైఖరిని తప్పుపడుతూ, బాబ్రీ మసీదు షియా వక్ఫ్ బోర్డు ఆస్తి అని బోర్డు తెలిపింది. ప్రస్తుతం కోర్టు ముందున్న కేసులో షియా బోర్డు కూడా ఒక పక్షానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. అలహాబాద్ హైకోర్టు తీర్పు (వివాదాస్పద స్థలాన్ని ఆలయనిర్మాణంతో పాటు మసీదు, నిర్మోహి అఖారాలకు కూడా ఉపయోగపడేలా మూడు భాగాలు చేయాలని సూచించింది.) ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లలను జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అశోక్ భూషణ్. జస్టిస్ ఎస్ఎ నజీర్‌లు ఈనెల 11 నుంచి విచారించనున్నారు.

ఎన్డీయే సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం

నవంబర్ 9,10,11 తేదీల్లో మూడు రోజుల ధర్నాకు కార్మిక సంఘాల పిలుపు





కేంద్ర కార్మిక సంఘాల సదస్సులో ప్రసంగిస్తున్న తపన్‌సేన్, హాజరైన వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు

న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 9, 10, 11 తేదీలలో న్యూఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ ధర్నాపై ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపట్టాలని మంగళవారం ఇక్కడ జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, సేవా, ఏఐసీసీటీయూ, యూటీయూసీ, ఎల్‌పీఎఫ్ వంటి సంఘాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు బ్యాంకులు, బీమా, రక్షణ, ప్రభుత్వరంగ సంస్థలు, రైల్వేలు, టెలికాం, విద్యుత్, బొగ్గు, ఉక్కు, ఇంధన, పెట్రోలియం, రోడ్డు, వాయు, జల రవాణా రంగాలకుచెందిన కార్మికులు, పోర్టు, డాక్, మెటల్, మైనింగ్, ఐటి రంగాలకు చెందిన ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, ఫార్మా, నిర్మాణ, ప్లాంటేషన్ రంగాలకు చెందిన కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగుల హోదా, వేతనాలు, స్కీమ్ వర్కర్లకు ఇతర సౌకర్యాలు, ప్రయివేటీకరణ, మూకుమ్మడి కాంట్రాక్టీకరణ వంటి అంశాలపై తాముచేసిన 12 డిమాండ్లకు సంబంధించిన ఛార్టర్‌ను నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం అహంకార ధోరణిని కొనసాగిస్తోందని, ప్రభుత్వ ధోరణికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికలోకం పలు ఆందోళనలు, సమ్మెల వంటి రూపాలలో ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మికుల హక్కులను, జీవనాన్ని కాలరాస్తోందని ఈ సమావేశం విమర్శించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగిత రోజురోజుకూ పెరిగిపోతుండగా మరోవైపు శ్రమశక్తి ఆధారితమైన అనేక రంగాలలో ఉపాధి కల్పన తిరోగమన దిశలో కొనసాగుతోందని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులను ఏ మాత్రం ఖాతరు చేయని కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సంస్కరణల పేరిట యాజమాన్య అనుకూల చర్యలు కొనసాగిస్తోందని సమావేశం అభిప్రాయపడింది. తాజాగా కార్మికులకు ఎంతో కొంత సామాజిక భద్రత కల్పించే చట్టపరమైన వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటోందని విమర్శించింది. రక్షణ ఉత్పత్తులు, బీమా, ప్రభుత్వ రంగ బ్యాంకుల వంటి వ్యూహాత్మకమైన ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేటీకరించటంతో పాటు ప్రభుత్వ రంగ వ్యవస్థల్లో తన వాటాలను ఉపసంహరించుకుంటూ, కొన్నింటిని తెగనమ్ముతూ, కొన్నింటిలో ప్రైవేటు రంగానికి అనుకూలంగా పౌరుగు సేవల విధానాన్ని అనుమతిస్తూ కొనసాగిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నానాటికీ పెరిగిపోతున్నాయని కార్మిక సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2017 మోటారు వాహనాల చట్ట(సవరణ)బిల్లుకు అధికార కూటమి తనకున్న మందబలంతో ఆమోదం పొందటం ఇందుకు తాజా ఉదాహరణ అని ఈ సమావేశం పేర్కొంది. జాతీయ రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో రైతులు కొనసాగిస్తున్న పోరాటాలకు సమావేశం సంఘీభావం ప్రకటించింది. ప్రస్తుత రాజకీయ నాయకత్వంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని మతోన్మాద, విభజన చర్యలకు అనుకూలంగా ఉపయోగించుకోవటాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. కార్మికలోకం, బడుగు వర్గాల హక్కులు, జీవన విధానాలపై కొనసాగుతున్న దాడులు నానాటికీ తీవ్రమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తుండటంపై పోరాటాలు కొనసాగించాలని సమావేశం పిలుపునిచ్చింది. ఆర్థిక రంగంలోని అన్ని విభాగాలలో కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లను సాధించుకునేందుకు ఐక్యపోరాటాలను ఉధృతం చేయాలని సమావేశం నిర్ణయించింది. దీనితో పాటు బ్లాక్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విస్తృత ప్రచారం జరిపి ఆందోళనలకు కార్మికలోకాన్ని సమీకరించాలని, నవంబర్ 9, 10, 11 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే మహాధర్నాకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులను సమీకరించాలని సమావేశం నిర్ణయించింది. ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా నిరవధిక దేశవ్యాప్త సమ్మెకు సంసిద్ధం కావాలని ఈ సమావేశం ప్రజలకు పిలుపునిచ్చింది.

గుజరాత్‌లో ఏ టెర్రరిస్టులున్నారు?

రాహుల్ గాంధీపై రాళ్లదాడికి పాల్పడిందెవరు?

- శాంతి భద్రతలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం
- లోక్‌సభలో ప్రతిపక్షనేత ఖర్గే
- విచారణ జరుగుతోంది: కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- కాంగ్రెస్ సభ్యుల ఆందోళన

న్యూఢిల్లీ : గుజరాత్‌లో ఏ టెరరిస్టులున్నారు? రాహుల్ గాంధీపై రాళ్ల దాడికి పాల్పడిందెవరు? అంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వాన్ని నిలదీశారు. 'జమ్ముకాశ్మీర్‌లో రాళ్లు రువ్విన వారిని టెర్రరిస్టులన్నారు.. టెర్రరిస్టులకు మద్దతిచ్చే వాళ్లే రాళ్లు రువ్వుతున్నారని అన్నారు.. మరి గుజరాత్‌లో జరిగిందేమిటీ. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వరద బాధితుల్ని పరామర్శించేందుకు గుజరాత్ వెళ్తే రాళ్లతో దాడి చేస్తారా? ఇదెక్కడి న్యాయం. దేశంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు పౌరులకుంది. అలాంటి పౌరుల ప్రాథమిక హక్కుకు భంగం వాటిల్లే ఘటనలు గుజరాత్‌లో జరిగాయి. దీనికి బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలి. శాంతి భద్రతలు కాపాడటంలో గుజరాత్ ప్రభుత్వం విఫలమైంది. ఒక వ్యక్తికే భద్రత కల్పించ లేకపోతే, సమస్త ప్రజా జీవనానికి రక్షణ ఎలా కల్పించగలరు?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. గుజరాత్‌లో రాహుల్ గాంధీపై రాళ్ళ దాడి అంశాన్ని లోక్‌సభలో కాంగ్రెస్ మంగళవారం లేవనెత్తింది. కాంగ్రెస్‌కు సీపీఐ(ఎం), ఆర్జేడీ, టీఎంసీ తదితర పార్టీలు మద్దతుగా నిలిచాయి. తొలిత స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించే ప్రయత్నం చేశారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీలు లేచి గుజరాత్‌లో రాహుల్ గాంధీపై జరిగిన రాళ్ల దాడిపై ప్రభుత్వం సమాధానమివ్వాలని ఆందోళన చేశారు. అందుకు సంబంధించి ప్రతిపక్షనేత ఖర్గే వాయిదా తీర్మానం కూడా ఇచ్చారు. కానీ స్పీకర్ సుమిత్రా మహాజన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. అయితే మల్లికార్జున ఖర్గేకు మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ దాడి అంశాన్ని లేవనెత్తారు. 'రాహుల్ గాంధీపై జరిగిన దాడిలో కారు ధ్వంసమైంది. వెనుక సీట్లలో కూర్చోన్న భద్రత సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇటీవలి వచ్చిన వరదుల్లో దాదాపు 270 మంది ప్రజలు చనిపోయారు. ఆయా ప్రాంతాలను పరామర్శించేందుకు రాహుల్ గాంధీ వెళ్లారు. అందుకే ఆయన పై దాడి చేశారు. ఇది సమంజసం కాదు. ప్రజాస్వామ్యంలో హింస సరైన మార్గం కాదు. హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మహాత్మ గాంధీని పదేపదే తలుచుకుంటాం. కానీ ఆయన వ్యతిరేకించిన అహింసను మాత్రం వదలట్లేదు. 1947 క్విట్ ఇండియా ఉద్యమంలో పౌరులు దేశంలో ఎక్కడైన తిరగొచ్చన్న సందేశాన్ని గాంధీ ఇచ్చారు. కానీ ప్రస్తుత పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. నాయకులు పర్యటిస్తుంటే దాడులు చేస్తామంటుంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ "రాహుల్ జాతీయ స్థాయి నేత. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆయన సెక్యూరిటీ నియమాలను ఉల్లంఘిస్తున్నారు. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీసులు ఏర్పాటు చేసిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని రాహుల్ తిరస్కరించారు. భద్రతా సిబ్బంది సూచనలు అనుసరించి ఉంటే ఇలా జరిగేదికాదు. ఆయనకు ఎస్పీజి భద్రత ఉన్నప్పటికీ పక్కన బెట్టడానికి కారణమేమిటీ? ఎస్పీజీ సిబ్బందిని ఎందుకు తిరస్కరిస్తున్నారో చెప్పాలి. రాహుల్‌పై రాళ్ల దాడి చేసిన ఘటనలో ఒకరిని అరెస్టు చేశాం. విచారణ జరుగుతోంది" అని అన్నారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్ళి ఆందోళన చేశారు. వారికి సీపీఐ(ఎం) ఆర్జేడి, తృణముల్ కాంగ్రెస్ మద్దతుగా నిలిచాయి. స్పీకర్ పోడియంను చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీనికి అధికార బీజేపీ సభ్యులు ప్రతి నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేశారు. అనంతనం ప్రారంభమైన సభ అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో హోరెత్తింది. దీంతో సభను స్పీకర్ బుధవారం నాటికి వాయిదా వేశారు.



రాజ్యసభలో ప్రతిపక్షాలతో శరద్ యాదవ్

బీహార్‌లో బీజేపీ పంచన చేరిన నితీశ్ కుమార్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి అసంతృప్తితో ఉన్న జేడీ(యూ) నేత శరద్ యాదవ్ రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీసే విషయంలో ప్రతిపక్షాలపక్కన చేరారు. రూ.500 నోట్లను వివిధ సైజులలో ముద్రించడంపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. బీహార్‌లో తమ పార్టీ బీజేపీతో కలవక ముందు ప్రతిపక్ష సభ్యునిగా తాను ముందు వరసలో ఏ స్థానంలో కూర్చున్నారో మంగళవారం కూడా అదే స్థానంలో కూర్చున్నారు. వివిధ సైజుల్లో ముద్రించిన రూ.500 నోట్లను పెద్దవిగా చేసిన కాపీలను చేత పట్టుకుని ప్రదర్శించడంతో కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వంపై దాడికి దిగారు. ప్రపంచంలో ఏ దేశం కూడా కరెన్సీ నోట్లను ఒకటి పెద్దదిగా, ఒకటి చిన్నదిగా ప్రచురించదని అన్నారు. ఒక వైపు బీఎస్‌పీ సభ్యుడు సతీష్ మిశ్రా, మరో వైపు ఎస్‌పీ సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్‌లు కూర్చుండగా మధ్యలో ఆయన కూర్చుని ప్రతిపక్షంతోనే కొనసాగుతానన్న విషయాన్ని పరోక్షంగా స్పష్టం చేశారు.. సిపిఎం నేత సీతారాం ఏచూరితో పాటు వారు ముందు వరసలోనే కూర్చున్నారు.

కేరళపై అసత్య ఆరోపణలు ఆపండి

కేంద్ర మంత్రి రిజిజూ ప్రకటనను వెనక్కి తీసుకోవాలి

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే క్రైం ఎక్కువని ఎన్సీఆర్బీ నివేదిక చెబుతోంది
- ప్రజా సంక్షేమ లెఫ్ట్ ఫ్రంట్‌పై బురద జల్లుతున్నారు
- కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కేరళ వాసులు
- పార్లమెంట్ ఎదుట ధర్నా



న్యూఢిల్లీ : దేశంలోనే ప్రజా పాలన అందిస్తున్న కేరళపైన, సీపీఐ(ఎం)పైన అసత్య ఆరోపణలు ఆపాలని ఢిల్లీలో నివసిస్తున్న కేరళ వాసులు డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే క్రైం అత్యధికంగా జరుగుతోందని, అందుకు నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో(ఎన్సీఆర్బీ) నివేదికలే చెబుతున్నాయని స్పష్టంచేశారు. కేరళలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం సాహసోపేతమైన చర్యలకు పూనుకుందని గుర్తు చేశారు. ఈ విషయాలేవీ తెలుసుకోకుండా కేంద్ర మంత్రులు అనుచిత వ్యాఖ్యాలు చేస్తున్నారని, అసత్య ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. లోక్‌సభలో కేరళ రాష్ట్రంపైన కేంద్ర హోం సహాయ మంత్రి కిరణ్ రిజిజూ అవాస్తవ ప్రకటన చేశారని, ఆయన తన ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నాడిక్కడ స్థానిక విబి హౌస్ నుంచి పార్లమెంట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైల్ భవన్ వద్దకు ర్యాలీ చేరుకోగానే పోలీసులు బారికేడ్లు వేసి కేరళ వాసులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, కేరళీయులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. 'ఇక్కడ ఆందోళన చేయకూడదు. మీరు వెళ్లిపోండి. ఎదైనా ఉంటే జంతర్ మంతర్ వద్ద చేసుకోండి' అని పోలీసులు చెప్పగా.. 'మీ మీ రాష్ట్రాలపై ఇలాగే బురద జల్లితే మీరు ఊరుకుంటారా? మీరు ఊరుకోవచ్చేమో! కానీ మేం ఊరుకోం. మా రాష్ట్రమన్నా, దేశమన్న మాకు ప్రేమ. బీజేపీ నేతలు చేతకాక ఇలాంటి నీచమైన కుట్రలకు ఒడిగడుతున్నారు. కేరళ దేశంలోనే విద్యా, వైద్యం, మానవ హక్కుల రక్షణ, మహిళా రక్షణ, ఉపాధి వంటి రంగాల్లో ముందంజలో ఉంది. అవినీతి రహిత రాష్ట్రంగా ఉంది. అందుకనే మేమే కేరళకు చెందిన వారమని గర్వంగా చెప్పుకుంటున్నాం. అలాంటి కేరళపై బీజేపీ దుష్ప్రచారం చేస్తోంది. దీన్ని ఎంత మేరకు సహించం" అంటూ పోలీసులకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా అనీ రాజా మీడియాతో మాట్లాడారు. 'లోక్‌సభలో జూలై 31న గోరక్షణ దళాల దాడులపై చర్చ జరిగింది. ఆ సమయంలో కేంద్ర హోం సహాయ మంత్రి కిరణ్ రిజిజూ ఇచ్చిన ప్రకటనలో దేశంలోనే కేరళలో క్రైం ఎక్కువగా ఉందని అన్నారు. ఇది అవాస్తవం. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో క్రైం ఎక్కువగా ఉందని ఎన్సీఆర్బీ రిపోర్టు చెబుతోంది. ఒక కేంద్ర మంత్రి నిండు సభలో ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయడం దారుణం. వెంటనే ఆయన తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలి. లోక్‌సభ రికార్డుల నుంచి కూడా ఆయన వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. బీజేపీ పాలత రాష్ట్రాల్లో అవినీతి, నిరుద్యోగం, ప్రజల్లో అశాంతి, మతోన్మాదదాడులు, దళిత, మైనార్టీలపై దాడులు, మహిళలకు రక్షణ లేకపోవడం వంటి వాటితో ప్రజలు నిరంతరం ఇబ్బందులకు గురువుతున్నారు. కేరళలో అక్కడి ప్రభుత్వం ప్రజా పాలనను అందిస్తోంది. అందుకనే బీజేపీ ఇలాంటి కుయుక్తలకు దిగింది" అని ఆమె విమర్శించారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసేందుకు అపాయింట్ మెంట్ కోరగా ఆమె తిరస్కరించారు.

అరుణ్ జైట్లీతో లెఫ్ట్ ఎంపీల భేటీ

కేరళపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీలు విమర్శించారు. కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీని పార్లమెంటు ఆవరణలోని ఆయన కార్యాలయంలో ఉభయ సభలకు చెందిన లెఫ్ట్ ఎంపీలు మంగళవారం కలిశారు. కేరళపై మీకు తప్పుడు నివేదిక అందింది. బీజేపీ నేతలు మీకు తప్పుడు సమాచారమిచ్చారు. దానిపై మీరు మాట్లాడారు. మీ ప్రకటనతో కేరళీయులు అసంతృప్తిగా ఉన్నారు. కేరళలో ప్రభుత్వం ప్రజా పాలనను అందిస్తోంది. అది అందరికీ తెలుసు. మీకు కూడా తెలుసు. కానీ కావాలనే విమర్శలు చేశారు. అది ఎంత మాత్రం సమంజసం కాదు" అని జైట్లీకి లెఫ్ట్ ఎంపీలు తెలిపారు. నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో రిపోర్టును, కేరళ పోలీస్ శాఖ నమోదు చేసిన రిపోర్టును జైట్లీకి ఎంపీలు అందించారు. జైట్లీని కలిసిన వారిలో సీపీఐ(ఎం) ఎంపీలు ఎ.సంపత్, పి.కె శ్రీమతి టీచర్, పి.కె బిజూ, ఎండి బద్రూద్దోజాఖాన్, శంకర్ ప్రసాద్ దత్త, సీపీఐ ఎంపీ డి.రాజా తదితరులు ఉన్నారు.



మైనర్ల ముఖాలపై స్టాంప్ వేశారు..!

- మధ్యప్రదేశ్ జైలు అధికారుల నిర్వాకం

భోపాల్ : రాఖీ పండుగ సందర్భంగా సెంట్రల్ జైలులో ఉన్న బంధువులను కలిసేందుకు వెళ్లిన ఇద్దరు మైనర్ల ముఖాలపై జైలు అధికారులు స్టాంప్ వేశారు. ములాఖాత్‌కు వెళ్లిన వారిలో ఓ బాలిక కూడా ఉన్నది. జైలు అధికారుల నిర్వాకం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై ఆ రాష్ట్ర మానవ హక్కుల సంఘం (ఎంపీహెచ్ఆర్‌సీ) స్పందించింది. ఈ ఘటనపై ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని జైళ్ల శాఖ డీజీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఎంపీహెచ్ఆర్‌సీ పీఆర్‌ఓ ఎల్ఆర్ సిసోడియా తెలిపిన వివరాల ప్రకారం...మైనర్ల ముఖాలపై జైలు అధికారులు స్టాంపింగ్ చేయడాన్ని కమిషన్ సుమోటోగా స్వీకరించిందన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ వారిపై చర్యలు తప్పవన్నారు. ఇదిలా ఉండగా, జైలు సిబ్బంది పొరపాటున మైనర్లపై స్టాంపింగ్ చేశారని సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ దినీష్ నార్గావే బుకాయించేందుకు ప్రయత్నించారు. జైలులో ఉన్న బంధువులను కలిసేందుకు వెళ్లే సందర్శకుల చేతులపై ప్రవేశద్వారం వద్ద స్టాంపింగ్ వేస్తుంటామని తెలిపారు. రాఖీ పండుగ రోజున జైలుకు 8,500 మంది సందర్శకులు వచ్చారని అన్నారు. మైనర్లను గుర్తించేందుకు సిబ్బంది ఇలా చేసి ఉంటారని చెప్పారు. ఈ ముద్రలు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని జైలు సూపరింటెండెంట్ తెలిపారు.

కిడ్నాప్ అభియోగాలు చేర్చడంపై తొందరపడం !

కర్ణిక వేధింపుల కేసులో పోలీసులు

చండీగఢ్ : హర్యానా బీజేపీ అధ్యక్షుడు సుభాశ్ బరాల కుమారుడు వికాస్ బరాలపై నమోదైన వేధింపుల కేసు ఎఫ్ఐఆర్‌లో 'కిడ్నాప్' అభియోగాలు చేర్చే విషయమై తొందర పడటం లేదని సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ఈష్ సింఘాల్ తెలిపారు. వికాస్ బరాలా అతని స్నేహితునితో కలిసి తనను వేధింపులకు గురిచేసినట్లు ఐఎఎస్ అధికారి కుమార్తె కర్ణిక కుందు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కర్ణిక ఫిర్యాదు మేరకు పోలీసులు వికాస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటన దర్యాప్తు విషయమై పోలీసులు అనేక విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ కిడ్నాప్ అభియోగాలు నమోదు చేయడంలో తొందరపడమని తెలిపారు.

రాజకీయ ఒత్తిడి లేదు : ఎస్పి సింఘాల్

వేధింపుల సంఘటనపై ఈష్ సింఘాల్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేసు దర్యాప్తు విషయంలో తమపై ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేదన్నారు. కొంతమంది ఊహిస్తున్నటు నేరాన్ని కప్పి పుచ్చే ప్రయత్నమేది జరగడం లేదన్నారు. తమపై రాజకీయ ఒత్తిడే ఉంటే తొలి రోజే ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉండేవారంకాదన్నారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. వేధింపులు జరిగాయన్న మార్గంలో ఏర్పాటు చేసిన సీసీటీవీలను సాంకేతికంగా విశ్లేషిస్తున్నామని చెప్పారు. సాంకేతిక విశ్లేషణ పూర్తయిన వెంటనే దానికనుగుణంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇప్పటి వరకు కిడ్నాప్ అభియోగాలను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదన్నారు.

సీసీటీవీ ఫుటేజ్‌లపై పోలీసుల భిన్న కథనాలు

హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి వి.ఎస్. కుందు కుమార్తె కర్ణిక కుందు వేధింపుల కేసులో సీసీటీవీల ఫుటేజ్‌లపై పోలీసులు రెండు రోజుల్లో భిన్న కథనాలు వినిపించారు. ఈ కేసు దర్యాప్తు విషయమై పోలీసులు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనపై డీజీపీ తేజిందర్ సింగ్ లూథ్రా మీడియాతో మాట్లాడుతూ నిందితులు బాధితురాలి వెంటపడినట్లు సీసీటీవ ఫుటేజ్‌ల నుంచి సమాచారం సేకరించామన్నారు. టాటా సఫారీలో బాధితురాలిని వేధిస్తున్నట్లున్న సీసీటీవీ ఫుటేజ్‌లు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. పోలీసులు ఏర్పాటు చేసిన సీసీటీవీల నుంచి సమాచారం సేకరించారా? లేక ప్రైవేటు సీసీటీవీల నుంచి సమాచారం సేకరించారా? అనే అంశంపై స్పష్టత ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు.

ఆ మార్గంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజ్‌లు సేకరించేందుకు తాము ప్రయత్నించామని, అయితే అవి ఆగస్టు 1 నుంచి పనిచేయడం లేదని సోమవారం డీఎస్‌పీ సతీష్ కుమార్ మీడియాకు తెలిపారు.

కప్పి పుచ్చే యత్నం : పంజాబ్ సీఎం అమరిందర్ సింగ్

ఈ ఘటనలో వికాస్ బరాలపై నమోదు చేసిన అభియోగాలను నీరుగార్చే యత్నాలు జరుగుతున్నాయని పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్ ఆరోపించారు. మంగళవారం మాట్లాడుతూ ఈ కేసులో బీజేపీ నేతలను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, నిందితులను ఎవరూ రక్షించలేరని వ్యాఖ్యానించారు.

తాగునీటి కోసం 15 టీఎంసీలు విడుదల చేయండి

- కర్నాటక నీటిపారుదల మంత్రికి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల నుంచి 15 టీఎంసీల నీరు విడుదల చేయాలని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు కర్నాటక ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బీబీ పాటిల్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రం లోని హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలతో పాటూ నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి పేర్కొ న్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి పుట్టంగండి ద్వారా ఈ ప్రాంతా లకు ఇప్పటి వరకూ తాగునీరు సరఫరా చేశామని ఆయన తెలిపారు. నాగార్జునసాగర్‌లో నీటి ప్రవాహాలు లేనందువల్ల ప్రస్తుత నీటిమట్టం కనిష్ఠ స్థాయికి చేరిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజీ స్థాయి 510 అడుగులు కాగా ఇప్పటికే 500.50 అడుగులకు చేరిందని, ప్రాజె క్టులో ఇన్‌ఫ్లో పెరగక పోతే మంచినీటి సరఫరా కూడా కష్టతరమవుతుందని తెలిపారు.

సంపాదకీయం

ద్వంద్వ నీతి

వస్తుసేవల పన్నులు (జీఎస్‌టీ) రాష్ట్రానికి మస్తు మంచిచేస్తాయని కేంద్ర పన్నుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం మెప్పు పొందాలనుకుంది. కేసీఆర్ అన్ని రాష్ట్రాల కంటే ముందే అసెంబ్లీ పెట్టి జీఎస్‌టీ ఆమోదించారు. వస్త్ర వ్యాపారులు, బీడీ పరిశ్రమ, వ్యవసాయం, చిన్న పరిశ్రమల నుండి ఆందోళన వ్యక్తమైంది. అప్పుడు కేసీఆర్ పన్నులు విధానం మీద ఏం ఫికర్ పడొద్దన్నారు. అధికారులు సదస్సులు పెట్టి టాక్స్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉన్నట్టుండి ఇప్పుడు జీఎస్‌టీ మీద ముఖ్యమంత్రి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పన్నుల విధానం మీద అధ్యయనం చేసి అవగాహనకు రాకుండానే అసెంబ్లీలో ఆమోదించారా? లేక గుడ్డిగా కేంద్రం మెప్పు పొందటం కోసం ఈపని చేశారా? కేంద్రం వద్ద ఏ ప్రయోజనాలు ఆశించి అంతవేగంగా ఆమోదించారో కేంద్ర రాష్ట్ర పాలకులు నోరువిప్పితేనే ఆ రహస్యం బయటపడుతుంది.

ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు మేలుకోవాలి. కేంద్రంతో కొట్లాడి హక్కులు సాధిస్తారనుకుంటే, ఉన్న హక్కులు ఊడగొడుతున్నారు. ప్రజలు పాలకుల ద్వంద్వ నీతి అర్థం చేసుకోవాలి. తెలంగాణ తెగువ చూపాలి.

ఏదైనా ఒక కొత్త చట్టం చేయాలంటే అందులో ప్రజలకు కలిగే లాభనష్టాలను బేరీజు వేయాలి. రాష్ట్ర ప్రయోజనాలు ఎంతవరకు నెరవేరుతాయో ఓ అంచనాకు రావాలి. పాత చట్టం కంటే కొత్త చట్టంలో మెరుగైన అంశాలు ఏమున్నాయో నిర్ధారణకు రావాలి. ఒకటికి పదిసార్లు ఆలోచించాలి. ఈ సంగతులన్నీ పాలకులకు తెలియవనుకోలేము. అయితే వీటికన్నా మించిన స్వార్థ రాజకీయ ప్రయోజనాలు ఏవో ఉండి ఉంటాయి. అందుకే రాష్ట్రం చేతిలో ఉన్న హక్కులను కేంద్రానికి ధారాదత్తం చేసి ఇప్పుడు కేంద్రంపై ఘర్షణ పడటం ఎవరిని నమ్మించటానికి? అర్థాంతరంగా రాష్ట్ర ప్రయోజనాలు ఎందుకు గుర్తుకు వచ్చాయో పాలకులకే తెలియాలి.

రాష్ట్రంలో రూ.2.30 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జీఎస్‌టీ 18శాతం పన్నులు నిర్ణయించటం వలన రాష్ట్ర ఖజానాకు మోయలేని భారం పడుతున్నది. 12శాతానికి తగ్గించినా భారం రాష్ట్రం భరించటం కష్టమంటున్నారు. రూ.19వేల కోట్ల భారమని తేల్చారు. బడ్జెట్ సవరించటం సాధ్యం కాదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖరాయటానికి అధికారులతో సమావేశం నిర్వహించి సరైన అంచనాలు ఇవ్వాలని కోరటమంటే జీఎస్‌టీ భారాల మీద సర్కార్‌కు సరైన అవగాహన అంతగా లేదన్న సంగతి తేటతెల్లమైంది. అంచనా ఉంటే ఇప్పుడు కొత్తగా ఎందుకు లెక్కలు అడుగుతున్నారు?

డబుల్ బెడ్రూం ఇండ్లు, నీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథలాంటి పథకాలకు కాలపరిమితి నిర్ణయించుకొని పాలకులు ముందుకు పోతున్నారు. ఆ పథకాలన్నీ ఆలస్యమయ్యే పరిస్థితి లేకపోలేదు. దానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుంది. కాబట్టి ముందునుండే కారణాలను వెతుకుతున్నట్టు కనబడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం మీద వచ్చే వ్యతిరేకతను కేంద్రం మీదకు మళ్లించాలని చూస్తున్నారు. అందుకే ప్రాజెక్టులకు బయటి నుంచి ఆర్థిక సంస్థల దగ్గర అప్పులు తీసుకున్నారు. జీఎస్‌టీ వలన ప్రాజెక్టులు, పథకాలు ఆలస్యమవుతాయని ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తున్నట్టు అర్థమవుతున్నది. జీఎస్‌టీ మధ్యలో వచ్చింది. ఎప్పటి నుంచో పనులు నడుస్తున్న అభివృద్ధి పథకాలకు వర్తింపచేయటం న్యాయం కాదని పాలకులు నీతులు వల్లిస్తున్నారు. కేంద్రానికి రాయాలని భావించిన లేఖను మళ్ళీ ఎందుకు ఆపారు? జీఎస్‌టీ అమలు చేయటం మూలంగా రాష్ట్రాల ఆదాయం తగ్గితే కేంద్రమే ఆ లోటు పూడ్చాలనీ చట్టంలో ఉంది. ప్రభుత్వానికి జీఎస్‌టీ మీద అవగాహన ఉంటే, అధ్యయనం చేస్తే నడుస్తున్న అభివృద్ధి పనులకు పాత పన్నుల విధానమే కొనసాగించాలని ఎందుకు పట్టుపట్టలేదు. చేతిలో ఆయుధాన్ని జార విడుచుకొని అవసరమైతే న్యాయపోరాటం చేస్తామనడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదే.



జీఎస్‌టీ అమలులో కేంద్రం ఏకపక్ష నిర్ణయమని కేసీఆర్ అంటున్నారు. కేంద్రం అడిగిందే తడవుగా వెనుకా ముందూ ఆలోచించకుండా ప్రజా ప్రయోజనాలు పట్టించుకోకుండా నిర్ణయం చేసినప్పుడు ఈ మాట గుర్తుకురాలేదా! ప్రభుత్వాలు ఎటువంటి అవగాహన కల్పించకుండా లాభనష్టాలు ఆలోచించకుండా అమలుకు పూనుకోవడం అన్యాయం. చాలా రాష్ట్రాలు ఆందోళనలో పడ్డాయి. రాష్ట్రాల ఇబ్బందులను కోర్కెలను తీర్చవల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. జీఎస్‌టీ మీద చర్చ కొత్తగా కొనసాగుతున్నది కాదు. గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్నది. జీఎస్‌టీ ప్రభావాలు రాష్ట్రం మీద ఎట్లా ఉంటాయో అధ్యయనం చేయకుండానే హడావుడిగా ఆమోదించిన రాష్ట్ర పాలకుల పాపం విస్మరించజాలం కదా! ఇప్పుడు కేంద్రం బలంగా ఉన్నది. రాష్ట్రాలు బలహీనంగా తయారయ్యాయి. కాబట్టి రాష్ట్రాల హక్కులను సులభంగా కేంద్రం హరిస్తున్నది. 1984లో సింగపూర్‌లో ఈ విధానం అమలులోకి వచ్చిన తర్వాత ద్రవ్యోల్బణం ఒక్కసారిగా పెరిగింది. మలేషియాలో కూడా ఇటువంటి అనుభవమే ఎదురైంది. జీఎస్‌టీ వలన పన్నులు తగ్గి భారం దూరమవుతుందనుకున్న ప్రజలకు ఉపాధి పోయి ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు మేలుకోవాలి. కేంద్రంతో కొట్లాడి హక్కులు సాధిస్తారనుకుంటే, ఉన్న హక్కులు ఊడగొడుతున్నారు. ప్రజలు పాలకుల ద్వంద్వ నీతి అర్థం చేసుకోవాలి. తెలంగాణ తెగువ చూపాలి.

ప్రజావాణి

చెడు వ్యసనాల బారిన 'యువత'

నేటి యువత కిక్ కోసం ఏ పనైనా చేయడానికి వెనుకాడటం లేదు. సరిగ్గా ఇటువంటి ప్రవర్తన ఉన్న యువతనే లక్ష్యంగా చేసుకుంటున్నారు మత్తువ్యాపారులు. తొలుత చాటుమాటుగా జరుగుతున్న ఈ కిక్ భాగోతం, కొన్నాళ్లకు మత్తుకు బానిసలై ఈజీగా బయటపడిపో తున్నారు. ఇలా మత్తుజగత్తులోకి జారుతున్న భవిష్యత్ తరం గురించి ఆలోచిస్తే ఆందోళన కలుగుతున్నది. ఏది ఏమైనా భావితరానికి బంగారుబాట వేయాల్సిన యువతరం ఇలా మత్తులో కూరుకుపోవడం బాధాకరం. డ్రగ్స్, మద్యం, సిగరెట్, గుట్కా లాంటి చెడు వ్యసనాల బారిన పడుతున్న యువత అన్ని వర్గాల కుటుంబాలకు చెందినవారు ఉంటున్నారు. మధ్యతరగతి, దిగువ, ఎగువ మధ్యతరగతి కుటుంబాలతో పాటు సంపన్న కుటుంబాల పిల్లలు వీరిలో ఎక్కువగా ఉంటున్నారు. విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమైనది. ఓ వ్యక్తి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నా, అథోగతిపాలు కావాలన్నా ఈ దశ కీలకం. విద్యార్థులకు చదువుతో పాటు పాఠశాల, కళాశాలల్లో, యూనివర్సిటీల్లో సామాజిక అంశాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. ఆ సదస్సుల్లో పేదరికం, విద్య, తల్లిదండ్రులు, గురువుల గొప్పతనాన్ని తెలుపుతూ.. విద్యార్థి, యువతకు సక్రమమార్గంలో నడిపించేందుకు సహాయపడుతుంది.

గుండమల్ల సతీష్‌కుమార్.
సంస్థాన్‌నారాయణపురం.

ఆనాటి చెలిమి ఏదీ..

ఆనాటి స్నేహాల గురించి ఎంత చెప్పినా తక్కువే. బాల్యం నుండే ఎక్కడెక్కడివారో కలసిమెలసి ఉండేవారు. లెక్కలేనన్ని బాల్యక్రీడలతో ఆనందంగా గడిపి, ఐకమత్యాన్ని, సంఘీభావాన్ని పెంపొందించుకొనేవారు. పరోపకార బుద్ధినీ అలవరచుకొనేవారు. ఒకరికొకరు కష్టసుఖాలలో తోడుగా ఉంటూ, స్నేహబంధపు మాధుర్యాన్ని చవిచూసేవారు. కులమత బేధాలు ఉండేవి కావు. బాల్యం నుండీ జీవితాంతం వరకూ ఆ స్నేహాలు అలా కొనసాగేవి. కానీ నేడు అలాంటి పరిస్థితులు లేవు. బాల్యం నుండీ మొబైల్ గేమ్స్, ఇంటర్నెట్, సోషల్‌మీడియాకు బానిసలై ఎవరితో సంబంధం లేకుండా ఉంటున్నారు. ఇంట్లో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్యే సఖ్యత లేదు. ఇక క్రీడలంటే క్రికెట్ తప్ప మరొకటిలేదు. ఈ పరిస్థితిలో మార్పురావాలి. వెనుకటి వాతావరణం మళ్లీ రావాలి. అందుకు తల్లిదండ్రులు, పెద్దలు, గురువులు సహకరించాలి. ఆనాటి స్నేహ పరిమళాలు గుబాళించాలి.

ఎస్.ఎస్.రాజు, వనస్థలిపురం.

మనం ఏ తెలంగాణలో ఉన్నాం..?

సహస్ర

ఈ వ్యాసం ప్రారంభిస్తున్నప్పుడు చాలా నిరాశలో ఉన్నాను. ప్రజాస్వామ్యం మీద నమ్మకం పోయింది. తెలంగాణపై పెట్టుకొన్న ఎన్నో ఆశలు నీరుగారిపోయాయి. ఉద్యమ నాయకుడు కేసీఆర్ కొత్త తెలంగాణకు మాకు ముఖ్యమంత్రి అవుతున్నాడనే సంతోషం ఎప్పుడో చిందరవందరయి ఒక భయానకమైన చీకటిలోకి మనసు వెళ్లిపోయింది. నేరెళ్ల ఘటన చూచిన తర్వాత మనం ఏ తెలంగాణలో ఉన్నాం..? అనే ప్రశ్న ఉదయించింది. ఆ తర్వాత నిన్నా మొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల ధోరణి, వాడిన భాష కమ్యూనిస్టులను 'నా కొడుకులు' అనటం... చూసిన తర్వాత వీరేనా కేసీఆర్... ఈయనేనా ఉద్యమనాయకుడు... తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల గూర్చి ఉద్యమ కాలంలో ఎంతో భాషాపరంగా, సంస్కారంగా మాట్లాడిన కేసీఆరేనా ఇలా మాట్లాడుతుంది అనిపించింది. ఒక బాధ, ఒక దుఃఖం ఆవహించింది. ప్రతిపక్షాలు విమర్శిస్తాయి. రాజకీయ చదరంగంలో వాళ్లపని అది. కాంగ్రెస్ సంస్కారం అందరికి తెల్సిందే! నిజానికి తెలంగాణ కావాలని తెలంగాణ ప్రజలు అన్ని ఏండ్లు ఉద్యమించటానికి ఒకరకంగా కాంగ్రెస్‌పార్టీ కారణం. ఇష్టం ఉన్నా లేకున్నా బలమైన కాంగ్రెస్ వ్యతిరేకత మనసులో నిండిన ప్రజలు బీజేపీ తలకెత్తుకున్నారు. ఏదో ఉద్ధరిస్తారని, నరేంద్రమోడీని ప్రధాని కుర్చీలో కూర్చోపెట్టలేదు. కాంగ్రెస్ వ్యతిరేకత ప్రధాన కారణం. ఇప్పటికీ కాంగ్రెస్ వ్యతిరేకత తెలంగాణ ప్రజల గుండెల్లో ఉంది. కమ్యూనిస్టులు మొదటి నుంచీ కాంగ్రెస్ వ్యతిరేకులే... ప్రజలు ముఖ్యం. ప్రజల ఆశలు ముఖ్యం. వాళ్లు కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారు. కమ్యూనిస్టులను తూలనాడితే కేసీఆర్‌కు లాభమేమిటో అర్థం కాదు. కమ్యూనిస్టులు మోడీ పరిపాలనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ వ్యతిరేకతలో ఓ సైద్ధాంతిక దృక్పథం, లౌకికవాదం రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉంది. తన మాటల ద్వారా కేసీఆర్ కాంగ్రెస్‌కు జీవం పోస్తున్నారు. కేసీఆర్ కొంత హుందాగా మాట్లాడితే.. ప్రజాస్వామ్య భావజాలంతో మాట్లాడితే కాంగ్రెస్ ఇంతగా ఎగిసిపడేది కాదు. కేసీఆర్ ఇప్పుడు ఉద్యమకాలం నేతగా కనిపించకపోవటం తెలంగాణ చరిత్రలో ఒక విషాద పరిణామం. తెలంగాణ అస్తిత్వానికి కేసీఆర్ ముఖ్యమంత్రి కావటం అవసరమని మొదట్లో బలంగా భావించిన నాలాంటి వాళ్లకు జరుగుతున్న పరిణామాలు ముఖ్యమంత్రి భాష మింగుడు పడని విషయాలు.. ముఖ్యమంత్రి కేసీఆర్ దిగజారి మాట్లాడితే ఎలా? ఆయనే అన్నారు "ఇప్పటి దాకా ముఖ్యమంత్రినని హుందాగా మాట్లాడుతున్నాను ఇక ముందు మునుపటి కేసీఆర్ నవుతాను" అన్నారు. నిజం చెప్పాలా? మునుపటి కేసీఆరే బాగున్నారు. ఉద్యమ నాయకునిగా, తెలంగాణ సాధించిన నాయకునిగా కేవలం తన మాటల ద్వారా తన చరిత్రను పదమూడేండ్ల చరిత్రను తానే చెరిపేసుకుంటున్నారు. తెలంగాణ ప్రజల సెంటిమెంట్‌ను గ్రహించటంలో కేసీఆర్ విఫలమయ్యారు. ప్రజలు ఆదర్శ ముఖ్యమంత్రిని కోరుకుంటారు. ప్రతిపక్షాలను ప్రజల అభిప్రాయాలను గౌరవించే ముఖ్యమంత్రిని కోరుకుంటారు. కమ్యూనిస్టులను నా కొడుకులు అనటం 'నవతెలంగాణను ఈ రాష్ట్రంలో అవసరమా' అనటం కించపరిచే మాటల మూలంగా రాజకీయంగా లాభమా?

ఇదంతా చూస్తుంటే... ఏ తెలంగాణలో వున్నామో అర్థం కావటం లేదు. బంగారు తెలంగాణ జాడ లేదు. ఇది ప్రజాస్వామ్య తెలంగాణ కాదు. ఆదర్శ తెలంగాణ కాదు. ప్రజల తెలంగాణ కాదు. బడుగువర్గాల తెలంగాణ కాదు. ఏ తెలంగాణ?

"కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి. ప్రజలు ఎన్నుకొన్న ముఖ్యమంత్రి, మా ముఖ్యమంత్రి ఇలా ఉండాలి.." మా అభిప్రాయాలు మన్నించాలి... ప్రజలు భావించే హక్కుంది. ప్రజలకు చెప్పే హక్కుంది. ప్రజల హక్కును ముఖ్యమంత్రి అంగీకరించాలి. ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదారి పట్టిస్తే... మాటల ద్వారా కాదు అభివృద్ధి ద్వారా జవాబు చెప్పాలి. ప్రజలు చాలా గొప్పవాళ్లు. ఎవరు ఏమిటో వారికి తెలుసు. ఎన్నికలలో తేల్చేస్తారు. రాజకీయాలు హుందాగా ఉండాలి. దిగజారి మాట్లాడటం ఎవరికీ మంచిదికాదు. ప్రజలు గమనిస్తుంటారు. దిగజారి మాట్లాడటం హీరోయిజంగా భావించరు. అసహ్యించుకుంటారు.

ప్రజలెప్పుడూ అభివృద్ధి పాలన కంటే ఆదర్శ పాలన కోరుకుంటారు. మంచి జరుగకున్నా ఫర్వాలేదు. చెడు జరగకపోతే చాలు అనుకుంటారు. నేరెళ్ల ఘటన ఏ ఆదర్శ పరిపాలనకు నిదర్శనంగా భావించగలం?

ఇదంతా చూస్తుంటే... ఏ తెలంగాణలో వున్నామో అర్థం కావటం లేదు. బంగారు తెలంగాణ జాడ లేదు. ఇది ప్రజాస్వామ్య తెలంగాణ కాదు. ఆదర్శ తెలంగాణ కాదు. ప్రజల తెలంగాణ కాదు. బడుగువర్గాల తెలంగాణ కాదు. ఏ తెలంగాణ?

టీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాటల తీరు మింగుడు పడటం లేదు. మాటలలో కనీస రాజకీయ సంస్కారం ఉండటం లేదు. ప్రతిపక్షం సరే... సహనం తక్కువగా ఉంటుంది. పాలకపక్షం హుందాగా ఉండాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. తన వాళ్లు తప్పు మాట్లాడితే సవరిస్తూ పోవాలి. "మీ పాలనలో ఏమి జరిగింది? ఇది జవాబు కాదు కాంగ్రెస్ పాలన ప్రజలకు నచ్చలేదు. కనుకే టీఆర్‌ఎస్‌కు పట్టాభిషేకం చేసారు. ఈ సంగతి మర్చిపోకూడదు.

విచిత్రంగా తెలంగాణ సాధన గూర్చి టీఆర్‌ఎస్, కాంగ్రెస్ మాటలు విసురుకుంటారు. "మేము తెచ్చాం.." "మా కాంగ్రెస్ ఇచ్చింది" "సోనియా ఇచ్చింది" తెలంగాణ అనేది సోనియా ఇంటిసొత్తుకాదు. కేసీఆర్ రాజకీయ సొత్తుకాదు. తెలంగాణను ప్రజలు ఉద్యమించి సాధించి తెచ్చుకున్నారు. రాజకీయ నాయకులు చరిత్రను వక్రీకరిస్తున్నారు. ప్రజల త్యాగాన్ని, ఉద్యమాన్ని, పోరాటాలను, అవమానం చేస్తున్నారు. ఈ మాటలు ఎక్కడికి దిగజారాయి? తెలంగాణ కొరకు ఇంకెందుకో సోనియా కాళ్ల మొక్కాడని కాంగ్రెస్ నాయకులు పత్రికా ముఖంగా అనటం... ఇది టీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్‌కు గొప్ప కావచ్చు. తెలంగాణ ప్రజలకు అవమానం... తెలంగాణ ప్రజలు ఉద్యమించి తెలంగాణ తెచ్చుకున్నారు. కాళ్లు మొక్కికాదు.

ఒక భయం నాలాంటి వాళ్లను పట్టుకుంది. తెలంగాణను ఏలాలని ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ కాచుకు కూర్చున్నాయి. ప్రత్యామ్నాయం కనిపించని దశ... ఈ రెండు పార్టీలకు కమ్యూనిస్టులు సహజ వ్యతిరేకులు... కేసీఆర్ మాటలు ఎలా ఉన్నాయంటే... వీరిద్దరిలో ఎవరో ఒకరికి అవకాశం యిచ్చేలా ఉన్నాయి. రాజకీయ దూషణలు తెలంగాణ వాతావరణాన్ని బాగా దిగజార్చుతున్నాయి. ఎదుటిపక్షం గూర్చి సంస్కారహీనంగా మాట్లాడటం రాజకీయ నీచత్వం తప్పవేరు కాదు.



పిశాచులు, ఉన్మాదులు, విలన్‌లు, నా కొడుకులు, దగాకోరు, దగుల్బాజీ, అధికారమదం, వీధిరౌడీలు ఇవే ఇటీవల రాజకీయ సంస్కారమాటలు.. ఇవి ప్రజలు నేర్చుకోవాలా? వీరి ఆదర్శాలు, రాజకీయాలు మట్టికొట్టుకుపోనీ...

ఏమాట కామాట చెప్పుకోవాలి. తెలంగాణలో పరిపాలన బాగాలేదని కాంగ్రెస్ నమ్ముతూ ఉంది.ఉద్యమాలు, పోరాటాలు చేయాలి. ప్రజలను అందుకు సమీకరించాలి. ప్రజలు అసంతృప్తిలో ఉన్న మాట నిజమే. ప్రజలను సమీకరించకుండా కోర్టుమెట్లు ఎక్కటం ప్రజాబలం లేనందున అని భావించవచ్చునా?

మధ్యలో ముఖ్యమంత్రి కేసీఆర్ అనవసరంగా కమ్యూనిస్టులను 'నాకొడుకులు' అనేసారు. అనకూడని మాట... నిజంగా బాధకలిగించే మాట. కమ్యూనిస్టులను కేసీఆర్ అర్థం చేసుకోలేదని భావించాలా? 'కమ్యూనిస్టు' పదానికి కేసీఆర్‌కు అర్థం తెలియదా? 'కమ్యూనిస్టు' అంటే పోరాడే వాడు. ప్రజలతో ప్రజల తరపున ఉద్యమించేవాడు. శ్రామికజన ప్రతినిధి. కమ్యూనిస్టులకు సిద్ధాంతాలుంటాయి. వాళ్లకు ప్రజలు ముఖ్యం. పైరవీలు, దళారీలు, అవినీతిపరులుకారు కమ్యూనిస్టులు. పాలకులకు కమ్యూనిస్టులకు ఆకాశానికీ భూమికున్న తేడా ఉంటుంది. పాలకులు దోపిడీ వ్యవస్థ ప్రతినిధులుగా ఉంటారు. అది ఈ వ్యవస్థలో సహజం. తప్పనిసరి పరిణామం. కేసీఆర్ విషయమే కాదు. ఎవరు పాలకులుగా ఉన్నా దోపిడీ వ్యవస్థ ప్రతినిధులే... కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నా ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా కమ్యూనిస్టులు పోరాడుతుంటారు. పోరాట ధోరణి లేనివాన్ని కమ్యూనిస్టుగా గుర్తించరు. ప్రయివేటీకరణ పాలకుల లక్ష్యం... వివిధ పేర్లతో రైతుల నేలను లాక్కోవటం పాలకుల లక్ష్యం... వీటికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఎవరి దారిలో వారుంటారు. వైరుధ్యాలుంటాయి. నా కొడుకులు నీ కొడుకులు అనటం ప్రజలు సహించరు. తెలంగాణలో భౌగోళిక పరిస్థితులు, హైదరాబాద్ కార్పొరేట్ సంస్కృతి, ప్రత్యేక రాజకీయ వాతావరణం కారణంగా ఉద్యమాలు – పోరాటాలు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తెలంగాణ కమ్యూనిస్టులకు పోరాట చరిత్ర ఉంది. తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ జైత్రయాత్ర... వీటి ప్రభావం తెలంగాణ కమ్యూనిస్టులను నిరంతర ఉద్యమ కారులుగా ఉంచుతుంది. ఇది అర్థం చేసుకోవల్సిన అవసరముంది.

నవతెలంగాణ ప్రజల సమస్యలు ప్రతిబింబించే పత్రిక. తనను కీర్తించే పత్రికలే గొప్పవని కేసీఆర్ అనుకుంటే ఎలా? ఇప్పుడు కీర్తిస్తున్న పత్రికలు ఎన్నికల ముందు ప్రజల గాలి మారిందని పసిగడితే దుమ్మెత్తిపోస్తాయి. నవతెలంగాణ లాంటి పత్రికలు ప్రతి విషయాన్ని ప్రజల దృష్టిలో వీక్షిస్తాయి. అయినా మంచిపాలకులకు ప్రజల మనసులు తెల్సుకోవాలంటే కార్పొరేట్ యాజమాన్య పత్రికల కంటే నవతెలంగాణ పత్రికలే మంచివి.

2019 ఎన్నికల వేడిని ఇప్పుడే సృష్టిస్తున్నారు. తెలంగాణలో రాజకీయ పార్టీలు తొందర పడాల్సిన అవసరం లేదు. 2019 వరకు ఎన్నో ఎత్తులు.. జిత్తులు... పొత్తులు... ఎన్నో మారవచ్చు. ఎన్నో పరిణామాలు రావచ్చు. పార్టీలను చీల్చి బలం పెంచుకోవటం అమిత్ షా ఆడుతున్న ఆట. ప్రమాదం పొంచివుంది. ఆ ప్రమాదంలో సెంటిమెంట్ ఉంది. తెలంగాణ రాజకీయ పార్టీలు అనవసర సంస్కారహీన మాటలతో దూరం పెంచుకోవల్సిన అవసరం లేదు.

సెల్: 9949486122




డాక్టర్ కట్టా సత్యప్రసాద్

దేశం కోసం సైన్సు మార్చ్

శాస్త్రవేత్తలంటే ప్రయోగశాలల్లో పరిశోధనలకే పరిమితమవుతారనుకుంటాము. కానీ వాళ్లు కూడా సమాజంలో భాగమే. వారి పరిశోధనలు సమాజాభివృద్ధికి తోడ్పడే ఈ క్రమంలో సైన్సు సైతం అభివృద్ధి చెందాలి. కాని వారు కనుగొంటున్న సత్యాలు, రుజువుల ఆధారంగా నిరూపితమైన అంశాలు ప్రమాదంలో పడినప్పుడు ఆ శాస్త్రవేత్తలు, పరిశోధకులు కూడా గళాలు విప్పవలసి వస్తుంది. అదే జరిగింది ఈ ఏడాది ధరిత్రీ దినోత్సవాన. ఏప్రిల్ 22, 2017 ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర ప్రపంచం పాలకుల అశాస్త్రీయ ధోరణులు, విధానాలపై వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అదే సైన్సు కోసం ముందడుగు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 2012లోనే వాతావరణ మార్పు అంతా బోగస్ అన్నారు. శాస్త్రజ్ఞులు పరిశోధించి రుజువులతో సహా నిరూపించిన వాతావరణ మార్పులను తూనా బొడ్డు అన్నారు. పోయిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎనర్జీ పాలసీ విధానాలపై ఆయన ప్రచారకర్తలు శిలాజ ఆధారిత ఇంధన వనరుల వినియోగం వైపు మొగ్గుచూపారు. అంతే కాదు భూతాపాన్ని తగ్గించేందుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను కట్టడి చేసే అంతర్జాతీయ ఒప్పందమైన పారిస్ ఒప్పందం నుండి వైదొలుగుతానని ప్రకటించారు. అందుకు వారి చట్టసభల ఆమోదాన్ని నిన్న, మొన్న పొందారు. ఇదంతా వారి స్వార్థ ప్రయోజనాల కోసం, ఇష్టా యిష్టాలను బట్టి నిరూపితమైన సైన్సును కొట్టివేస్తున్నారు. ఇది శోచనీయం. దీన్ని మొగ్గలో తుంచ వలసి ఉంది. అందుకే ప్రపంచ వ్యాపితంగా ఉన్న శాస్త్రజ్ఞులు ఏకకంఠంతో సైన్సును రక్షించేందుకు పిలుపునిచ్చారు. ధరిత్రి దినంనాడు ప్రపంచం లోని అన్ని ముఖ్య పట్టణాల్లో ఊహించనంతగా సైన్సు ప్రేమికులు, శాస్త్రజ్ఞులు వీధుల్లోకి వచ్చారు. 600కు పైగా నగరాల్లో ఈ ప్రదర్శనల్లో పదిలక్షలకు పైగా శాస్త్రజ్ఞులు పాల్గొన్నారు. సైన్సు కోసం చేసిన ఈ మార్చ్ రుజువుల ఆధారంగా విధాన నిర్ణయాలు చేయాలనీ, పరిశోధనలకు ప్రభుత్వ నిధులను పెంచాలనీ, సైన్సు ప్రపంచం నిగ్గుతేల్చిన వాతావరణ మార్పును, పరిణామవాదాన్నీ ప్రభుత్వాలు అంగీకరించాలనే లక్ష్యాలతో జరిపారు.

ఈ గ్లోబల్ సైన్సు మార్చ్‌తో స్ఫూర్తి పొందిన భారతీయ శాస్త్రవేత్తలు, సైన్సు ప్రేమికులు ఆగస్టు 9వ తేదీన సైన్సు కోసం మన దేశవ్యాపితంగా సైన్సు మార్చ్ జరపాలని నిర్ణయించి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికి 400పైగా శాస్త్రజ్ఞుల, శాస్త్ర ప్రచార సంస్థలు దీనిలో భాగస్వాములయ్యేందుకు అంగీకరించారు. శాస్త్ర పరిశోధనల కోసం మన ప్రభుత్వం చేసే ఖర్చు నానాటికీ తగ్గిపోతున్నది. భారత ప్రభుత్వ ప్రత్యక్ష నిధుల వల్లనే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనదేశ శాస్త్రవేత్త ఎన్నో గొప్ప పరిశోధనలు చేసి దేశఖ్యాతి నలు దిశలా చాటారు. గురుత్వాకర్షణ తరంగాలు, హెగ్స్‌బోసాన్, గ్రహాంత అంతరిక్ష నౌకల రూపకల్పన 'మంగళయాన్' ఇంకా ఎన్నెన్నో అద్భుత శాస్త్రవిజయాలు మన శాస్త్రవేత్తల కృషిఫలితమే. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడకుండా స్వదేశీ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన ఎందరో శాస్త్రజ్ఞులకు జేజేలు పలకాలి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన ఘనతకూడా మన వైజ్ఞానికులదే. శాస్త్రరంగంలో దేశం సాధించిన స్వావలంబనకు ఇది నిదర్శనం. దీన్ని మరింత ముందుకు తీసుకుపోవటానికి ప్రభుత్వం పరిశోధనా సంస్థలకు మరిన్ని నిధులు సమకూర్చాలి. పరిశోధనా సంస్థలలో, యూనివర్సిటీలలో మెరికల్లాంటి యువకులకు అవకాశాలు కల్పించి వారికి ఉపాధినివ్వటమే గాక దేశం ముందుకు పోయేందుకు పూనుకోవాలి. విద్యారంగానికి మన జాతీయాదాయంలో కనీసం 10శాతం



నిధులివ్వాలని మేథో ప్రపంచం సూచిస్తున్నది. ఇందులో పరిశోధనా రంగానికి 3శాతం నిధులైనా ఇవ్వాలి. శాస్త్ర పరిశోధనల్లో వెనుకబడితే అది మరల దేశాన్ని పరాధీనతవైపు మళ్లిస్తుంది. ఇటీవలి కాలంలో శాస్త్ర పరిశోధనా సంస్థలు వాటి నిధులను వారే సమకూర్చుకోవాలని ప్రభుత్వం చెబుతున్నది. ఇంతకు మించి అశాస్త్రీయత ఇంకొకటి ఉండదు. పరిశోధనలన్నీ లాభాలు ఆర్జించటానికే కాదు. మౌలిక పరిశోధనలు లేకుండా లాభాలు సంపాదించే సాంకేతిక జ్ఞానం రాదు. గత రెండు మూడేండ్లుగా భారత సమాజంలో అశాస్త్రీయ ధోరణులు, ఛాందస భావాలు పేట్రేగి ఒకరి ఉనికిని మరొకరు, సాటివారి భావాలను, నమ్మకాలను ఓర్వలేని తనం పెచ్చరిల్లుతున్నది. పరమత సహనం లోపించి ద్వేషం పునాదిగా హత్యలు జరగటం శాస్త్ర ప్రపంచాన్ని కలవర పెడుతున్నది. మన రాజ్యాంగంలో పేర్కొన్న ముఖ్యమైన పౌరవిధి ప్రజల్లో మానవతా విలువలు, పరిశీలనాతత్వం అంతకు మించి సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోది చేయవలసిన ప్రభుత్వమే అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నది. మన రాజ్యాంగ లక్ష్యమైన 51ఎలో పేర్కొన్న సైంటిఫిక్ టెంపర్ కోసం ఈ సైన్సు మార్చ్ ఉద్దేశించబడింది. రుజువులపై ఆధారపడిన అంశాలను ప్రోత్సహించాలని, విద్యార్థుల్లో పరిశీలనా తత్వాన్ని పెంపొందించాలని కూడా ఈ సైన్సుమార్చ్ అభిలషిస్తున్నది. మనదేశం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పారిస్ ఒప్పందం కోసం కృషి చేయటం సంతోషించదగిన పరిణామం.

జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు సైన్సుకు, శాస్త్రీయ దృక్పథానికీ హాని కలిగిస్తున్న నేపథ్యంలో శాస్త్రవేత్తలు అప్రమత్తం కావల్సిన సమయమిది. మన ప్రజల ఆరోగ్యానికీ, ఆర్థిక వ్యవస్థకూ, ఆహార భద్రతకూ కీలకమైన సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్నీ తిరోగమనవాదులు, సైన్సు విరోధుల నుండి కాపాడుకోవాలి. ఈ సందర్భంలో మన శాస్త్ర పరిశోధనలు దేశ సగటు మనిషి క్షేమానికి తోడ్పడుతున్నాయా లేక కొందరు కార్పొరేట్ల ధనదాహానికి వంత పాడుతున్నాయో శాస్త్రవేత్తలు తేల్చుకోవాలి. సామాన్య ప్రజల కోసం, దేశం కోసం, దేశ స్వావలంబన కోసం మనం కంకణంబద్ధులం కావాలి. అందుకు ముందుగా సైన్సును కాపాడుకోవాలి. ప్రతి ఒక్కరం ఆగస్టు 9న జరిగే సైన్సు మార్చ్‌లో పాల్గొందాం.

సెల్: 9490098918

స్వయం పాలిత ఆదివాసీ రాష్ట్రంగా ప్రకటించాలి

కుంజా శ్రీను

చెక్కుల పంపిణీ అనంతరం కలెక్టర్ వెనుదిరిగారు. ఆయన కారును అంబేద్కర్ కాలనీ దళితులు వంతెనపై బైఠాయించి అడ్డుకున్నారు. తమకు పూర్తి న్యాయం చేయాలని నినదించారు. పోలీసులు కలెక్టర్ కారును యనమదుర్రు కాలువ గట్టుపై నుంచి యండగండి పంపారు. కలెక్టర్ భాస్కర్ సబ్ కలెక్టర్ కారులో తాడేపల్లిగూడెం రోడ్డు మీదుగా యండగండి చేరుకున్నారు. దళితుల ఆందోళనకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు ఎ.రాజు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఎంఎల్ఎ శివరామరాజు, ఎస్సి, ఎస్టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు దాసరి ఆంజనేయులు దళితులతో మాట్లాడి సర్దిచెప్పారు.

అంబేద్కర్ కాలనీ దళితులకు చెక్కుల పంపిణీ

అనంతరం గరగపర్రులోని చర్చిలో అంబేద్కర్ కాలనీ దళితులకు పరిహారం చెక్కులను అధికారులు అందజేశారు. కొంతమంది దళితులకు పరిహారం రాకపోవడంతో గందరగోళం నెలకొంది. అధికారులు వారికి నచ్చజెపి పరిహారం రాని కుటుంబాల పేర్లను సేకరించారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తా: హర్షకుమార్

రాష్ట్రప్రభుత్వం గరగపర్రు దళితులకు తీవ్ర అన్యాయం చేసిందని, నష్టపరిహారాన్ని అందరికీ ఇవ్వకుండా కొంత మందికే ఇవ్వడం దుర్మార్గమని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. గరగపర్రులో పర్యటించిన ఆయన దళితులతో మాట్లాడారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రధాని మోడీతో మాట్లాడతానని చెప్పారు.

సదావర్తి భూములకు మళ్లీ వేలం : హైకోర్టు

హైదరాబాద్ : చెన్నైలోని ఏపీ దేవాదాయ, ధర్మా దాయ శాఖకు చెందిన కోట్ల రూపాయల విలువైన సదావర్తి సత్రం భూములపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సదావర్తి భూములను మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సదావర్తి భూములను తక్కువ ధరకే వేలం నిర్వహించి ప్రభుత్వానికి నష్టం చేకూర్చారని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవీలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది.

రూ. 22.44 కోట్ల కంటే అదనంగా రూ. 5 కోట్లు చెల్లించే వారు ముందుకు వస్తే ఆ వేలాన్ని రద్దు చేస్తా మని ఏపీ సర్కార్ హైకోర్టుకు చెప్పింది. అదనపు సొమ్మును కూడా కలిపి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల చెల్లించారు. ఈ మొత్తం రూ.27.44 కోట్లను కనీస వేలం ధరగా నిర్ణయించి సదావర్తి భూముల్ని తిరిగి వేలం వేయాలని బెంచ్ ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. చెన్నైలోని 83 ఎకరాల భూమి వేలం ప్రకటనలను జాతీయ పత్రికల్లో కూడా ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆరు వారాల్లో వేలం ప్రక్రియ పూర్తి చేయాలని, వేలంలో పిటిషనర్ ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొనే అవకాశం ఇవ్వాలని, వేలం ఎప్పుడేస్తారో కూడా తెలియజేయాలని హైకోర్టు ఆదేశిం చింది. సెప్టెంబర్ 21 జరిగే తదుపరి విచారణ సమయంలో వేలం ప్రక్రియ వివరాలు సమర్పించాలని సూచించింది. తొలుత వేలంలో రూ.22.44 కోట్లకు భూములు దక్కించుకున్న వారి తరపు న్యాయవాది బి.చంద్రసేన్‌రెడ్డి వాదిస్తూ.. గతంలోని పిల్‌లోని అంశాల్నే ఆళ్ల రిట్‌లో పేర్కొన్నారని, రిట్ వెనుక సరైన ఉద్దేశం లేదన్నారు.

రిట్ వేసి భూమిని కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పిటిషనర్ ఉద్దేశం తెలుసుకునేందుకే రూ.5 కోట్లు అదనంగా చెల్లించమని పిటిషనర్‌ను కోరామని, రూ. 27.44 కోట్లు చెల్లించి సదుద్దేశాన్ని వెల్లడించుకున్నారని బెంచ్ వివరించింది. మళ్లీ వేలం వేలం వేస్తే ప్రభుత్వానికి ఎక్కువ డబ్బు వస్తుందని కూడా పేర్కొంది. ఈ దశలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది డి.రమేశ్ కల్పించుకుని నెల రోజుల గడువు సరిపోదన్నారు.దీంతో ఆరు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని బెంచ్ ఆదేశిస్తూ తదుపరి విచారణ వచ్చే నెల 21కి వాయిదా వేసింది.

పునరావాసం తరువాతే పోలవరం పనులు

- అవగాహనా సదస్సులో భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య

తూర్పుగోదావరి : గిరిజనులకు పునరావాసం కల్పించాకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను చేపట్టాలని భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కూనవరంలోని రాజ్యలక్ష్మి కళ్యాణ మండపంలో పోలవరం నిర్వాసితులకు మంగళవారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు జేసీ మల్లికార్జున రావు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు దినేష్‌కుమార్, చినబాబు హాజరయ్యారు. సదస్సులో ఎంఎల్ఎ రాజయ్య మాట్లాడుతూ నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. గిరిజన, గిరిజనేతరుల మధ్య తేడాలు చొపొద్దని, వారిద్దరికీ సమానంగా పునరావాస కేంద్రాలు ఒకచోట ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఎకరానికి రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు కూడా కొత్తచట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. ఆర్ అండ్ ఆర్ పేరుతో ప్రభుత్వం తప్పుడు సర్వేలు చేయిస్తోందని, కచ్చితమైన సర్వేలు చేయించాలని కోరారు.

భూగర్భ జలాల్లో స్వల్ప పెరుగుదల

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో భూగర్భ జలాల్లో స్వల్పంగా పెరుగుదల నమోదయిందని భూగర్భజల శాఖ ప్రకటించింది. జులై నెలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలో నమోదయిన భూగర్భ జలమట్టం వివరాలను తెలిపింది. గత సంవత్సరం జులై నెలలో రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 13.40 మీటర్లు కాగా ఈ సంవత్సరం జులై నెలలో 10.57 మీటర్లుగా ఉన్నది. ఈ సంవత్సరం జూన్ నెలలో 11.27 మీటర్లుగా కాగా నెల రోజుల కాలంలో స్వల్పంగా పెరిగింది. జులై నెలలో ఆశించిన మేరకు వర్షాలు కురవక పోవడంతో పలు జిల్లాల్లో భూగర్భ జలమట్టంలో పెరుగుదల స్వల్పంగానే ఉన్నట్టు ఈ నివేదిక స్పష్టం చేస్తున్నది. 2017-18 నీటి సంవత్సరంలో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 372 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకూ 336 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఈ ప్రభావంతో భూగర్భ జలాలు ఆశించిన మేరకు పెరగలేదు. రాష్ట్రంలోని 60 మండలాల్లో 20 మీటర్ల కన్నా తక్కువ లోతులో భూగర్భ జలమట్టం ఉండగా 229 మండలాల్లో 10 నుంచి 20 మీటర్ల లోతులోనూ, 178 మండలాల్లో 5 నుంచి 10 మీటర్ల లోతులోనూ ఉన్నాయి. 92 మండలాల్లో 2 నుంచి 5 మీటర్ల పైకి భూగర్భ జల మట్టం నమోదయింది. ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు సగటున 6 మీటర్ల లోతులో ఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలో సగటున 17.08 మీటర్ల లోతులో ఉన్నట్టు భూగర్భ జలశాఖ తెలిపింది.

కులవృత్తుల బలోపేతమే లక్ష్యం : జోగు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కులవృత్తులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. నాయి బ్రాహ్మణుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించిందని, తొలివిడతలో రూ.161 కోట్లు, రెండో విడతలో రూ.69 కోట్లు కేటాయిస్తామన్నారు. మిగితా రూ.20 కోట్లతో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ నిధులతో నాయి బ్రాహ్మణులకు అధునాతన పరికరాలు, సెలూన్‌లు, బ్యూటీషియన్ క్లినిక్‌ల ఏర్పాటుకు సహకారమందిస్తామని చెప్పారు. మంగళవారం బేగంపేట ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సెలూన్‌లు, పరికరాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి : సీఎస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొత్త బోర్లు తవ్వడానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, మిషన్ భగీరథ, హరితహారం, బతుకమ్మ చీరల పంపిణీ, రెవెన్యూ భూమి రికార్డుల ప్రక్షాళన తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాల్లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాలని సీఎస్ జిల్లా కలెక్టర్లకు సూచించారు.

శేషన్న కోసం ఎస్ఐబీ గాలిస్తోంది : సిట్ ఇన్‌చార్జి

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

గ్యాంగ్‌స్టర్ నయీమ్‌కు అత్యంత సన్నిహితుడు శేషన్నను పట్టుకోవడానికి అన్ని రకాలా చర్యలు తీసుకుంటున్నాము, ముఖ్యంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఎస్ఐబీ) ఈ విషయంలో ప్రత్యేకంగా దృష్టిని సారించిందని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ, సిట్ ఇన్‌చార్జి కూడా అయిన అంజనీకుమార్ అన్నారు. గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి ఏడాది పూర్తయిన సంధర్భంగా ఈ కేసు పురోగతిపై ఆయన నవ తెలంగాణతో మంగళవారం మాట్లాడారు. నయీమ్ కేసు దర్యాప్తును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని డీజీపీ అనురాగ్‌శర్మ ఆదేశాల ప్రకారం ఏ ఒక్క కోణాన్ని కూడా వదలకుండా సిట్ దర్యాప్తును సాగిసున్న దని తెలిపారు. ఇప్పటికే నయీమ్ గ్యాంగ్ సభ్యులందరిని దాదాపుగా అరెస్టు చేయడం జరిగిందని, వారి నుంచి అవసరమైన డాక్యుమెంట్లు, ఆస్తులు, భూముల పత్రాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి : టీడీపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని తెలుగుదేశం తెలంగాణ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో కీలకనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటన, రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులు, జీఎస్టీ, గల్ఫ్ బాధితులు తదితర సమస్యలపై చర్చించారు. అధ్యక్షులు ఎల్.రమణ, కార్య నిర్వాహక అధ్యక్షులు ఎ. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, జాతీయ అధికార పార్టీ ప్రతినిధులు ఇ.పెద్దిరెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, జాతీయ పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యులు అరికెల నర్సారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు సీతక్క, మల్లేషం, అమర్‌నాథ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, కార్యక్రమాల కన్వీనర్ జి బుచ్చిలింగం, సిలివేరు కాశీనాథ్, నాయకులు సాయిబాబా, తాజుద్దీన్, బిఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్ధాంతం కోసం కట్టుబడిన వ్యక్తి వెంకయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలు, రచనలు, ఉపన్యాసాల సంకలనంతో కూడిన గ్రంథాల ఆవిష్కరణ సభ మంగళవారం హైదరాబాద్ కొండాపూర్‌లోని సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. 'అలుపెరుగని గళం-విరామమెరుగని పయనం' పేరుతో రూపొందించిన ఈ పుస్తకాల ఆవిష్కరణ సభకు తెలుగు రాష్ట్రాల శాసనసభ స్పీకర్లు మధుసూదనాచారి, కోడెల శివప్రసాదరావు, రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మెన్ రామోజీరావు, ఈ కార్యక్రమం గౌరవ వక్తగా ప్రముఖ విశ్లేషకులు ఎస్.గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెస్కో సంస్థ ప్రచురించిన పలు పుస్తకాలు, శాలువలతో అతిథులను సన్మానించారు.

10న ఢిల్లీకి కేసీఆర్

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 10న సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నారు. 11న వెంకయ్య ఉప రాష్ట్రపతిగా ప్రమాణస్వీకార కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. కాగా మంత్రి కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం వచ్చింది.

కోర్టులంటే మీకు జోకా

నవతెలంగాణ-హైదరాబాద్

కోర్టులంటే మీకు జోక్ అయిపోయాయి. లెక్క లేకుండా పోతోంది.రెండు కాగితాలు ఇచ్చేస్తే సరిపోయిందనుకుంటున్నారు. ఇంత నిర్లక్షంగా ఉంటే ఎలా.. మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో తెలియజేయాలి.. అని బోరు బావుల్లో చిన్నారులు పడి మరణిస్తున్న ఘటనల కేసులో తెలంగాణ రెవిన్యూశాఖ ముఖ్య కార్యదర్శి తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏవో రెండు పత్రాల్ని ఇచ్చేసి అయిపోయిందంటే ఎలాగని నిలదీసింది. ఇది బాధ్యతగా వ్యవహరించడం కాబోదని, ఇదే తీరుగా ఉంటే ఊరుకో బోమని, బోరుబావుల ఘటనలు తిరిగి జరగకుండా ఏం చర్య లు తీసుకుంటున్నారో వివరించకపోవడాన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించరాదో తెలపాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. బోరుబావుల ఘటనలు తిరిగి జరగకుండా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలంటూ న్యాయవాది బుద్దారపు ప్రకాశ్ వేసిన పిల్‌ను హైకోర్టు విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదిస్తూ గత విచారణ సమయంలో కోర్టు ఆదేశించిన మేరకు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నివేదిక ఇవ్వకుండా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, విపత్తుల నిర్వహణ కమిషనర్ మధ్య జరిగిన అంతర్గత పత్రాల వివరాలిచ్చారని తెలిపారు. దాంతో హైకోర్టు రెవిన్యూ ముఖ్య కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఎప్పటిలోగా రుణ విమోచన కమిషన్ వేస్తారు

రైతులు, రైతు కూలీలు, చేతివత్తుల వారి కోసం రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలని, ఎప్పటిలోగా కమిషన్‌ను ఏర్పాటు చేస్తారో తెలపాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది. ఆ కమిషన్ చట్టం 2016లో సెక్షన్ నిబంధనల మేరకు ప్రకారం రైతులు, వ్యవసాయ కూలీల కోసం రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడంపై బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో ప్రజా హిత వ్యాజ్యాన్ని వేశారు. ఎప్పటిలోపు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేస్తారో త్రెలపాలని టీసర్కార్‌ను ఆదేశిస్తూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

డ్రగ్స్ కేసు బాధ్యతల అప్పగింతపై మీకున్న అధికారాలేంటి

డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేసే బాధ్యతల అప్పగింతపై ప్రభుత్వానికి ఉన్న అధికారాలేమిటో తెలపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ వివరణ కోరింది.

డ్రగ్స్ కేసులో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, రెవిన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్, సీబీఐ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థల సారథ్యంలో జరిగేలా ఆదేశాలివ్వాలని టీడీపీ ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి వేసిన పిల్‌ను మంగళవారం బెంచ్ విచారించింది.మన రాష్ట్రంతోనే కాకుండా ఇతర రాష్ట్రాలు పలు దేశాలతో ముడిపడిన ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సిట్ ద్వారా దర్యాప్తు జరిపితే న్యాయం జరగదని పిటిషనర్ తరపు న్యాయవాది బి.రచనారెడ్డి వాదించారు. వాదనల అనంతర తెలంగాణ సర్కార్‌కు విచారణ చేసేందుకు ఉన్న అధికారాలేమిటో తెలపాలని కోరుతూ విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

'ఆర్ఎంఎస్ఏ'కు మంగళం!

- ఎస్ఎస్ఏలోనే విలీనానికి కేంద్రం కసరత్తు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఏ) ప్రాజెక్టును రద్దు చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. దీన్ని సర్వశిక్షా అభియాన్(ఎస్-ఎస్ఏ)లో విలీనం చేయాలని భావిస్తోంది. విద్యాశాఖకు అనుబంధంగా కేంద్రం నుంచి సహకారంతో కొనసాగుతున్న పథకాలన్నీ ఒకే గూటికి చేర్చాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలను ఇప్పటికే సేకరించింది. దీంతో పాటు కొత్త ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రాష్ట్రాలు కోరుతున్న సహకారం తదితర వాటినీ తెలుసుకున్నారు. రాష్ట్రంలో కేంద్రం నిధుల సహకారంతో ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ, మధ్యాహ్నభోజనం(పాఠశాల విద్య) తదితర పథకాలు కొనసాగుతున్నాయి. ఆర్ఎంఎస్ఏను 2009లో సెకండరీ స్థాయి విద్యలో నాణ్యత, టీచర్లకు శిక్షణ, ఇతర వసతుల కల్పన కోసం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది విద్యాశాఖలో ప్రత్యేక విభాగంగా కొనసాగుతోంది. మరోపక్క మధ్యాహ్నభోజనం పథకం కూడా పాఠశాల విద్యలో భాగంగానే ఉన్నది. వీటన్నింటినీ ఒకే విభాగం పర్యవేక్షణలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎస్ఎస్ఏలో ఆర్ఎంఎస్ఏ, మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ బాధ్యతలను విలీనం చేసే కేంద్రం ఆలోచనలకు తెలంగాణ విద్యాశాఖ కూడా సానుకూలంగానే ఉన్నది. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన సందర్భంగా ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ ప్రాజెక్టులను డీఈఓ కార్యాలయాల్లో విలీనం చేశారు. కాగా 9,10 తరగతుల విలీనానికి యూనిఫామ్స్, అన్ని తరగతులకు మధ్యాహ్నభోజన నిర్వహణకు అవసరమయ్యే నిధులనూ కేంద్రం సహకరిస్తే బాగుంటుందని రాష్ట్రం నుంచి కోరినట్టు తెలిసింది. ఇవన్నీ ఒకే గూటికి చేరడం ద్వారా నిధులు తగ్గే అవకాశముందని కొందరు అధికారులు చెబుతున్నారు.

సీఎం వ్యాఖ్యలు కోర్టు ధిక్కారమే : జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రాజెక్టులను అడ్డుకోవడానికే కాంగ్రెస్ పార్టీ కోర్టుల్లో కేసులు వేస్తోందంటూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు కోర్టుధిక్కారమే అవుతుందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. తమకు అన్యాయం జరిగిందంటూ పేదలు కోర్టులకు వెళ్లడాన్ని తప్పుపట్టి న్యాయవ్యవస్థను అగౌరవ పరించినట్టేనన్నారు. మంగళవారం సీఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయవ్యవస్థను తప్పుపట్టే విధంగా కేసీఆర్ వ్యాఖ్యలు చేయడం సరైందికాదన్నారు.

విధాన నిర్ణయాలతో..రైతులకు గడ్డు కాలం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాలను ఉంచాలా..? తొలగించాలా..? అన్న అంశంపై 2001లో దోహాలో మొదలైన సంప్రదింపులపై ఈ సమావేశాల్లో తుది నిర్ణయానికి రానున్నారు. ఆ భేటీలో జరిగే తీర్మానాల ఆధారంగా ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఎంతవరకు స్వేచ్ఛగా ఉండగలవన్నది స్పష్టం కానున్నది. ంప్రపంచ వాణిజ్యం బహిరంగ మార్కెట్‌లోకి వేగంగా విస్తరించడం వల్ల భారత్‌లో ఉత్పత్తి అయ్యే పప్పులు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు, పండ్లు, వంట నూనెలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడనున్నది. డబ్ల్యూటీవో ఒప్పందాల ద్వారా వాణిజ్య పన్నులను(ప్రత్యేకించి దిగుమతి సుంకాలను) భారీగా తగ్గించాల్సిందిగా భారత్‌పై ఒత్తిడి పెరగనున్నది. ద్వైపాక్షిక, బహుళ పక్షాల(దేశాల)మధ్య వాణిజ్య ఒప్పందాలకు అక్కడ జరిగే నిర్ణయాలు కీలకం కానున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గిస్తే భారత రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. విధాన నిర్ణేతల వల్ల రైతులు, వినియోగదారుల మధ్య అవాంఛనీయ శత్రుత్వం ఏర్పడుతుంది. డబ్ల్యూటీవో దేశాల నుంచి దిగుమతులు పెరిగితే స్థానిక వాణిజ్యంలో పోటీ పెరిగి తద్వారా వంట నూనెలు, పప్పులు, పాల ఉత్పత్తులు వంటి నిత్యావసరాల ధరలు తగ్గుతాయన్న వాదన సరికాదంటున్నారు. మార్కెట్‌లోకి గుత్తాధిపత్య సంస్థలు ప్రవేశించడంతోనే ధరల నిర్ణయం ప్రభుత్వం, రైతుల చేతుల్నించి ఆ కంపెనీల పరిధిలోకి వెళ్తుందన్నది నిపుణుల అంచనా. ప్రపంచ వాణిజ్య ఒప్పందాలకు సంబంధించిన సాంకేతికాంశాలు మన దేశ రైతులకు అనుకూలమైనవి కాకపోవడమే అందుకు కారణం. అభివృద్ధి చెందిన దేశాల ఆధ్వర్యంలో నిర్ణయించే అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలను మన రైతుల ఉత్పత్తులు అందుకోజాలవు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో స్థానం లభించదు. మన దేశంలో ప్రభుత్వం నుంచి రైతులకు లభించే రాయితీలు అతి తక్కువగా ఉండటం వల్ల నాణ్యతతో కూడిన వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశం లేదు. అందుకు అయ్యే ఖర్చు అధికంగా ఉండటం వల్ల ప్రస్తుతానికి మన రైతులు ఆస్థాయిని అందుకోలేరు. ప్రపంచ మార్కెట్‌లో మన ఉత్పత్తులకు స్థానంలేని సమయంలో అంతర్జాతీయ ఒప్పందాల వల్ల తీవ్రంగా నష్టపోతాం. ప్రపంచ మార్కెట్ పెట్టుబడిదారులకు మన దేశం ఓ ట్రేడ్ కాలనీ(వాణిజ్య వలస)గా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2013,డిసెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు ఇండోనేషియాలోని బాలీలో జరిగిన సమావేశంలో వ్యవసాయం, ఆహార భద్రత అంశాలకు పరిమిత ప్రాధాన్యం ఇవ్వాలంటూ చాలా దేశాలు ప్రతిపాదించాయి. డబ్ల్యూటీవో నిబంధనకు అనుగుణంగా ఆహార భద్రత,ప్రజా సంక్షేమానికి నిధులు తగ్గించుకోని దేశాలపై చట్టపరమైన చర్యలకు ఆ సమావేశాల్లో అభివృద్ధి చెందిన దేశాలు ప్రతిపాదించాయి. అయితే, అందుకు అంగీకరిస్తే తమ దేశాల్లోని రైతులు, పేదలపై ప్రత్యక్ష ప్రతికూల ప్రభావం పడుతుందని గ్రహించిన భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు దానిని తీవ్రంగా వ్యతిరేకించాయి. దాంతో, ఆ అంశాలు ఇంకా సంప్రదింపుల స్థాయిలో కొనసాగుతూ వచ్చాయి. ఆ సమయంలో భారత్ వంటి దేశాలను ప్రపంచ వాణిజ్యానికి ప్రతిబంధక దేశాలుగా అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలు వర్ణించాయి. ఈ నేపథ్యంలోనే 2015 డిసెంబర్‌లో కెన్యాలోని నైరోబీలో జరిగిన భేటీలో కుటీర పరిశ్రమలు, వ్యవసాయాన్ని కాపాడేందుకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అయితే,తాజాగా మోడీ ప్రభుత్వ విధానంలో మార్పు వచ్చినట్టుగా ఇటీవలి పరిణామాలు సూచిస్తున్నాయి. గతనెల 18న వాణిజ్యశాఖమంత్రి నిర్మలా సీతారామన్ జెనీవా వెళ్లారు. ఆ సందర్భంగా ఆహార భద్రత,వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాల్లో ఏకాభిప్రాయ సాధన దిశగా డబ్ల్యూటీవో డైరెక్టర్ జనరల్ రాబర్ట్ అజెవేడోతో చర్చించారు. 2015 నైరోబీ సమావేశంలో నేర్చుకున్న పాఠాలతో ఇక ముందు నిర్ణయాల ప్రక్రియలో ప్రతిష్టంభన తొలగిపోనున్నదంటూ ఆ భేటీ తర్వాత ఆమె వ్యాఖ్యానించడం అనుమానాలకు తావిస్తోంది. అర్జెంటీనాలోని బ్యూనోస్ ఎయిర్స్‌లో జరగనున్న డబ్ల్యూటీవో మంత్రులస్థాయి భేటీకన్నా ముందే..గతంలో విభేదించిన దేశాలతో ఏకాభిప్రాయం సాధించడం కోసం డబ్ల్యూటీవో అధికారులు ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించారన్నది గమనార్హం.

అండగా నేనుంటా..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణంలో చికిత్స పొందుతున్న నేరెళ్ల ఘటన బాధితులను ఆయన, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి, కలెక్టర్ కృష్ణభాస్కర్ మంగళవారం పరామర్శించారు. ఆ సమయంలో మీడియానూ, మిగతా ఎవ్వరినీ అనుమతించలేదు. అనంతరం స్థానిక సంగీత నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. నేరెళ్ల ఘటన చాలా బాధాకరమని, ఇలా జరగాలని ఎవరూ కోరుకోరని తెలిపారు. ప్రజలు దయతలచి ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చామని అన్నారు. దీన్ని మానవీయ ప్రజాస్వామ్య కోణంలో ఆలోచించాలని కోరారు. క్షణికావేశంలో లారీలను కాల్చడం, వారిపై పోలీసులు పెట్టడం వంటి పరిణామాలు బాధాకరమన్నారు. కొన్ని పార్టీల నాయకులు బాధితులను పరామర్శించి ఇక్కడ ఇసుక మాఫియా నడుస్తోందని అని ఆరోపించడం తగదన్నారు. ఎవరైనా రాజకీయంగా విమర్శిస్తే భరిస్తాంగానీ ఇసుక మాఫియా అంటే సహించబోమని కరాఖండిగా చెప్పారు. కాంగ్రెస్ 50ఏండ్ల పాలనలో ఇసుక ద్వారా వచ్చిన ఆదాయం, తమ సర్కారు హయాంలో వచ్చిన ఆదాయాన్ని గమనిస్తే ఇసుక మాఫియా ఎలా అవుతుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. మధ్యమానేరు పనులు శరవేగంగాజరుగుతున్నాయని కొద్దిరోజుల్లోగా వాటిలో 10 టీఎంసీల నీరు నిల్వ చేయాలన్న ప్రభుత్వం ఆలోచనలో భాగంగా ఇసుకను తీస్తున్నామన్నారు. నేరెళ్ల కేసుల్లో దళితులు సహా బీసీలూ ఉన్నారని తెలిపారు. కేవలం దళితులపైనే కేసులు పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపించడం సరైనపద్ధతి కాదన్నారు. నేరెళ్ల ఘటనలో సంబంధం లేకుండా తమను పోలీసులు ఎందుకు చిత్రహింసలకు గురిచేశారని బాధితులు ప్రశ్నించారని మంత్రి తెలిపారు. డీఐజీ నివేదిక రాగానే చర్యలు చేపడుతామన్నారు. నేరెళ్ల బాధితులను పరామర్శించేందుకు వస్తున్నవారని టూరిస్టులతో పోల్చారు. కోర్టు ఆదేశాల మేరకు కండీషన్ బెయిల్‌పై నెల రోజుల పాటు వేములవాడలోనే ఉండాలనడంతో సంబంధిత కోర్డు న్యాయవాదితో మాట్లాడి వీరికి హైదరాబాద్ కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు. బాధితులకు అండగా నేనుంటానని బాధితులకు భరోసా ఇచ్చానని అన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే రమేష్‌బాబు, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, నగరపంచాయతీ చైర్‌పర్సన్ నామాల ఉమ పాల్గొన్నారు.

31 నుంచి గురుకులాల రాతపరీక్షలు

- సవరణ షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ
- 29,30 తేదీల్లో టీజీటీ మెయిన్
- 27 నుంచి పీజీటీ భాషాపండితుల మెయిన్ యథాతథం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నిరుద్యోగులకు శుభవార్త. ఈనెల 31వ తేదీ నుంచి వాయిదాపడ్డ వివిధ గురుకులాల్లోని పోస్టులకు రాతపరీక్షలు ప్రారంభమవుతాయని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ మంగళవారం గురుకులాల రాతపరీక్షలకు సంబంధించిన సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. గురుకులాల్లో మహిళలకే పోస్టులు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ 1274 జీవోపై కొందరు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆ జీవోపై విధించిన స్టేను హైకోర్టు ఎత్తివేసింది. దీంతో గురుకులాల్లో నిలిచిన రాతపరీక్షలకు నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈనెల 31న ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ రాతపరీక్షలు, వచ్చేనెల 1న మ్యూజిక్ టీచర్ పోస్టులకు రాతపరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 17న లైబ్రరియన్, వచ్చేనెల 17,18 తేదీల్లో స్టాఫ్ నర్సు, పీఈటీ రాతపరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వీటికి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ గురుకుల కళాశాలల్లో లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరియర్, డిగ్రీ జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, జూనియర్ లెక్చరర్లు, లైబ్రరియన్, పాఠశాలల్లో ప్రిన్సిపాల్ పోస్టులకు వచ్చేనెల 10న రాతపరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు వచ్చేనెల 4వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. టీజీటీ మెయిన్ ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పోస్టులకు ఈనెల 29, సైన్స్ పోస్టులకు ఈనెల 30న రాతపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వారు ఈనెల 26వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పీజీటీ భాషాపండిత పోస్టులకు గతంలో ప్రకటించిన తేదీలైన ఈనెల 27,28 తేదీల్లో యథాతథంగా రాతపరీక్షలు జరుగుతాయని తెలిపారు. టీజీటీ భాషాపండిత పోస్టులకు షెడ్యూల్ ప్రకారమే వచ్చేనెల 3,4 తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పీజీటీ భాషాపండిత అభ్యర్థులు ఈనెల 21 నుంచి, టీజీటీ భాషా పండిత అభ్యర్థులు ఈనెల 28వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సబ్సిడీ విడుదల చేసినా.. రుణాలు అందించరెందుకు ?

- బ్యాంకు అధికారులపై ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ అసహనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వయం ఉపాధి పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ సంస్థ సబ్సిడీని విడుదల చేసిన రుణాలు ఎందకు మంజూరు చేయడం లేదని ఆ సంస్థ వైఎస్ చైర్మెన్ లచ్చి రాం భూక్యా బ్యాంకు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులను వినియోగించకుండా, లబ్దిదారులకు రుణాలు అందజేయకుండా స్ఫూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవనంలో బ్యాంకు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీ నిధులను వినియోగించకుకోకుండా ఎంపిక చేసిన లబ్దిదారులక ఎందుకు రుణాలు ఇవ్వడం లేదని బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. కొందరు బ్యాంకు మేనేజర్లు లబ్దిదారులకు రుణాలు మంజూరు చేసేముందు డిపాజిట్లు చేయమని కోరడం సమంజసం కాదన్నారు. 2014-15, 2015-16 సంవత్సరాలలో మంజూరైన రుణాలను అందజేసే విధంగా బ్రాంచ్ మేనేజర్లకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగుల వయోపరిమితి పదేండ్లు సడలింపు

- 2019, జులై 26 వరకు పెంపు వర్తింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగుల గరిష్ట వయోపరిమితిని పదేండ్లు సడలింపునిచ్చింది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వయోపరిమితి 34 నుంచి 44 ఏండ్లను పెంచింది. ఏడాది కాకుండా రెండేండ్లు గరిష్ట వయోపరిమితి సడలింపు వర్తింప చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉత్తర్వులు విడుదల చేశారు. గతేడాది జారీ చేసిన వయోపరిమితి సడలింపు గడువు గతనెల 26వ తేదీతో ముగిసింది. దీంతో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందారు. వయోపరిమితి ముగుస్తుందని నవతెలంగాణ ప్రత్యేక కథనాలను ప్రచురించింది. అన్నింటినీ పరిశీలించిన ప్రభుత్వం వయోపరిమితి సడలింపునిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర ఉద్యోగ నియామక సంస్థలు నేరుగా భర్తీ చేసే ఉద్యోగాలకే వయోపరిమితి పెంపు వర్తిస్తుందని తెలిపారు. ఈ వయోపరిమితి పెంపు రెండేండ్లపాటు అంటే 2019, జులై 26 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వయోపరిమితి పదేండ్లు సడలింపు తొలిసారిగా 2015, జులై 27న జారీ చేసిన 329 జీవో ద్వారా అమల్లోకి వచ్చింది. గతేడాది జులై 26న వయోపరిమితి సడలింపు మరోఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ ఏడాది వయోపరిమితి సడలింపు ముగిసిన 14 రోజుల తర్వాత ఉత్తర్వులు విడుదల చేయడం గమనార్హం. జనరల్ అభ్యర్థులకు 34 నుంచి 44 ఏండ్లకు వయోపరిమితిని పొడిగించారు. పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, జైలు, అటవీ శాఖల్లోని ఉద్యోగాలకు వయోపరిమితి సడలింపు వర్తించబోదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శారీరక సామర్థ్యం ఆధారంగా ఈ నియామకాలు జరుగుతాయని, అందుకే వయోపరిమితి వర్తించబోదని తెలిపారు. గరిష్ట వయ:పరిమితి పదేండ్లపాటు సడలింపు ఇవ్వడంతో ఓసీలకు 44 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 49 ఏండ్లు, వికలాంగులకు 54 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ వికలాంగ ఉద్యోగులకు 58 ఏండ్ల వరకు ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు అవకాశం లభించింది.

క్రమబద్ధీకరణలో పేరు చేర్చ లేదని...

కేటీపీఎస్ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

- కేటీపీఎస్ ఎదుట మృతదేహంతో కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాల ఆందోళన
- రూ.కోటి పరిహారం... ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ- పాల్వంచ

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణలో భాగంగా అన్ని అర్హతలున్నా పేరు చేర్చకపోవడం, ప్రస్తుతం చేస్తున్న పని నుంచి తొలగించామని, బయటకు వెళ్లిపోవాలని ఇంజనీర్లు చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ సీనియర్ కాంట్రాక్టు కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్‌లో మంగళవారం జరిగింది. పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెంలో నివాసముంటున్న కేశబోయిన నాగేశ్వరరావు (41) కేటీపీఎస్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కేటీపీఎస్‌లో 5వ దశలోని క్యామ్ డివిజన్‌లో లింకన్ అనే కాంట్రాక్టర్ దగ్గర 18 సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో జులై 29న విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు 20,903 మందిని క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్రమబద్ధీకరణలో నాగేశ్వరరావు పేరు చేర్చకపోవడంతో అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. ఆ రోజు నుంచి కాంట్రాక్టు కార్మికులు చేసిన ఆందోళనలో కూడా పాల్గొని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసాడు. ఈ క్రమంలో మంగళవారం కేటీపీఎస్ 5వదశ కర్మాగారంలో డీఈ, ఏడీలు క్రమబద్ధీకరణ లిస్టులో 'నీ పేరు రాలేదు, ప్రస్తుతం ఉన్న పనిని కూడా తొలగిస్తున్నాం' అని చెప్పారు. దీంతో ఆవేదనకు గురైన ఆ కార్మికుడు ఈపీఎఫ్, ఈఎస్ఐ, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ క్రమబద్ధీకరించకుండా తనను ఎందుకు తొలగిస్తున్నారంటూ డీఈతో వాగ్వివాదం చేశాడు. ఈనేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై బయటకు వెళ్లి పురుగు మందు డబ్బాను తెచ్చుకుని చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుటే తాగాడు. దీంతో తోటి కార్మికులు అతన్ని కొత్తగూడెంలోని ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కానీ పరిస్థితి విషమించి నాగేశ్వరరావు మృతి చెందాడు. తమకు దిక్కెవరంటూ అతని భార్య యాకమ్మ, కుమార్తెలు శిరీష, సంధ్య, కుమారుడు జయరాజ్ రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈక్రమంలో పోస్టుమార్టం నిర్వహించవద్దని, బాధ్యులపై చర్యలు తీసుకున్న తరువాతే చేపట్టాలని సీపీఐ(ఎం), కాంగ్రెస్, టీడీపీలు, కార్మిక సంఘాలు చెప్పినప్పటికీ పోలీసులు పట్టించుకోకుండా కొత్తగూడెంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి పాల్వంచకు తరలించారు.

మృతదేహంతో ఆందోళన

నాగేశ్వరరావు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ కేటీపీఎస్ 5వ దశ గేట్ ఎదుట కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీమంత్రి వనమా వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సీపీఐ(ఎం) నాయకులు అన్నవరపు సత్యనారాయణ, దొడ్డా రవి కుమార్, సీఐటీయూ నాయకులు గూడెపు రాజు, టీడీపీ నాయకులు కాపా కృష్ణ మోహన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, వనమా రాఘవేంద్రరావు, ఈయూయూఈ నాయకులు వీరస్వామి, అప్పారావు తదితరులు మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, డిమాండ్లను పరిష్కరించాలని, క్రమబద్ధీకరణలో చోటు దక్కని వారందరినీ వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

'నిజాల' పాతర

> **(iii) Allocation of specified sand bearing areas located partially/fully in Scheduled Areas shall be as per the Panchayats Extension to Scheduled Areas (PESA) Rules.**

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను ఈ చట్ట ప్రకారం చేపట్టాలని గనుల శాఖ నిర్ణయించింది. ఈ అంశాన్ని ఆ శాఖ విడుదల చేసిన జీఓ ఎమ్ఎస్ నంబర్ 3, 38లో స్పష్టంగా పేర్కొన్నది.


కాంట్రాక్టర్లను ప్రవేశపెట్టిన ప్రభుత్వం
ఆదివాసీ సొసైటీలను దమ్మీలుగా మార్చిన వైనం

కోట్లాది రూపాయల విలువ చేసే ఇసుక గోదావరి నదిలోనే ఉండటం, నదీ పరీవాహక ప్రాంతం ఏజెన్సీ ప్రాంతంలోనే విస్తరించి ఉండటంతో ఇసుక మాఫియా కన్ను ఈ ప్రాంతంపై పడింది. 'పీసా' చట్టం ప్రకారం పూర్వపు వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతంలో 28 ఆదివాసీ సహకార సంఘాలను ఏర్పాటు చేసినప్పటికీ వీటిని ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తూ వచ్చింది. గిరిజన సహకార సంఘాలకు దక్కాల్సిన ఇసుక లాభాలను కాంట్రాక్టర్లకు దక్కే విధంగా దొడ్డిదారి నిర్ణయాలు తీసుకున్నది. రైజింగ్ కాంట్రాక్టర్ల' పేరుతో కాంట్రాక్టర్లను ప్రవేశపెట్టింది. ఇసుక తవ్వకాలు చేపట్టే ఆర్థిక స్థోమత సొసైటీలకు లేదంటూ ఈ విధానం అమల్లోకి తెచ్చింది. అధికారుల ప్రమేయం లేకుండా నడవాల్సిన ఆదివాసీ సహకార సంఘాల్లో అధికారుల జోక్యం కూడా పెరిగింది. సహకార సంఘాలు నేరుగా బ్యాంకు ఖాతాలు తెరుచుకోకుండా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థల (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారులు సొసైటీల అధ్యక్షులతో కలిపి బ్యాంకుల్లో జాయింట్ అకౌంట్లు నిర్వహించాలనే ఆంక్షలు విధించింది. పీసా చట్టం ప్రకారం ఎటువంటి అధికారం లేని కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేసే విధంగా నిబంధనలను విధించింది.

ఇసుక ఆదాయం ఎవరికెంత?

ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక తవ్వకాలను ఆదివాసీలకు అప్పగించామని, దీని ద్వారా 7,500 ఆదివాసీ కుటుంబాలు లబ్ధి పొందతున్నాయని గనుల శాఖ మంత్రి స్వయంగా ఇటీవల ప్రకటించారు. పూర్వపు వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పనిచేస్తున్న 28 ఆదివాసీ ఇసుక సొసైటీల ద్వారా మూడేండ్ల కాలంలో ఒక కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వినట్టు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ లెక్కల ద్వారా తెలుస్తున్నది. ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రతి క్యూబిక్ మీటర్‌కు రూ. 600 ప్రభుత్వం వసూలు చేస్తున్నది. ఏజెన్సీ ప్రాంతంలో జరిపిన ఇసుక తవ్వకాల ద్వారా ఇప్పటి వరకూ ప్రభుత్వానికి రూ. 600 కోట్లు ఆదాయం వచ్చింది. దీనిలో ఆదివాసీ సహకార సంఘాలకు ప్రతి క్యూబిక్ మీటర్‌కు రూ. 220 చొప్పున రూ. 220 కోట్లు దక్కాల్సి ఉంది. ఇసుక తవ్వకాలకు, రవాణాకు అయ్యే ఖర్చులు పోనూ మిగిలిన లాభాన్ని ఆదివాసీ కుటుంబాలకు పంచాల్సి ఉంది. అయితే ప్రభుత్వం అక్రమంగా ప్రవేశపెట్టిన రైజింగ్ కాంట్రాక్టర్లకు' క్యూబిక్ మీటర్ కు రూ. 180 రూపాయలు చెల్లించాలని సహకార సంఘాలను ఆదేశించింది. ఫలితంగా వచ్చే రూ. 220 కోట్లలో రూ. 180 కోట్లు కాంట్రాక్టర్లకు దక్కాయి. మిగిలిన రూ. 40 కోట్లతో సహకార సంఘాల నిర్వహణ కోసం 3 శాతం చొప్పున పోగా ఆదివాసీ కుటుంబాలకు బోనస్ రూపంలో దక్కింది కేవలం రూ. 37 కోట్లు మాత్రమే. సగటున ప్రతికుటుంబానికి నాలుగు నుంచి ఆరువేల రూపాయలు ఇప్పటి వరకూ ఆదాయంగా లభించింది. ఈ నామమాత్రపు ఆదాయాన్ని చూపించి ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపామంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. రైజింగ్ కాంట్రాక్టర్ల వ్యవస్థ లేకుండా ఆదివాసీ సహకార సంఘాలే ఇసుక తవ్వకాలు చేస్తే ఖర్చులు పోనూ మరో వంద కోట్ల రూపాయల ఆదాయం వారికి వచ్చి ఉండేది.

కాంట్రాక్టర్ల అడ్డాగా ఏటూరునాగారం ఐటీడీఏ



ఇసుక కాంట్రాక్టర్ల కోసం ఒక అధికారినే నియమించుకున్న ఉదంతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఐఏఎస్ అధికారి కానీ లేదా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారిని ఐటీడీఏ పీఓగా నియిమించాల్సి ఉండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా సహకార శాఖకు చెందిన ఒక అధికారిని ఇటీవల పీఓగా ప్రభుత్వం నియిమించింది. ఒక మంత్రి సిఫారసుతో ఆయన నియామకానికి సీఎం కార్యాలయం ఆమోదం తెలపింది. ఆదివాసీల అభివృద్ధికి పథకాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం ఐటీడీఏ ప్రధాన విధి కాగా ఇసుక కాంట్రాక్టర్ల చిరునామాగా ఈ కార్యాలయం మారడం పట్ల ఆదివాసీలు అసంతృప్తి వ్యకం చేస్తున్నారు. ఆదివాసేతర కాంట్రాక్టర్లకు ఇసుక రీచ్‌లను అప్పగించడానికే ఐటీడీఏ పనిచేయడం వివాదాస్పదంగా మారింది. వెంకటాపురం మండలంలోని మొర్రవానిగూడెంలో ఆదివాసీ కూలీలకు చెల్లించాల్సిన కూలీ డబ్బులు కూడా చెల్లించకుండా ఇటీవల ఒక కాంట్రాక్టర్ పరారయ్యాడు. ఈ రీచ్‌ను దక్కించుకునేందుకు మరో ఇద్దరు కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు వీరిలో ఎవరు ఎక్కువ ముడుపులు చెల్లిస్తే వారిని కాంట్రాక్టర్‌గా నియమించడానికి అధికారులు గత మూడు రోజులుగా పంచాయితీ నిర్వహిస్తున్నారు.

15 రోజుల్లో ఫీజుల వివరాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఎట్టకేలకు మరో ముందడుగు వేసింది. గత మూడేండ్లకాలంలో విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల వివరాలను 15రోజుల్లో అందించాలని యాజమాన్యాలను కోరింది. పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. రెండు రోజుల్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను సీడీఎస్ఈ' వెబ్‌సైట్ ద్వారా యాజమాన్యాలకు అందుబాటులోకి తీసుకొస్తున్నది. రాష్ట్రంలో సుమారు 12వేల ప్రయివేటు పాఠశాలలున్నాయి. వీటిలో ఫీజుల నియంత్రణ కోసం మార్చి నెలలో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. నెలరోజుల్లోనే ఫీజుల నియంత్రణపై ప్రభుత్వానికి కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగానే 2016-17 విద్యాసంవత్సరంలోనే ఫీజులను నిర్ణయిస్తామని ప్రభుత్వం చెప్పినా, అది అమలుకు నోచుకోలేదు. ఐదు నెలలు గడిచిన ఇప్పటికీ నివేదిక ఇంకా పూర్తికాలేదు. న్యాయపరమైన అడ్డంకులు లేకుండా నివేదిక తయారు చేస్తున్నామనే పేరుతో కమిటీ కాలయాపన చేస్తుందనే ఆరోపణలూ ఉన్నాయి. ప్రస్తుతం మూడేండ్ల ఫీజుల వివరాలను సేకరించే పనిలో కమిటీ పడింది. దీనికోసం ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను రెండురోజుల్లో విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. దీనిద్వారా యాజమాన్యాలు నేరుగా తరగతుల వారిగా ఫీజుల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి తఉంటుంది. వీటికి యూడైస్ వివరాలను అటాచ్ చేస్తున్నారు. దీంతో పాఠశాల యాజమాన్యాలు ఏమైనా తప్పుడు వివరాలు నమోదు చేసిన తెలుసుకునేందుకు అవకాశముంటుంది. యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో ఇచ్చిన వివరాలను, సీఏతో సంతకం చేయించి ఆ హార్డ్‌కాపీలను విద్యాశాఖ అధికారులకు అందించాల్సి ఉంటుంది. వాటిని ఆయా జిల్లాల అధికారులు పరిశీలించి, రాష్ట్ర అధికారులకు అందించనున్నారు. రాష్ట్రంలోని కొన్ని పాఠశాలలను తిరుపతిరావు కమిటీ నేరుగా సందర్శించి, ఫీజులను ఏ ప్రతిపాదికన, ఎంతెంతా పెంచారనే దానిపై వివరాలు సేకరించనున్నారు. వీటన్నింటి ఆధారంగా సమగ్రమైన ఫీజుల నివేదిక అందించనున్నట్టు ప్రొఫెసర్ తిరుపతిరావు మీడియాకు తెలిపారు. అయితే ప్రయివేటు యాజమాన్యాలు ఫీజుల వివరాలు అందించేందుకు ఏ మేరకు స్పందిస్తాయో వేచిచూడాలి.

స్కూళ్లలో యోగా తప్పనిసరి చేయలేం..

న్యూఢిల్లీ: పాఠశాలల్లో యోగాను తప్పనిసరి చేయలేమని భారత అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ మేరకు దాఖలైన రెండు పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. యోగాను దేశంలోని అన్ని పాఠశాలల్లో ఖచ్చితంగా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్, జెసి సేత్‌లు సుప్రీంకోర్టులో గతంలో ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు యోగా, ఆరోగ్య విద్యపై పాఠ్యపుస్తకాలు అందించాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, ఎన్‌సీఈఆర్‌టీ, ఎన్‌సీటీఈ, సీబీఎస్ఈల ను ఆదేశించాలని అశ్వనీకుమార్ ఉపాధ్యాయ్ తన పిటిషన్లో పేర్కొన్నారు. కాగా.. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం సమావేశమైంది. స్కూళ్లలో ఏం చెప్పాలో.. ఏం చెప్పకూడదో కోర్టు నిర్ణయించలేదని, ఆ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది.

సమాచార కమిషన్‌కు కమిషనర్లను నియమించాలి

నవతెలంగాణ- హైదరాబాద్

ఆరు వారాల్లోగా సమాచార కమిషన్‌కు ప్రధాన కమిషనర్లు, కమిషనర్లను నియమించే ప్రక్రియను పూర్తి చేయాలని రెండు తెలుగు రాష్ట్రాలను హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల అమలు కోసం తీసుకున్న చర్యల్ని అఫిడవిట్ ద్వారా తెలపాలని మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. సమాచార ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకాలు జరిగేలా ఆదేశాలివ్వాలని స్వచ్ఛంధ సంస్థ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభయ్య దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ మంగళవారం విచారించింది. ఆరు వారాల్లో నియామకాలు చేస్తామని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే తమకు మరింత సమయం కావాలని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రమేశ్ చెప్పారు. అంత సమయం ఎందుకని హైకోర్టు ఏపీని ప్రశ్నించింది. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 15(1) ప్రకారం ప్రతీ రాష్ట్రానికి ప్రత్యేక సమాచార కమిషన్ ఉండాలని, ఏపీకి విడిగా కమిషన్‌ను ఏర్పాటు చేసుకుంటామని రమేశ్ తెలిపారు. అదనపు సమయం ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఆరు వారాల్లో ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్లను ఏర్పాటు చేయాల్సిందేనంటూ విచారణ సెప్టెంబర్ 21కి వాయిదా వేసింది.

రమేశ్ రాథోడ్ X రేఖానాయక్

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అనగా...'బత్కడానికి నువ్వొచ్చినవ్..నువ్వే వచ్చినవ్..ఎక్కువ మాట్లాడకు. ముందు లేడీస్‌తో మాట్లాడే పద్ధతి నేర్చుకో..'అంటూ ఎమ్మెల్యే రేఖానాయక్ చురకలంటిచారు. కొద్దిరోజులుగా వీరిమధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న విబేధాలు...మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో బయటపడ్డాయి. ఎమ్మెల్యే అనుచరుడిని సీట్లో నుంచి లేవాలన్నందుకు ఈ వివాదం పొడసూపింది. వీరిద్దరి మధ్య వాగ్వాదాన్ని మాన్పడానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్రయత్నించి విఫలమయ్యారు. ఎమ్మెల్యే రేఖానాయక్ శాంతించకుండా పోలీసులకు రాథోడ్ రమేశ్‌పై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. 10న ఎస్సారెస్పీ పునరుజ్జీవం కార్యక్రమానికి సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఇటీవల టీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పైడిపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే రేఖానాయక్ సమావేశ నిర్వహణకు సంబంధించి విశ్రాంతిభవనంలో హాజరయ్యారు. ఈ సమయంలోనే మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వచ్చారు. టీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే అనుచరుడిని పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోవాలని రమేష్ రాథోడ్ చెప్పటంతో వివాదం మొదలైంది. 'ఆయన ఎందుకు లేవాలి' అంటూ రేఖానాయక్ అన్నది. 'బతకడానికొచ్చినోళ్లు బతకడాన్కి వచ్చినట్టు ఉండాలి' అని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ వ్యాఖ్యానించారు. 'నువ్వే బతకడానికొచ్చావ్..నువ్వు బతడానికొచ్చావ్.. ఏం మాట్లాడుతున్నవ్... లేడీస్‌తో మాట్లాడే పద్ధతి ఇదేనా అంటూ ఇద్దరూ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలోనే లేచి వాగ్వాదానికి దిగారు. గొడవ గురించి తెలుసుకున్న బయట ఉన్న కార్యకర్తలు రెండుగా చీలిపోయారు. రాథోడ్ రమేష్, రేఖానాయక్ అనుచరులు పోటీ పడి నినాదాలు చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కల్పించుకుని.. 'కార్యకర్తలు, నాయకుల మధ్య గొడవలు సరిగాదు. మనమూ కార్యకర్తలమే. మనకు సీఎం కేసీఆరే నాయకులు' అంటూ ఇద్దరికీ సర్దిచెప్పబోయారు. కానీ, ఇరువురి అనుచరులు వినకపోవటంతో... అక్కడ పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు జోక్యం చేసుకుని కార్యకర్తలను అక్కడ నుంచి వెళ్లగొట్టారు. అనంతరం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కూర్చోబెట్టి ఇలాంటి పరిస్థితి సరికాదని వారించారు. హైదరాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీలో చేరిన రాథోడ్ రమేశ్, రవీందర్‌రావు సమక్షంలోనే సీఎం కేసీఆర్... సఖ్యతతో ప్రజల కోసం, పార్టీ కోసం పనిచేయాలని సూచించారని, దాన్ని మరిచిపోతే ఎలా అని వారించారు. సీఎం వద్ద చెప్పినదానికి, ఇక్కడి పరిస్థితికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఇక నియోజకవర్గంలో నిప్పు, ఉప్పులా ఉన్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఎమ్మెల్యే రేఖానాయక్ వ్యవహారం పార్టీని ఎటువైపు తీసుకెళ్తుందోనని కార్యకర్తలు ఆందోళనకు గురవుతున్నారు.

జీఎస్టీతో కోట్లల్లో నష్టం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యుడైనప్పటికీ వ్యక్తిగత పనుల కారణంగా ప్రభుత్వం కేటీఆర్‌ను పంపించిందని, ఎవరు వెళ్లినా ప్రభుత్వ ఆలోచన విధానాన్ని సమిష్టి నిర్ణయాన్ని చెబుతారని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల ద్వారా జీఎస్టీతో రూ.19,200 కోట్ల భారం పడుతోందని, తెలంగాణలో రాష్ట్ర వ్యక్తిగత ట్యాక్స్ రెవెన్యూ 21.7శాతం ఉన్నందున కంపెన్‌జేషన్ పరిధిలోకి రాదని 14శాతం గ్రోత్ రేటు ఉన్న రాష్ట్రాలకు ఇది వర్తిస్తుందని, దేశంలోనే రాష్ట్ర గ్రోత్ రేటులో ప్రథమ స్థానంలో ఉండగా ఛత్తీస్‌గడ్ రెండోస్థానంలో ఉందని అన్నారు. కొందరు నాయకులు అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మొదటి నుంచి రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేశామని చెప్పారు. 33అంశాల్లో ప్రతి సమావేశంలో అభ్యంతరం వ్యక్తం చేశామని వెల్లడించారు.

రెగ్యులర్ మీటర్‌ను బ్రేక్ చేసే సినిమా

'రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు ఓ మీటర్ ఉంటుంది. 'నేనే రాజు నేనే మంత్రి'కి ఆ మీటర్ ఉండదు. అంతేకాదు మీటర్ లెక్కలన్నింటినీ తుడిచేసే చిత్రమవుతుంది' అని అంటున్నారు దర్శకుడు తేజ. రానా, కాజల్, కేథరిన్ థ్రెస్సా హీరో,హీరోయిన్లుగా తేజ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. ఈ నెల 11న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా తేజ మంగళవారం మీడియాతో సంభాషించారు. ఆ విశేషాలేమిటో ఓ లుక్కేద్దాం..


తేజ

ముందే వేరే హీరో అనుకున్నాం..

ఈ కథ తయారు చేసినప్పుడు 'అహం' అనే టైటిల్ అనుకున్నాను. ఈ కథను మొదట రాజశేఖర్‌కు చెప్పాను. కానీ అనుకున్న కథను చెడగొట్టడం ఇష్టం లేక ఆ ప్రయత్నం మానుకున్నాను. నా గత ఫెయిల్యూర్స్ అన్నీ కథల్లో లోపం ఉండటం వల్లే పోయాయని తెలుసు. అందుకే ఈసారి కథను బలంగా తయారు చేసుకున్నా. ఈ కథకు రానా అయితే బాగా సూట్ అవుతాడనిపించింది. సురేష్‌బాబుతో డిస్కస్ చేసి కథలో హెల్దీ ఛేంజెస్ చేశాం. ఆ తర్వాత రానాకు వినిపించా. ఆయనకు నచ్చడంతో నెల రోజుల్లోనే ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. అప్పటికీ ఇంకా 'బాహుబలి 2' మొదలు కాలేదు. దీనికి ముందే మా సినిమా చేద్దామనుకున్నాం. మా సినిమా ప్రారంభమైన కొన్ని రోజులకే 'బాహుబలి 2' స్టార్ట్ అయ్యింది. దీంతో అన్ని రోజులు ఆగాల్సి వచ్చింది.

మంచి.. చెడు రెండూ చూపించా..

ఒక దర్శకుడిగా నేను సూపర్ హిట్ చిత్రాలు తీయగలను. అట్టర్‌ఫ్లాప్ సినిమాలూ చేయగలను. ప్రతి మనిషిలో పాజిటివ్స్, నెగటివ్స్ ఉంటాయి. సాధారణంగా సినిమాలో హీరో గురించి అన్ని పాజిటివ్స్ చూపిస్తారు. ఈ చిత్రంలో అలా కాకుండా జోగేంద్ర అనే వ్యక్తి జీవితంలోని మంచి, చెడు రెండింటినీ చూపించాను. అతని ఐదేండ్ల జర్నీ ఎలా ఉంటుందనేది సినిమా. ఈ ఐదేండ్ల ప్రయాణంలో ఎక్కడ మొదలయ్యాడు? ఎక్కడ ఎండ్ అయ్యాడు? ఏం సాధించాడనేది ఆద్యంతం ఆసక్తికరంగా చూపించేందుకు ప్రయత్నించాను.

10% మాత్రమే పొలిటికల్ డ్రామా..

కేవలం పొలిటికల్ సినిమా అయితే నేను కూడా నా ఫ్యామిలీతో కలిసి ఆ సినిమాకు వెళ్ళను. మనమే వెళ్ళనప్పుడు అలాంటి సినిమా మనమెందుకు తీయాలని ఆలోచించే వ్యక్తిని నేను. దర్శకుడిగా ఓ సినిమాలో అన్ని హంగులు ఉండాలని కోరుకుంటాం. ఈ చిత్ర టీజర్ చూసి ప్రేక్షకులంతా పొలిటికల్ థ్రిల్లర్ చిత్రమని భావించారు. కానీ సినిమాలో పొలిటికల్ డ్రామా పది శాతం మాత్రమే కనిపిస్తుంది. భార్యభర్తల మధ్యే జరిగే కథ ప్రధానంగా సాగుతుంది. ఈ కథ పాతదే కానీ, స్క్రీన్‌పై కొత్తగా కనిపిస్తుంది. ఇలాంటివి మనం రెగ్యులర్‌గా చాలానే చూస్తున్నాం. ఆ రెగ్యులర్ మీటర్‌ను బ్రేక్ చేసే సినిమా అవుతుంది.

మహిళలు శక్తివంతంగా ఉంటే..

జోగేంద్ర, రాధ అనే ఇద్దరు భార్యభర్తల మధ్య కథ జరుగుతుంది. జోగేంద్రగా రానా, రాధాగా కాజల్ నటించారు. మరో కీలక పాత్రలో కేథరిన్ కనిపిస్తుంది. రానా చాలా తెలివైన నటుడు. ఏదైనా సీన్ చెబితే దాని గురించి ఎక్కువగా ఆలోచిస్తాడు. ఆదే మూడ్‌లో సెట్‌కు వస్తాడు. చాలా మంది స్టార్‌గా ఫీలై చేస్తుంటారు. కానీ రానా అలా కాదు. 'జోగేంద్ర క్యారెక్టర్ పరిస్థితి ఏంటి?. అతనెలా ఉంటాడు?' అని ఆలోచించి నటిస్తాడు. జోగేంద్ర పాత్రకు న్యాయం చేశాడు. కాజల్, కేథరిన్ పాత్రలతో సహా ఈ చిత్రంలో ప్రతి పాత్ర చాలా బలంగా ఉంటుంది. నేను తీసిన సినిమాల్లో మహిళా పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఉమెన్ స్ట్రాంగ్‌గా ఉంటే సమాజం బాగుంటుందని నా నమ్మకం. ఈ చిత్రం ద్వారా రానా, కాజల్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రాఫర్‌కు మంచి పేరు వస్తుంది.

నమ్మకమే గెలవాలని కోరుకుంటాం..

దర్శకుడుగా నా తప్పులు నాకు తెలుస్తాయి. నా గత చిత్రాలు ఆడకపోవడానికి కథే ప్రధాన లోపమని తెలిసింది. అది నా తప్పే కదా. ప్రతి మనిషికి నమ్మకం, రియాలిటీ అనే అంశాలుంటాయి. సినిమాలో తప్పు చేస్తున్నామని తెలియడం రియాలిటీ అయితే.. సినిమా బాగా ఆడాలనుకోవడం మనపై మనకున్న నమ్మకం అవుతుంది. నమ్మకంలో, రియాలిటీలో నమ్మకం గెలిచినా వాస్తవం మాత్రం రియాలిటీనే అవుతుంది. అది వదిలేసి మనమంతా నమ్మకం గెలవాలని కోరుకుంటుంటాం. నా విషయానికి వస్తే నాకు దర్శకత్వం, సినిమాటోగ్రఫీపై పట్టున్నప్పటికీ నాకు ఆ అంశాలే గుర్తుండవు. నేను చేయాల్సిన పనిపైనే ఫోకస్ చేస్తాను. బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చేందుకు ట్రై చేస్తాను.

నవచిత్రం

బర్త్‌డే గిఫ్ట్‌గా మరో టీజర్


స్పైడర్‌లో మహేష్

మహేష్, ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'స్పైడర్'. నేడు (బుధవారం) మహేష్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ 'స్పైడర్' కొత్త టీజర్‌ను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ, "ఇటీవల విడుదల చేసిన ఈ చిత్ర టీజర్‌కి రికార్డ్ స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. నేడు మా హీరో మహేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉదయం 9 గంటలకు కొత్త టీజర్‌ను విడుదల చేస్తున్నాం. ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తయింది. ఈ పాట చిత్రీకరణ ఆగస్ట్ 23 వరకు జరుగుతుంది. దీంతో టోటల్‌గా షూటింగ్ పార్ట్ పూర్తవుతుంది. ఇప్పటికే డబ్బింగ్, రీకార్డింగ్ ఏకధాటిగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి దసరా కానుకగా సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని అన్నారు. సూపర్‌స్టార్ మహేష్, రకుల్‌ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేరిస్ జయరాజ్, సినిమాటోగ్రఫీ: సంతోష్ శివన్ ఎఎస్‌సి.ఐఎస్‌సి, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్

11 నుంచి లక్నోలో షూటింగ్..

మహేష్‌బాబు, కైరా అద్వాని జంటగా కొరటాల శివ దర్శకత్వంలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్.ఎల్.పి పతాకంపై డి.వి.వి.దానయ్య ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం విదితమే. ఈ చిత్ర తాజా షెడ్యూల్ త్వరలోనే లక్నోలో ప్రారంభం కానుంది. ఆ వివరాలను నిర్మాత తెలియజేస్తూ, 'ఈ నెల 11 నుంచి 22 వరకు లక్నోలో తాజా షెడ్యూల్ జరుగనుంది. మహేష్, కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్‌లతోపాటు ప్రముఖ తారాగణం పాల్గొనే పలు కీలక సన్నివేశాలను, అలాగే పీటర్ హెయిన్స్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తాం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 11న సంక్రాంతి కానుకగా విడుదల చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్.

మా ఇద్దరి జీవితాలు ఒకేలా ఉంటాయ్..


జగపతి బాబు

'ఫేడ్ అవుటైన హీరోలు మళ్ళీ హీరోగా నటిస్తే ప్రేక్షకులు చూడరు. ఇప్పుడు నేను హీరోగా రాణించాలనుకోవడం లేదు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా హ్యాపీగానే ఉన్నా' అని అంటున్నారు జగపతిబాబు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరోహీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన 'జయ జానకి నాయక'. ఈ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నెల 11న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో జగపతిబాబు మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే..

పరువు కోసం..

ఈ చిత్రంలో నేను పరువు కోసం ప్రాణాలిచ్చే వ్యక్తిగా కనిపిస్తాను. నా పాత్ర తీరుతెన్నుల్లో విలన్ ఛాయలుంటాయా?, లేదా? అనేది మాత్రం సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. 'లెజెండ్' తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్‌ను మలుపు తిప్పిన చిత్రమది. మరోసారి ఆ పాత్ర తరహాలో చాలా ప్రాధాన్యం ఉన్న పాత్రను ఈ చిత్రంలోనూ బోయపాటి ఇచ్చారు. అలా అని ఇది 'లెజెండ్' సినిమాలా ఉండదు. దేని స్థాయి దానిది. దేని పవర్ దానిది. ఈ చిత్రం మాత్రం బోయపాటి స్టయిల్‌లో ఉంటూనే కొత్తగా ఉంటుంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చాలా బాగా నటించాడు. రకుల్‌తోపాటు ఇతర తారాగణమంతా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సినిమా చాలా బాగా వచ్చింది. టోటల్ యూనిట్ సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉంది.

హీరో గురించి ఆలోచించను..

ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించాడు. అయితే హీరో కొత్త వాడా, స్టార్ హీరోనా? అని ఆలోచించను. కథానాయకుడి తర్వాత నా పాత్రకు ప్రాముఖ్యత ఉంటే చాలు. నిడివి ఎంత అనేది కూడా చూడను. ఒక్క సీనులోనైనా నా క్యారెక్టర్ ఎలివేట్ అవుతుందా లేదా అనేది మాత్రమే చూసుకుంటాను. అలాగే దర్శకుడు నా పాత్రను ఎంత శక్తివంతంగా తీర్చిదిద్దుతాడనేది చూస్తాను. ఈ విషయంలో బోయపాటి హెడ్‌మాస్టర్. ప్రతి పాత్ర కొత్తగా ఉండాలని తపిస్తారు. ప్రతి సన్నివేశాన్ని చేసి చూపిస్తారు. ఈ చిత్ర షూటింగ్ టైమ్‌లో మా అందరికి ఒకేసారి సీన్స్ ఎక్స్‌ప్లెయిన్ చేసేవారు. దీంతో మెయిన్ ఆర్టిస్టుల నుంచి సైడ్ ఆర్టిస్టుల వరకు అందరికి జరిగే సీన్‌పై ఫుల్‌క్లారిటీ ఉంటుంది. ఇలా చేయటం వల్ల ప్రతి సీన్ పర్‌ఫెక్ట్‌గా వచ్చేందుకు దోహదపడుతుంది.

అమితాబ్‌కు, నాకు పోలికలున్నాయి..

నేను కెరీర్‌ను పెద్దగా ప్లానింగ్ చేసుకోను. టైమ్‌ని బట్టి ఫాలో అవుతాను. ప్లానింగ్‌ని నమ్మను. ఏం జరగాలో అదే జరుగుతుంది. మన శక్తిమేర పనిచేయాలని కోరుకుంటాను. నటుడిగా నాకు ఇన్‌స్ప్రిరేషన్ అంటూ ఏం లేదు. కానీ అమితాబ్ బచ్చన్ అంటే ఆదర్శం. క్లిష్టపరిస్థితుల మధ్య ఎదిగారు. 'నీ వాయిస్ బాలేదు. హీరోగా పనిచేయవు' అని ఎగతాళి చేసిన చోటే స్టార్‌గా ఎదిగారు. వద్దనుకున్న ఆ వాయిస్సే పెద్ద అస్సెట్ అయ్యింది. కెరీర్ మొదట్లో నాకు అలాంటి పరిస్థితే ఎదురైంది. అలాగే ఒకానొక దశలో ఇక అమితాబ్ పని అయిపోయిందనుకున్నారు. తర్వాత మళ్ళీ పుంజుకున్నారు. నేను కూడా అంతే. ఆయనలాగే నాక్కూడా నా వాయిస్సే ప్లస్ అయ్యింది.

బాలీవుడ్‌లోకి..

ఓ చోట కుదురుగా ఉండటం నాకు ఇష్టం ఉండదు. 24 గంటలూ ఏదో ఒక పని చేయాలనుకుంటా. అందుకే తెలుగులోనే కాదు తమిళం, మలయాళం, కన్నడ చిత్రాల్లోనూ నటిస్తున్నాను. తెలుగులో ప్రస్తుతం నిఖిల్ చిత్రంతోపాటు అడవి శేష సినిమా చేస్తున్నాను. కన్నడ, తమిళంలోనూ ప్రాజెక్టులున్నాయి. మనిషి ఆశా జీవి. ఒకదాని తర్వాత ఒకటి కావాలనుకుంటాడు. అందులో భాగంగానే బాలీవుడ్‌లోకి కూడా వెళ్లబోతున్నా. అక్కడ్నుంచి కూడా ఛాన్స్‌లొస్తున్నాయి. ప్రస్తుతం కొన్ని చర్చల దశలో ఉన్నాయి. ఇంకా ఏదీ ఫైనల్ కాలేదు.

కొన్ని తప్పులు జరిగాయి..

ఇటీవల విడుదలైన 'పటేల్ సార్ చిత్రం తీవ్ర నిరాశ పర్చింది. సినిమా విషయంలో కొన్ని తప్పులు జరిగాయి. టీజర్ సినిమాకు ఎంత పెద్ద అసెట్ అయ్యిందో, సినిమా విడుదలయ్యాక అదే పెద్ద మైనస్ అయ్యింది. టీజర్ చూసిన ప్రేక్షకులు సినిమా సస్పెన్స్ థ్రిల్లర్, హర్రర్ మూవీలా, పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా ఉంటుందని భావించారు. ప్రేక్షకులు ఊహించిన స్థాయిలో లేదు. బిర్యాని కోసం వచ్చిన ఆడియెన్స్‌కి మామూలు భోజనం పెట్టినట్టైంది. అయితే హీరోగా నిరూపించుకోవాలని నేనా సినిమా చేయలేదు. పాత్ర కీలకంగా ఉంటుంది, కథ చాలా బాగుందనిపించి చేశా. ఫేడ్ అవుట్ అయిన హీరోలు మళ్ళీ హీరోగా చేస్తే జనం చూడరు. ఈ విషయంలో నాకు మంచి క్లారిటీ ఉంది.

తండ్రి లేఖ పాఠంగా..

గ్లోబల్ స్టార్ దీపికా పదుకొనెకు సంబంధించి జరిగిన ఓ అరుదైన సంఘటన అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. చిన్నప్పుడు దీపికాకు ఆమె తండ్రి, బాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాష్ పదుకొనె రాసిన లేఖ ఇప్పుడు గుజరాత్‌లోఆంగ్ల సబ్జెక్ట్‌లో ఓ పాఠ్యాంశమైంది. తన కూతుర్లు దీపిక, అనీషాలను ఉద్దేశించి జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా కుంగిపోకుండా వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే విషయాలను ప్రకాష్ పదుకొనె ఈ లేఖలో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం ఓ అవార్డు వేడుకలో ఈ లేఖను చదువుతూ దీపికా ఉద్వేగానికి లోనైంది. ఇప్పుడు ఇదే లేఖ గుజరాత్ ఇంటర్ సిలబస్‌లో ఓ పాఠ్యాంశం కావడంతో ఈ ఫొటోని ట్విట్టర్‌లోని దీపికఫ్యాన్స్ క్లబ్‌లో పేజీలో పోస్ట్ చేశారు. ఇది చూసి 'వావ్ ..' అంటూ దీపిక రీ ట్వీట్ చేసింది.


ప్రకాష్ పదుకొనె, దీపికా పదుకొనె


కాజల్

విలన్‌గా సెన్సార్‌బోర్డ్ ..


అనుపమ్ ఖేర్

'సెన్సార్‌బోర్డ్ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్-సిబిఎఫ్‌సి) ఫిల్మ్ మేకర్స్ పాలిట విలన్‌గా వ్యవహరించకూడదు. వారికి రెస్పెక్ట్ ఇవ్వడంతో పాటు తమ వంతుగా ప్రోత్సాహాన్ని అందించాలి' అని అన్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్‌ఖేర్. బాలీవుడ్ చిత్రం 'బాబోమోషై బందూక్‌బాజ్' చిత్రం విషయంలో కేంద్ర సెన్సార్ బోర్డ్ 48 కట్స్‌ను విధించింది. దీంతో సెన్సార్ బోర్డు చైర్మెన్ పహ్లాజ్ నిహలానిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై సెన్సార్‌బోర్డ్ మాజీ చైర్మెన్ అనుపమ ఖేర్ మాట్లాడుతూ, 'ఫిల్మ్ మేకర్స్ విమర్శలు వ్యక్తిగతంగా చేసేవి కావు. అవి సదరు చిత్రానికి సంబంధించినవి మాత్రమే. అయితే కట్స్ విధించడానికి పహ్లాజ్ నిహ్లానినే కారణమని నేను భావించడం లేదు. అదే సమయంలో సెన్సార్ చేసేటప్పుడు బోర్డ్ తమని తాము ఓసారి సరిచూసుకోవాలి. సినిమాలను నిలిపివేయాలని దేశంలోని ఎక్కడెక్కడి నుంచో చాలా మంది వస్తుంటారు. ఇలాంటి సంఘటనలు 21 శతాబ్దంలో నేను చాలా చూశాను. ఇలాంటివి చేసేవారికి సొంత పరిశీలన, నియంత్రణ ఉండాలి. సినిమా తీసే వారు కూడా ఇదే పాటించాలి. సెన్సార్ బోర్డ్ ఫిల్మ్ మేకర్స్ పాలిట విలన్‌గా మారకూడదు. నేను ఏడాది పాటు సెన్సార్ బోర్డ్‌కు చైర్మెన్‌గా పనిచేశాను. అక్కడి రూల్స్, గైడ్‌లైన్స్ తెలుసు. శ్యామ్‌బెనెగల్ కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌ను వెంటనే అమలు జరపాలి' అని అన్నారు.

స్లైస్ ప్రేమకథా చిత్రం..


సుజిత్ సర్కార్

బాలీవుడ్‌లో దర్శకుడు సుజిత్ సిర్కార్‌కి ఓ డిఫరెంట్ ఇమేజ్ ఉంది. మనుషుల జీవితాల్ని అత్యద్భుతంగా తెరకెక్కించగల దిట్ట ఆయన. 'విక్కీ డోనర్', 'మద్రాస్ కేఫ్', 'పీకూ' వంటి తదితర విభిన్న కథాచిత్రాలే అందుకు నిదర్శనం. తాజాగా ఆయన 'ది అక్టోబర్' పేరుతో వరుణ్ ధావన్ హీరోగా స్లైస్ ప్రేమ కథా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జీవితానికి సంబంధించిన సున్నితమైన అంశాలూ ఈ చిత్రంలో ఉంటాయట.


శ్రద్ధా కపూర్

బ్యాక్ టు బ్యాక్ రెండు ద్విభాషా చిత్రాలు..

'త్వరలో తమిళంలో విడుదల కాబోతున్న రెండు చిత్రాల్లోనూ నా పాత్రకు ప్రాధాన్యం ఉండటం నా అదృష్టం' అని అంటోంది కాజల్. తెలుగుతోపాటు తమిళంలోనూ స్టార్ హీరోయిన్‌గా కాజల్ ఓ ప్రత్యేక ఇమేజ్ ఉంది. 'పళని' చిత్రంతో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఆమె 'తుపాకి'తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాదాపు యువ కథానాయకులందరితో నటించిన కాజల్ ప్రస్తుతం అజిత్‌తో 'వివేగం', విజయ్‌తో 'మెర్సల్' చిత్రాల్లో నటిస్తోంది. తెలుగులో రానాతో కలిసి నటించిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం తమిళంలో 'నాన్ ఆనైయిట్టాల్'గా ఈ నెల 11న విడుదలవుతుండగా, అజిత్ 'వివేగం' చిత్రం ఈ నెల 25న రిలీజ్ అవుతోంది. దీంతో ఒకే నెలలో రెండు సినిమాలు రిలీజ్ కావడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేసింది కాజల్. 'ఈ చిత్రాల కోసం రెట్టింపు ఉత్సాహంతో ఎదురుచూస్తున్నాను. నా పాత్రలకు ప్రాధాన్యత కలిగిన ఈ చిత్రాలు కచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తాయని నమ్ముతున్నా. అలాగే విజయ్‌తో నటిస్తున్న 'మెర్సల్' చిత్రంలోనూ నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో కొత్త కాజల్‌ని చూస్తారు' అని తెలిపింది. దీంతోపాటు కళ్యాణ్‌రామ్ సరసన 'ఎమ్మెల్యే' చిత్రంలోనూ కాజల్ నటిస్తోంది.

లేడీ డాన్ టు వ్యోమగామి..

'ప్రస్తుతం ముంబయి లేడీడాన్ హసీనా పార్కర్‌గా నటిస్తున్న శ్రద్ధా కపూర్ తాజాగా యువ కథానాయకుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌కి జోడీగా ఓ నూతన చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్పేస్ అడ్వెంచర్ చిత్రంగా రూపొందుతున్న 'చందమామ దూర్ కె' చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికైంది. ముగ్గురు వ్యోమగాముల చుట్టూ తిరిగే ఈ కథాంశంలో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, సీనియర్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీలతోపాటు శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.
ఈ చిత్రం సెప్టెంబర్ నుంచి సెట్స్ పైకి వెళ్ళనుంది. వ్యోమగామిగా ఎలా ప్రవర్తిస్తారనే విషయంపై పాత్రకు సహజత్వం తీసుకురావడం కోసం హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇటీవల నాసాలో శిక్షణ కూడా తీసుకున్నాడు. అయితే ఇందులో ఆర్.మాధవన్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 26న విడుదల చేయనున్నారు. శ్రద్ధా ప్రస్తుతం నటిస్తున్న 'హసీనా పార్కర్' చిత్రం ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ధరల నియంత్రణపై చర్యలు తీసుకోవాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు, సంచార వాహనాల ద్వారా సబ్సిడీ రేట్లకు కూరగాయలు అందజేయాలని డిమాండ్ చేశారు. టమాట, బెండకాయ, బీన్స్ ఇతర కూరగాయాలతో పాటు, ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లి, వంటనూనెలు, బియ్యం తదితర నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. టమాట, పచ్చిమిర్చి ధరలు కొంత తగ్గినా, దళారులు ఆ ఫలితాన్ని ప్రజలకు అందనీయడం లేదని తెలిపారు. ధరల పెరుగుదలతో ఇంటి వారాంతపు ఖర్చులు పెరిగి కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయలను తగ్గించి వాడుతున్నారు. దీంతో శరీరానికి అందాల్సిన పోషకాలు అందడం లేదు. వర్షాలు పడి ఉత్పత్తి పెరిగి పంట చేతికి వచ్చే సమయంలోనే ధరలు ఇంత పెరిగితే, రాబోయే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. గతంలో నగరం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేసి రాజధానికి అందించేవారు. ప్రస్తుతం ఆ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబంధహస్తాల్లో చిక్కుకున్నాయి. వీటికి తోడుగా రైతుకు మద్దతు ధర నిర్ణయించడం, సబ్సిడీలు అందజే యడం, రవాణా సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవడంతో దళారుల ఇష్టారాజ్యమైంది. ప్రభుత్వ నిఘా లేదు. దీంతో అటు రైతు, ఇటు వినియోగదారులు బాధితులవున్నారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా కూర గాయలను సబ్సిడీ రేట్లకు అందజేయాలని, సంచార వాహనాల ద్వారా నిర్ణీత ధరలకే విక్రయించాలని, రైతులు కూరగాయల సాగును పెంచేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించాలని తమ్మినేని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



జీఎస్టీపై ప్రధాని వద్దకు తీసుకెళ్లండి... :సీపీఐ (ఎం)

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వల్ల రాష్ట్రానికి, ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రాన్ని నిలేయకపోవటం అత్యంత శోచనీయమని సీపీఐ (ఎం) విమర్శించింది. ఇది తెలంగాణ సమాజాన్ని అవమానించటమేనని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తమ్మినేని మాట్లాడుతూ... జీఎస్టీపై అఖిలపక్షాన్ని తక్షణం ప్రధాని (ఢిల్లీకి) వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ భారాలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి... 24 గంటలు గడవకముందే ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూద్దామంటూ పేర్కొనటం విడ్డూరంగా ఉందన్నారు. గడిచిన నెల రోజుల్లో జీఎస్టీ వల్ల ఏయే రంగాలపై ఎంతెంత భారాలు పడ్డాయనే విషయాన్ని ఉన్నతాధికారులు అంకెలతో సహా సీఎంకు వివరించారని తెలిపారు. అయినప్పటికీ 'వేచి చూద్దాం...' అంటూ సీఎం వ్యాఖ్యానించటం శోచనీయమని చెప్పారు. జీఎస్టీ వల్ల దేశ సమైక్యతకు విఘాతం కలుగుతుందని తెలిపారు. అది రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ముందుకు రావాలని తమ్మినేని సీఎంను డిమాండ్ చేశారు.

మీది కుసంస్కారం...

- సీఎం వ్యాఖ్యలపై సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ భాష..కుసంస్కారంతో కూడుకున్నదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు మంగళవారం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు, అధికార పక్షం మీద రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు చేయటం అనివార్యమని పేర్కొన్నారు. రాజకీయంగా సమాధానం చెప్పలేనప్పుడు చేసేది వ్యక్తిగత దాడులేనని విమర్శించారు.

సెన్సెక్స్	నిఫ్టీ	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
▼ 259 32,014	▼ 79 9,978	63.63	రూ. 29,058	రూ. 40,800

కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365

మార్కెట్లోకి 'క్లాసిక్' జుపిటర్: టీవీఎస్



చెన్నై : ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ దేశీయ మార్కెట్లోకి ఆధునీకరించిన జుపిటర్ వాహనాన్ని తీసుకువచ్చింది. 'జుపిటర్ క్లాసిక్ ఎడిషన్' రూపంలో ఈ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ.55,266 (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ). ప్రస్తుతం ఉన్న జుపిటర్‌కు కాస్త భిన్నంగా టీవీఎస్ దీన్ని తీర్చిదిద్దింది. వాహనం ముందు భాగంలో విండ్ షీల్డ్, గుండ్రని క్రోమ్ అద్దాలు, క్రోమ్ బ్యాక్‌రెస్ట్, యూఎస్‌బీ ఛార్జర్, డిస్క్‌బ్రేక్‌తో పాటు రెండు రంగుల సీటు కవర్ ఈ వాహనం ప్రత్యేకతలు. కొత్త అమరికల వల్ల జుపిటర్ మరింత ఆకర్షణీయంగా ఉంటుందని, ఇంజిన్ సామర్థ్యంలో ఎలాంటి మార్పు లేదని కంపెనీ స్పష్టం చేసింది.

ఐసీఐసీఐ బ్యాంకు తక్షణ క్రెడిట్ కార్డు

హైదరాబాద్ : ఐసీఐసీఐ బ్యాంకు తక్షణ క్రెడిట్ కార్డు సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించింది. 'బ్యాంకింగ్ పరిశ్రమలో సేవింగ్స్ ఖాతా వినియోగదారులకు క్రెడిట్ కార్డును తక్షణమే, పూర్తి డిజిటల్, పేపర్‌లెస్ విధానంలో అందించడం మొదలుపెట్టినట్టుగా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూప్ బగ్చీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో లక్షలాది మంది ముందస్తు అర్హులైన ఖాతాదారులు తక్షణమే క్రెడిట్ కార్డు నెంబర్, ముఖ్యమైన వివరాలు ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. అన్ని రోజుల్లో ఎప్పుడైనా దీన్ని పొందవచ్చన్నారు. రూ. 4లక్షల వరకు పరిమితితో ఈ క్రెడిట్ కార్డులను అందిస్తున్నామన్నారు. కార్డు కోసం బ్యాంకు ఇంటర్నెట్ బ్యాంకింగ్ వేదికపై 'క్రెడిట్ కార్డు ఇన్ ఏ ఫ్లాష్'పై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

యాక్సిస్ బ్యాంకూ కోత పెట్టింది!

ముంబయి : ప్రయివేటు విత్త సంస్థ యాక్సిస్ బ్యాంకు పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. పొదుపు ఖాతాలపై చెల్లించే వడ్డీరేటును 50 బీపీఎస్ పాయింట్లు తగ్గించి 3.5 శాతంగా నిర్ణయించినట్టుగా ఆ బ్యాంకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గత నెలలో పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును తగ్గించిన విషయం తెలిసిందే. ఈ బాటలోనే మరో పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం యాక్సిస్ బ్యాంకు కూడా అర్ధ శాతం వడ్డీ రేటును తగ్గించింది. మరిన్ని బ్యాంకులు త్వరలోనే ఈ తరహా నిర్ణయాలు తీసుకోనున్నాయని అంచనా. రూ. 50లక్షల వరకు నిల్వ ఉన్న ఖాతాలకు ఈ రేట్ల కోత వర్తిస్తుందని యాక్సిస్ బ్యాంకు ప్రకటించింది. రూ.50లక్షలకుపైన యథాతథంగా 4శాతం వడ్డీ అమల్లో ఉంటుందని పేర్కొంది. తగ్గించిన వడ్డీ రేట్లు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయని ఆ బ్యాంకు తెలిపింది. మంగళవారం బీఎస్ఈలో యాక్సిస్ బ్యాంకు షేర్ 1.32 శాతం తగ్గి రూ.499.30 వద్ద ముగిసింది.

331 కంపెనీల ట్రేడింగ్ నిలిపివేత!

- 'డొల్ల' కంపెనీలన్న అనుమానంతో చర్యలు
- సెబీ నియంత్రణతో రంగంలోకి ఎక్స్ఛేంజీలు
- నల్లధన ఏరివేతలో భాగంగానే నిర్ణయం!
- జీఎస్ఎం జాబితాలోకి చేరిపోయిన కంపెనీలు
- దాదాపు రూ.9000 కోట్ల విలువైన స్టాక్స్ 'స్టక్'
- చిన్న మదుపరులు, ఎంఎఫ్‌లపై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ: డొల్ల కంపెనీల ఏరివేత వ్యవహారంలో ప్రభుత్వ వర్గాలు చురుగ్గా చర్యలు చేపడుతున్నాయి. అక్రమంగా నిధుల ల్యాండరింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టుగా అనుమానం కలిగిన దాదాపు 331 డొల్ల కంపెనీలపై సెబీ కొరడా ఝుళిపించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సిఫారసుల మేరకు ఎక్స్ఛేంజీల్లో నమోదైన దాదాపు 331 అనుమానాస్పద డొల్ల కంపెనీలపై తగిన చర్యలు చేపట్టాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ స్టాక్ మార్కెట్లకు సూచించింది. నల్లధన నియంత్రణ చర్యల్లో భాగంగా సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో మంగళవారం నుంచి 331 డొల్ల కంపెనీల ట్రేడింగ్ నిలిచిపోయింది. నెల రోజుల పాటు ఆయ స్క్రిప్‌ల కౌంటర్లలో లావాదేవీలు జరిపేందుకు వీలు పడదు. ఈ కంపెనీలు ల్యాండరింగ్ కార్యక్రమాల ద్వారా అక్రమ నిధులను తరలిస్తున్నట్టు ప్రభుత్వ పరిశీలనకు వచ్చిన నేపథ్యంలోనే సర్కారు సూచన మేరకు సెబీ స్టాక్ మార్కెట్లకు ఈ ఆదేశాలను జారీ చేసినట్టుగా సెబీ వర్గాలు చెబుతున్నాయి. తాజా నిర్ణయంతో ఈ 331 కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన చిన్న మదుపరులు, మ్యూచువల్ ఫండ్స్ వారిపై తీవ్ర ప్రభావం పడనుంది. దాదాపు రూ.9,000 కోట్ల విలువైన సంపద ఈ కంపెనీల స్టాక్స్ రూపంలో స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద నిలిచిపోనున్నాయి. ఈ కంపెనీల సెక్యూరిటీలను స్టేజ్-4లో 'గ్రేడెడ్ సర్వైలెన్స్ మెజర్స్' (జీఎస్ఎం) విభాగంలో ఉంచనున్నారు. ట్రేడింగ్ నిలిపివేసిన స్టాక్స్ జాబితాలో ప్రకాశ్ ఇండస్ట్రీస్, ఎస్‌క్యూఎస్ బీఎఫ్ఎస్ఐ, పార్శ్వనాథ్ డెవలపర్స్, ఫిన్‌కాన్ స్పిరిట్, గ్యాలంట్ ఇస్పాట్, జే కుమార్ ఇన్‌ఫ్రా, ప్రైమ్ క్యాపిటల్ మార్కెట్, ద్వితీయ ట్రేడింగ్, ఆధునిక్ ఇండస్ట్రీస్, వీబీ ఇండస్ట్రీస్ తదితర సంస్థలు ఉన్నాయి.

ఇక నెలకొకసారి మాత్రమే ట్రేడింగ్ వీలు...

మనీ ల్యాండరింగ్ కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్న అనుమానంపై ట్రేడింగ్ నిలిపివేసిన 331 సంస్థలను స్టాక్ ఎక్స్ఛేంజీలు జీఎస్ఎం విభాగంలో చేర్చాయి. అంటే ఇకపై కేవలం నెలకు ఒక్కసారి మాత్రమే ఈ స్టాక్స్‌లో ట్రేడింగ్‌కు అనుమతించనున్నారు. నిబంధనల ప్రకారం ప్రతినెల మొదటి సోమవారం మాత్రమే ఈ స్టాక్స్‌లో ట్రేడింగ్‌కు అవకాశం కల్పిస్తారు. ఆ రోజు కూడా చివరి ట్రేడింగ్ రోజు నాటి ధర కంటే ఎక్కువకు షేర్లను అమ్మడం గానీ కొనడం గానీ అనుమతించరు. ఒకవేళ ఎవరైనా కొనుగోలుకు ఆసక్తి కనబరిస్తే వారు వద్ద నుంచి 200 శాతం అధికంగా సర్వైలెన్స్ డిపాజిట్లను ఎక్స్ఛేంజీలు వసూలు చేయనున్నాయి.

విలవిలలాడిన మార్కెట్లు

- 259 పాయింట్ల మేర కుంగిన బీఎస్ఈ సెన్సెక్స్
- 10,000 మార్కు దిగువకు చేరిన ఎన్ఎస్ఈ నిఫ్టీ

ముంబయి : మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' 331 డొల్ల కంపెనీలపై కొరడా ఝుళిపించడంతో మార్కెట్లలో ప్రతికూల ప్రభావం చోటు చేసుకుంది. సెబీ చర్యకు తోడు ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ రంగాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లు మరింత నష్టాల పాలయ్యాయి. ఈనేపథ్యంలోనే మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 300 పాయింట్ల మేర పతనమయ్యింది. మరోవైపు బ్యాంకింగ్ సూచీల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో నిఫ్టీ ఏకంగా 10వేల దిగువకు జారింది. ఈ పరిణామాల మధ్య బీఎస్ఈ సెన్సెక్స్ 259.48 పాయింట్లు కోల్పోయి 32,014.19కు పడిపోయింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 78.85 పాయింట్లు పతనమై 9,978.55 వద్ద ముగిసింది. బీఎస్ఈలో రంగాల వారిగా రియాల్టీ సూచీ అత్యధికంగా 4.53 శాతం నష్టపోయింది. ఇదే క్రమంలో ఆయిల్ అండ్ గ్యాస్ 2.16 శాతం, పీఎస్‌యూ 2.08 శాతం, విద్యుత్ 1.88 శాతం చొప్పున పతనమై మార్కెట్లపై ఒత్తిడిని పెంచాయి. కాగా ఒక్క లోహ సూచీ మాత్రమే 1.63 శాతం పెరిగింది. సెన్సెక్స్‌లో డాక్టర్ రెడ్డీస్ 4.91 శాతం, కోల్ ఇండియా 2.67 శాతం, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2.33 శాతం, ఐటీసీ 2.07 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 1.7 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు టాటా స్టీల్ 2.63 శాతం, సిప్లా 2.32 శాతం, బజాజ్ ఆటో 0.82 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 0.31 శాతం, హెచ్‌యూఎల్ 0.17 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఇగత కొద్ది రోజులుగా వరుసగా పెరిగిన బ్యాంకింగ్ సూచీల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు ఆసక్తి చూపారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు బ్యాంకింగ్ సూచీ 23 శాతం పెరిగింది. ఈ క్రమంలోనే అమ్మకాల ఒత్తిడితో యెస్ బ్యాంకు, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బ్యాంకు ఆఫ్ బరోడా సూచీలు రెండు శాతం పైగా విలువ కోల్పోయాయి. యాక్సిస్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు కోటక్ మహీంద్రా బ్యాంక్ సూచీలు ఒక్క శాతం పైగా నష్టపోయాయి.

ట్రయంఫ్‌తో జతకట్టిన బజాజ్

- మధ్యశ్రేణి బైకుల తయారీ దిశగా అడుగులు
- అంతర్జాతీయ వ్యాప్తికి పరస్పర సహకారం



న్యూఢిల్లీ : దేశీయ ద్విచక్ర వాహన దిగ్గజ సంస్థ బజాజ్ ఆటో బ్రిటన్‌కు చెందిన మేటి బైక్స్ తయారీ సంస్థ ట్రయంఫ్‌తో జత కట్టింది. మధ్యశ్రేణి బైకుల రూపకల్పన, అభివృద్ధి, పంపిణీకి సంబంధించి ప్రపంచ స్థాయి భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టుగా మంగళవారం రెండు సంస్థలు ఇక్కడ అధికారికంగా వెల్లడించాయి. ఇరు సంస్థల సామర్థ్యాల దృష్టిలో ఉంచుకొని మధ్యశ్రేణిలో మేటి బైక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగానే అడుగులు వేసేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుందని బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ తెలిపారు. బజాజ్ సంస్థతో జట్టు కట్టడం వల్ల తమ కంపెనీ ఉత్పాదలనలను వర్ధమాన మార్కెట్లలోకి ఇతర దేశాలలోకి విస్తరించేందుకు వీలు పడుతుందని ట్రైయంప్ మోటార్ సైకిల్ సీఈవో నిక్ బ్లూర్ తెలిపారు. అయితే ఈ ఒప్పందం ఏరూపంలో ముందుకు సాగనుందన్న విషయమై ఇరు సంస్థల నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. బజాజ్ సంస్థ ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో 110 సీసీ నుంచి 373 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన డోమైనర్ వాహనాన్ని మార్కెట్లో విడుదల చేసింది. హైపవర్ బైక్‌లను అందించే నిమిత్తం బజాజ్ సంస్థ ఇప్పటికే ఆస్ట్రేలియాకు చెందిన కేటీఎం సంస్థతో ఒప్పందం చేసుకొని బైక్‌ల విక్రయాలు సాగిస్తోంది.ఇప్పుడు ట్రయంఫ్‌తో జట్టుకట్టడం వల్ల 1000సీసీ లోపు సూపర్ బైక్‌లను తయారు చేసి అంతర్జాతీయంగా విక్రయించే దిశగా ఈ కంపెనీలు అడుగులు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మైలాన్ నుంచి 'హెచ్ఐవీ' ఔషధం

నవతెలంగాణ,వాణిజ్య విభాగం: మైలాన్ ఫార్మాస్యూటికల్ అనుబంధ కంపెనీ మైలాన్ ఎన్‌వీ హెచ్ఐవీ చికిత్సకు అంటీరెట్రోవైరల్ (ఎఆర్‌వీ) ఔషధం 'అవొంజా'ను అభివృద్ధి చేసింది. దీనికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) గుర్తింపులభించినట్టు ఆ కంపెనీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అవొంజా (టీఎల్ఈ400)ను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సైతం ప్రతిపాదించిందని మైలాన్ ప్రెసిడెంట్ రాజీవ్ మాలిక్ పేర్కొన్నారు. అవొంజాను తక్కువ ధరల్లోనే రోగులకు అందుబాటులో ఉంచామన్నారు. భారత్‌లో తొలిసారి తమ కంపెనీ మాత్రమే ఈ తరహా మిళితమైన ఔషధాన్ని అందిస్తుందన్నారు.

ట్రావెల్ ఏజెంట్స్ నూతన కమిటీ ఎన్నిక

హైదరాబాద్: 'ది ట్రావెల్ ఎజెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (టాయ్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చాప్టర్‌కు నూతన కమిట ఎన్నికయింది. అజయ్ కెరామిడిని తిరిగి చైర్మెన్‌గా, కార్యదర్శిగా నగేష్ పమ్‌పటి, ట్రెజరర్‌గా శ్రీనివాస్ కుమార్ నియమితులయ్యారు. అజయ్, నగేష్‌లు వరుసగా మూడోసారి ఎన్నికయ్యారని టాయ్ ఒక ప్రకటనలో తెలిపింది. రెండేండ్ల పాటు ఈ కమిటీ అధికారంలో ఉంటుంది. 30 ఏండ్ల నుంచి పని చేస్తోన్న టాయిలో 110 మంది సభ్యులున్నారు.

విద్యార్థినులపై వార్డెన్ అసభ్య ప్రవర్తన

- చితకబాదిన విద్యార్థినులు, స్థానికులు
- వార్డెన్ అరెస్టు, చారిటీ హోం సీజ్



నవతెలంగాణ - సిద్దిపేట

చారిటీ హోం లోని బాలికలను కన్నబిడ్డల వలే చూసుకోవాల్సిన వార్డెన్ వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థినులు, స్థానికులు కలిసి ఆ వార్డెన్‌ను చితకబాదారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కేసీఆర్‌నగర్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు, విద్యార్థుల వివరాల ప్రకారం.. పట్టణంలోని కేసీఆర్‌నగర్‌లో మూడేండ్లుగా ప్రేమనిలయం పేరుతో ఓ చారిటీ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నారు. దానికి ఎలాంటి అనుమతులూ లేవు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది బాలికలు, 15 మంది బాలురు హోంలో ఉంటున్నారు. అయితే చారిటీ నిర్వాహకుడు ప్రభాకర్ కొంత కాలంగా తరచూ తాగి చారిటీ హోంకి వస్తున్నాడు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. మంగళవారం కూడా విద్యార్థినులను వేధించటం మొదలు పెట్టాడు. సహనం నశించిన బాలికలు స్థానికుల సహాయంతో ప్రభాకర్‌ను చితకబాదారు. ప్రభాకర్‌తోపాటు అతని సోదరుడు సైతం ఇలాగే ప్రవర్తించేవాడని విద్యార్థులు వాపోయారు. విషయం తెలుసుకున్న శిశు సంక్షేమ అధికారిని స్వప్న, డీడబ్ల్యూఓ భాస్కర్ అక్కడికి చేరుకొని విచారించారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న చారిటీ హోంను సీజ్ చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేయించారు. అందులోని బాలబాలికలను మెదక్ జిల్లా దొంతి హాస్టల్‌కు తరలించారు.

ట్రీగార్డులను దొంగిలిస్తే జైలు : సీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హరితహారం అమలులో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఉద్యోగులు చాంపియన్లని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అన్నారు. సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఉన్నా, పక్కా ప్రణాళికతో ప్రతీ మొక్కనూ బతికించుకోవాలని చెప్పారు. మరో మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని గుర్తు చేశారు. వానలు లేనప్పుడు మొక్కలు రక్షించుకునే విషయమై ఆందోళన అవసరం లేదన్నారు. మొక్కలను రక్షించే ట్రీగార్డులను దొంగిలిస్తే జైలు తప్పదని హెచ్చరించారు. రేపటి సమాజానికి మంచి భవిష్యత్తును, వాతావరణాన్ని ఇవ్వాలన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనలోంచి పుట్టిందే తెలంగాణకు హరితహారమన్నారు. జాతీయ రహదారుల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అదర్‌సిన్హా, అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి అశోక్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండేండ్ల సర్వీసును పొడిగించాలి

- పిఆర్ ఇంజినీర్స్ ఫోరం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లకు మరో రెండేండ్ల సర్వీసును అదనంగా పొడిగించాలని పంచాయతీరాజ్ సివిల్ ఇంజినీర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్యామ్‌సుందర్ అన్నారు. సకల జనుల సమ్మెలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీశైలంతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు.

అంతర్రాష్ట్ర ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

- తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల ఉమ్మడి మార్గదర్శకాలు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంతర్రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీలకు మోక్షం లభించింది. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చజెండా ఊపాయి. ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు సంబంధించి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు దినేష్‌కుమార్, ఎస్పీ సింగ్ ఉమ్మడి మార్గదర్శకాలు మంగళవారం జారీ చేశారు. స్థానిక, జిల్లా, జోనల్, మల్టీజోనల్ క్యాడర్ వారీగా అంతర్రాష్ట్ర బదిలీలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. స్థానికత ఆధారంగా స్పౌజ్ (భార్యాభర్తలు), లోకల్ క్యాడర్ (జిల్లా, జోనల్, మల్టీ జోనల్)లోని పరస్పర బదిలీలు, రాష్ట్రక్యాడర్ లోని పరస్పర బదిలీలకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. రాష్ట్ర క్యాడర్ ఉద్యోగులకు ఆయా క్యాడర్, కేటగిరీల్లోనూ పరస్పర బదిలీలకు అనుమతి స్తారు. భార్యాభర్తలు వేర్వేరు రాష్ట్రాల్లో పనిచేస్తున్న సందర్భంలో ఇరువురిలో ఒకరిని కోరుకున్న రాష్ట్రానికి బదిలీ చేస్తారు. ఆ ఇద్దరిలో కోరుకున్న రాష్ట్రానికి స్థానికులై ఉండాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులకు సంబంధించి ఒకే కేటగిరీ, ఒకే సబ్జెక్టు వారినే పరస్పర బదిలీలకు అనుమతిస్తారు. నిర్ణీత నమూనాలో నెలరోజుల్లో సంబంధిత శాఖాధిపతికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇరు రాష్ట్రాల్లోని సంబంధిత శాఖాధిపతులు ఖాళీల లభ్యతను బట్టి రెండు నెలల్లోగా దరఖాస్తులను పరిశీలించి సాధారణ పరిపాలన శాఖ అనుమతితో బదిలీ ఉత్తర్వులను జారీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఈ మార్గదర్శకాలతో ఊరట లభిస్తుంది. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులు ఇక్కడికి రావడానికి అనేక ఉద్యమాలు చేపట్టిన విషయం తెలిసిందే.

రాష్ట్రం ప్రాతిపదికనగా చేపట్టాలి : టీఎస్‌యూటీఎఫ్

పరస్పర బదిలీలను వ్యక్తుల మధ్య కాకుండా రాష్ట్రాల మధ్య అనుమతించాలని టీఎస్‌యూటీఎఫ్ కోరింది. వ్యక్తులుగా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో క్యాటగిరీ వారీగా, సీనియార్టీ ప్రాతిపదికన సమాన సంఖ్యలో బదిలీలకు అనుమతిస్తే పారదర్శకంగా బదిలీలు జరుగుతాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చావ రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లేనిపక్షంలో అవినీతికి, ప్రలోభాలకు ఆస్కారం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థల ఎన్నికలు వాయిదా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు కార్మికశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 8వ తేదీ జరగాల్సిన ఈ ఎన్నికల్ని సెప్టెంబర్ 8వ తేదీ నిర్వహిస్తామని పేర్కొంది. కార్మికులకు గుర్తింపు కార్డుల జారీతోపాటు ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు కెటిపిఎస్‌లో రెగ్యులర్ అయిన 40మంది ఉద్యోగులకు ఓటు హక్కు కల్పించడంపై వివాదం చెలరేగింది. కార్మికశాఖ జారీ చేసిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1వ తేదీ వరకు సవరించిన ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని 1104, 1535 యూనియన్లు డిమాండ్ చేశాయి. దీన్ని టీఆర్ఎస్‌కెవి (హెచ్53), 327 యూనియన్లు వ్యతిరేకించాయి. ఎన్నికల్ని వాయిదా వేయాలని యాజమాన్యాన్ని, కార్మిక శాఖను కోరారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్ని వాయిదా వేస్తున్నట్టు కార్మికశాఖ తెలిపింది. పై అంశాలపై ఈనెల 17వ తేదీ పోటీలో ఉన్న అన్ని కార్మికసంఘాలతో చర్చలు జరపనున్నట్టు పేర్కొంది.

వ్యతిరేకిస్తున్నాం- పద్మారెడ్డి (1104 అధ్యక్షులు)

కార్మిక శాఖ తీసుకున్న నిర్ణయానికి మేం వ్యతిరేకం. ఎన్నికలు నిర్వహించాలనే కోరుతున్నాం. అయితే ఏ వత్తిళ్ల ఫలితమో ఎన్నికల్ని వాయిదా వేశారు. కొన్ని కార్మిక సంఘాలు కాంట్రాక్ట్ వర్కర్లకు కూడా ఓటు హక్కు కల్పించాలని కోరాయి. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా మేం సిద్ధమే

తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



ఆగస్టు 15 తర్వాత శామీర్‌పేటలో మహాసభ

- మేడ్చల్‌లోని ప్రతి గ్రామానికీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు: మూడుచింతలపల్లి గ్రామసభలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ - శామీర్‌పేట

దేశంలోనే రాష్ట్రం 21.7శాతం వృద్ధిరేటు సాధించి తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణను మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. మంగళవారం మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, మూడుచింతలపల్లి గ్రామంలో సర్పంచ్ పద్మాలక్ష్మారెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు మూడుచింతలపల్లి నుంచి చీకటిమామిడి వరకు డబుల్ రోడ్డుతోపాటు యాదాద్రికి బస్సు సౌకర్యం కల్పిస్తానన్నారు. రాష్ట్రంలోని పల్లెలు పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతులు బాగుండాలంటే నీళ్లు, కరెంటుతోపాటు పెట్టుబడి కావాలని, ఇవన్నీ ప్రభుత్వం సమకూర్చుతుందని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం కరెంటు కష్టాలు తీరిపోయాయని, గోదావరి జలాలతో మేడ్చల్ జిల్లాలోని అన్ని చెరువులు నీటితో కళకళలాడబోతున్నాయన్నారు. జిల్లాలోని 374 చెరువులను గోదావరి జలాలతో నింపి ప్రజల కష్టాలు తీరుస్తానని హామీనిచ్చారు. మూడుచింతలపల్లి గ్రామస్తుల కోరిక మేరకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఐదు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ యోధులు వీరారెడ్డి, వెంకట్రాంరెడ్డిల జ్ఞాపకార్థం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఆరునెలల్లో ఆరోగ్య కేంద్రం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ మధ్యలో ఒక మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. శామీర్‌పేట మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఆగస్టు 15 తర్వాత మహాసభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల కోసం అరెకరం స్థలంలో సుమారు రూ.30 లక్షలతో భవనాలు నిర్మిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ.రెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, వివేక్, మాధవరావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎంపీ మల్లారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, ఆర్డీఓ హన్మంత్‌రెడ్డి, ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్, జడ్పీటీసీ బాలేష్, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చైనాలో భారీ భూకంపం

- 100 మందికిపైగా మృతి !

చెంగ్డూ : చైనాలోని సిచువాన్ ప్రావిన్సులో మంగళవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. ఈ మేరకు చైనా భూకంప కేంద్రం (సీఈఎన్‌సీ) ఓ ప్రకటన విడుదల చేసింది. కడపటి సమాచారం మేరకు భూకంపం ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారని, మృతుల సంఖ్య 100 వరకూ ఉండొచ్చునని ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు. 63 మంది తీవ్రంగా గాయపడ్డారని, ఇందులో 30 మంది పరిస్థితి విషమంగా ఉందని 'జిన్హువా' పత్రిక తెలిపింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.5గా నమోదైంది. భూమి లోపల 20 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు అమెరికా జియాలాజికల్ సర్వే తెలియజేసింది. భూకంప ధాటికి పెద్ద సంఖ్యలో ఇండ్లు కూలిపోయినట్టు చైనా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. విపత్తు సంభవించిన ప్రాంతానికి చేరుకున్న సహాయక సిబ్బంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు తెలిపింది. భూకంప తీవ్రత కేంద్రానికి 35 కిలోమీటర్ల పరిధిలో ఎక్కువగా ఉన్నట్టు వెల్లడించింది. అత్యధిక జనాభా నివసించే కొండ ప్రాంతాల్లో లక్షా 30 వేల ఇండ్లు నేలమట్టమై ఉండొచ్చునని చైనా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అంచనా వేసింది. బాధితుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అగ్నిమాపక సిబ్బంది, సైన్యాన్ని సిద్ధం చేసినట్టు 'పీపుల్స్ డైలీ' తెలియజేసింది. సిచువాన్, దక్షిణ చెంగ్డూ ప్రావిన్స్‌ల్లో కొండ ప్రాంతాలెక్కువ. నైరుతి చైనాలోని కొండ ప్రాంతాల్లో తరుచూ భూకంపాలు ఏర్పడుతున్నాయి. సిచువాన్‌లో 2008 నాటి భూకంపంలో 70 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. గత కొద్ది రోజులుగా సిచువాన్, చెంగ్డూ ప్రావిన్స్‌లలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కనీసం 24 మంది చనిపోయి వుంటారని సమాచారం.



మాట్లాడుతున్న మానవ హక్కుల సంఘం నేత జీవన్ కుమార్

నక్సలైట్ల ఎజెండా అంటే అరెస్ట్‌లేనా..?

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత గోవర్దన్

- ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలి : తమ్మినేని

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉద్యమకారులను అరెస్ట్ చేయడమేనా..? నక్సలైట్ ఎజెండా అని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత కే గోవర్ధన్ ప్రశ్నించారు. అరుణోదయ, రైతుకూలీకి చెందిన 8 మందిని అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. ఉద్యమకారులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన ఉద్యమ నాయకుడు అమర్‌పై కుట్ర కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వమనేదీ చట్టబద్ధంగా పని చేయాలన్నారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే ఉద్యమకారులపై కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

వనరులను దోపిడీ చేస్తూ ఆరాచకాలకు పాల్పడుతున్న ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతున్నదని, మాట్లాడే స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మానవ హక్కుల సంఘం నేత జీవన్ కుమార్ మాట్లాడుతూ సిద్ధిపేటలో చట్ట వ్యతిరేక పాలన సాగుతున్నదని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ప్రజా హక్కులకు భంగం కల్గిస్తోందని విమర్శించారు. అరుణోదయ విమలక్క మాట్లాడుతూ ఈ నెల 3న 8 మందిని అరెస్ట్ చేశారని తెలిపారు. వీరిలో ఇద్దరిని మాత్రమే కోర్టుకు సరెండర్ చేశారన్నారు. మిగిలిన ఆరుగురిలో ఒకరిని పోలీసులు అదుపులో ఉంచుకొని మినహా ఐదుగురిని విడుదల చేశారని ఆమె తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి ఎవరో పూర్తి వివరాలు తెలిపాలని ఆమె డిమాండ్ చేశారు.



ప్రకృతి అందాలకు పుట్టిల్లు తెలంగాణ. పాలనురగల్లాంటి జలపాతాలు. ఒకదానికి మించి మరొకటి పోటీపడుతూ జలజలా జాలువారుతాయి ఇక్కడి సెలయేర్లు. పచ్చని చెట్లు, పక్షుల కిలకిలా రావాల వింటూ అడవిలో నడుచుకుంటూ వెళితే చాలు ఎంతటి వారినైనా సరే ఆశ్చర్యచకితులను చేస్తాయి. ప్రతిక్షణం ఆహ్లాదాన్ని అందించే కమనీయమైన జలపాతాలను ఎన్నిసార్లు చూసినా తనవితీరదు !

జలతారు అందాలు

గుండాల జలపాతం...



గుండాల జలపాతం...

గుండాల జలపాతం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని గుండాల గ్రామ సమీపంలో ఉంది. ఇక్కడ ఎత్తైన బండరాళ్ళపై నుండి కష్ణానది ప్రవహించడం వలన జలపాతం ఏర్పడింది. కష్ణానది పడమటి దిశ నుండి తూర్పు వైపు ప్రవహిస్తూ అందమైన జలపాతాన్ని సష్టిస్తుంది. జలపాతానికి ఎగువన పడమటి వైపు నాలుగైదు కిలో మీటర్ల దూరంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, దిగువన తూర్పు వైపు ఇరవై ఐదు కిలోమీటర్ల దూరంలో బీచుపల్లి ఆంజనేయస్వామి దేవాలయం ఉంటుంది. ఈ జలపాతం కేవలం వేసవి కాలంలో మాత్రమే కనిపిస్తుంది. వర్షకాలంలో నది నిండుగా, విస్తారంగా, ఉదతంగా ప్రవహించడం వలన జలపాతం కనిపించదు. వేసవిలో నీటి ఉధతి తగ్గడం వల్ల ప్రవాహం ఒక సన్నని పాయ వలే ప్రవహిస్తుంది. నదిలోని బండరాళ్ళ మీద నుండి లోయలోకి నీరు దూకడం వలన జలపాతం కనువిందు చేస్తుంది. జలపాతం ఏర్పడటానికి ముందు నది విశాలంగా తక్కువ లోతులో ప్రవహించటం వలన సందర్శకులు నీటిలో జలకాలాడుతూ వేసవిలో సేదతీరుతారు.

కుంటాల జలపాతం...

తెలంగాణలో అతిపె ద్ద జలపాతం కుంటాల జలపాతం. ఇది చూసి పరవశించని వారు ఉండరు. మయూరాల నాట్యాలు, కోయిల కూతలు ఇక్కడ ప్రవహించే జలధారల్లో చూస్తాం. వంద అడుగుల పై నుంచి తుళ్లిపడే జలధారలను ఎంత చూసినా తనివితీరదు. కుంటాల జలపాతం అందాలు తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. కుంటాల జలపాతం నేరడిగొండ మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది.

కుంటాల జలపాతం ఆదిలాబాద్ జిల్లా కడెం ప్రాజెక్టుకు దిగువన ఉంది. ఉత్తర దక్షిణ భారతానికి వారధిగా ఉన్న సహ్యాద్రి పర్వతశ్రేణుల్లో ఏర్పడిన సహజ జలపాతం ఇది. కడెం నదిపై నేలమీదకు దూకే దశ్యాలను ఆస్వాదించడానికి రెండు కండ్లు చాలవు. ఈ జలధార ఆదివాసీలకు 'జీవనరేఖ' లాంటిది. ఈ జలపాతం చుట్టూ దట్టమైన కుంటాల రిజర్వ్ ఫారెస్టు, నాగమల్ల, రోల్‌మామడ, సిరిచెల్మ రిజర్వ్ ఫారెస్టులున్నాయి. దేశంలో 41వ పులుల అభయారణ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది.

బొగత జలపాతం...

ప్రకృతి అందాలన్ని కలబోసి ఒకే దగ్గర చూడాలంటే జయశంకర్ జిల్లా, వాజేడుకు వెళ్లాల్సిందే. ప్రకతి రమణీయతకు మారుగా పిలువబడుతున్నది బొగత జలపాతం. అడవి మధ్యలో ఉండే ఈ జలపాతాన్ని చూసి తీరాలి. కాస్త దూరం నుంచి చూస్తే ఆకాశం నుంచి పాలధార కురుస్తొందా అనిపించేలా కనిపిస్తుంది. కమ్మని సంగీతం వినిపిస్తూ హొయలొలికిస్తూ కిందకు దూకుతుంది సెలయేరు. చూసే కొద్ది చూడాలనిపించే ప్రకతి అందాలు బొగత జలపాతం సొంతం. ఈ జలపాతం దగ్గరకు వెళ్లాలంటే.. ఎత్తైన పచ్చని చెట్లు, కొండల మధ్య ఉన్న అడవి నుంచి వెళ్లాలి. అడవి మధ్యలో అందమైన నీటి సెలయేర్లు కనువిందు చేస్తాయి. గుట్టల మధ్య ఆకాశమంత ఎత్తు నుంచి ధారలుగా నీళ్లు జారిపడుతుంటాయి. ఇక్కడికి కూడా టూరిస్టులు పెద్ద సంఖ్యలోనే వస్తుంటారు. అంతేకాదు మరికొంత మంది సాహసవంతులు ఈ కొండలను తాళ్లతో ఎక్కేందుకు ట్రై చేస్తుంటారు. వాజేడు మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్లు, చత్తీస్ గడ్ సరిహద్దుకు 20కిలోమీటర్ల దూరంలో ఉంటుంది బొగత జలపాతం. జూలై నుంచి నవంబరు వరకు భారీగా నీటి దూకుడు కనిపిస్తుంది.

అజలాపురం జలపాతం...

కొండల నడుమ నుంచి జారిపడుతున్న నీటి గలగలలు, చిన్నపాటి కొలనులు, ఎటు చూసినా పచ్చటి చెట్లు, చుట్టూ కొండలు... అంతటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో... ప్రకృతిసిద్ధమైన ప్రదేశాలు చాలానే ఉన్నాయి. పురాతన, వందల ఏండ్ల నాటి రాకాసి కోటగుట్టలు పచ్చని ప్రకృతితో పర్చుకున్నాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని అజలాపురం జలపాతం. అజలాపురం గ్రామం నుంచి రెండు కిలోమీటర్లు వెళితే రాచకొండ గుట్టలకు ఆనుకొని సహజ సిద్ధంగా ఏర్పనది అజలాపురం జలపాతం. జిల్లా కేంద్రం నుంచి సుమారు 80 కిలోమీటర్లు... హైదరాబాద్ నుండి 50 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చుట్టూరా కొండలు, గుట్టలతో పాటు పచ్చనిచెట్లు ఎంతో ఆహ్లాదాన్ని పంచిపెడతాడతాయి. ఇక్కడి చల్లటి, ప్రశాంతమైన వాతావరణంలో బండరాళ్లపై జారిపడుతున్న ఆ నీటి సవ్వడి పర్యాటకులకు ఆనందాన్ని కలిగిస్తుంది. చక్కటి ప్రకృతి అందాలు కలిగిన ఈ ప్రాంతం గురించి పెద్దగా ఎవరికీ తెలియదు.

గౌరి గుండం జలపాతాలు...

పర్యాటక రంగంలో జలపాతాలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ జలపాతాలు పర్యాటకులని మంత్ర ముగ్ధులను చేస్తాయి. ఎక్కడో పుట్టి పై నుంచి కిందకు పడుతుంటే ఆ నీటి శబ్దం... ఆహా ! చూడటానికి రెండు కండ్లు చాలవు. అంతగా అవి పర్యాటక రంగంలో పెనవేసుకున్నాయి. కరీంనగర్ జిల్లా మండలంలోనే మూడు జలపాతాలున్నాయని తెలిస్తే ఒకింత ఆశ్చర్యం కలగక మానదు. ఇవన్నీ రామగుండం పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. గౌరీ గుండం పచ్చని అడవులతో కళకళలాడుతూ, పచ్చని కొండల మధ్యనున్న నల్లని లోయలోకి దుముకుతూ కనిపించే తెల్లని జలపాతం గౌరీ గుండం. సుమారు 150 అడుగుల ఎత్తున కొండల వరుస శిఖరాగ్ర మధ్య భాగం నుంచి అంటే సుమారు 70 అడుగుల ఎత్తు నుంచి దుముకుతున్న దృశ్యం గౌరీ గుండం జలపాతం సొంతం.

గౌరీ గుండం జలపాతానికి దక్షిణాన కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంటుంది 'సీతమ్మ కొల్లుగుంట', ఉత్తరాన 'పులిగుండం' అనే గుండాన్ని కూడా చూడవచ్చు. వాటి ప్రాకృతిక సౌందర్యాన్ని చూడాల్సిందే !

గుట్టపైనున్న 'రామగుండం' అనే చెరువు మీదుగా రామగుండం అనే పేరు ఆ పట్టణానికి వచ్చింది. వర్షాకాలంలో సహజసిద్ధంగా పారే జలపాతం, 108 గుండాల్లోంచి తిరుగుతూ... తిరుగుతూ... కిందకు దూకుతుంది. నేరుగా పారే జలపాతం అకస్మాత్తుగా ఒక రంధ్రం లోకి వెళ్లిపోయి ఇంకో రంధ్రం (గుండం) లోంచి బయటకొస్తుంది. జలపాతం మాయమై మళ్లీ పుట్టినట్టు కనిపిస్తుంది. ఇలాంటి వింత భారత దేశంలో ఈ ఒక్కచోటే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ గుండాల్లో నిలబడి జలపాతాల కింద జలకాలాడడం మధురానుభూతినిస్తుంది.




గౌరి గుండం జలపాతాలు



మల్లెల తీర్థం జలపాతం...

సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు పెట్టింది పేరు మల్లెల తీర్థం. కోకిల గీతాలు, నెమళ్ల నృత్యాలు, పారే సెలయేళ్లు... నల్లమల అడువుల్లో కనువిందు చేసే దృశ్యాలు ఎన్నో! కృష్ణానదికి ఇరువైపులా విస్తరించి ఉన్న నల్లమల అడవిని కండ్ల నిండుగా సందర్శించడానికి వారాంతాలు చక్కని ఎంపిక. హైదరాబాద్ నుంచి 232 కిలోమీటర్లు, శ్రీశైలం నుంచి 58 కి.మీ దూరంలో నల్లమల అడవులు ఉన్నాయి. దాదాపు 350 అడుగుల ఎత్తు నుంచి ఓ జలధార ఆకాశం నేలను ముద్దాడుతుందా అనిపించేలా దుముకుతుంటుంది. అంతెత్తు నుంచి పడుతున్న నీటి తుంపరలు మల్లెల విరిజల్లులా మనల్ని అభిషేకిస్తుంటాయి. ఈ జలపాతానికి 'మల్లెల తీర్థం' అని పేరు. ఇక్కడి కొండలు, గుట్టలు, గిరిపుత్రుల పలకరింపులు... మనసారా స్వాగతం పలుకుతాయి. పచ్చని చెట్ల నీడన, జలపాతపు చల్లదనానికి ఎండ దరిచేరదు. పరీక్షల ఒత్తిళ్ల నుంచి విద్యార్థులు, పని ఒత్తిడి నుంచి ఉద్యోగులు విశ్రాంతికి ఎంచుకునే ఆహ్లాదకర ప్రాంతం.

రూప



"మన చుట్టూ ఉన్న ప్రపంచంలో ఒక అందమైన ప్రాంతాన్ని చూసినప్పుడు మనం ఎంత చిన్నవాళ్లమో తెలుస్తుంది."

"గుస్తాన్ ఫ్లబర్ట్"

ఈ శీర్షిక మీదే..

మీరు ఎన్నో ప్రదేశాలు చూసి ఉంటారు. మీ అనుభూతులను, ప్రయాణంలో ఎదురైన అనుభవాలను జరదేఖో పాఠకులతో పంచుకోండి..

jaradekhont@gmail.com

మా చిరునామా..

నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజామాబాద్,
ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ - 500020

అద్భుతాల చిత్తరువు...ఉత్తరాఖండ్

హిమాలయాల ఒడిలో... ఉత్తరాఖండ్ విహారం... పర్యాటకుల మనసు దోచుకుంటుంది. జీవితంలో ఇలాంటి ప్రయాణం చిరకాలం గుర్తుండిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉత్తరాఖండ్ పేరు చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది డెహ్రాడూన్. కానీ, ఇప్పటిదాకా బయటపడని ఎన్నో అందాలు ఈ రాష్ట్రంలో చాలా ఉన్నాయి. ప్రకృతి అందాలతో పర్యాటకులను పరవశుల్ని చేయడమే కాదు సంస్కృతీ, సాంప్రదాయల్లో కూడా ఉత్తరాఖండ్ ఎంతో పేరుగాంచింది. అంతేకాకుండా మనదేశంలో గోల్ఫ్ ఆటకు అనువైన ప్రదేశాలలో ఉత్తరాఖండ్ ఒకటి. 'కోర్బట్ నేషనల్ పార్క్ అండ్ టైగర్ రిజర్వ్' అంతరించిపోతున్న మన జాతీయ జంతువు పెద్దపులికి ఇష్టమైన నివాసం. అంతేకాకుండా ట్రెక్కింగ్ ప్రియులకు ఇష్టమైన పర్వతశిఖరాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో 'నందాదేవి పీక్' ప్రముఖమైనది. జాతీయ వింతలు 'వాలీ ఆఫ్ ఫ్లవర్స్', 'నందాదేవీ జాతీయ ఉద్యానవనం' లాంటి ప్రదేశాలు తప్పకుండా చూసి తీరాల్సిందే!... 'యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్'లు గా గుర్తింపు సంపాదించుకున్న ఈ ప్రదేశాలు పర్యాటకులను ఆకట్టుకోవడంలో ముందువరుసలో నిలుస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే సందర్శకుల మనసుదోచే పర్యాటక కేంద్రాలు అనేకం ఉన్నాయి.

ట్రై రిషి సరోవర్...

సరస్సు నగరంగా గుర్తింపు పొందిన నైనిటాల్ లో ఒకప్పుడు సుమారు 60 కి పైగా చెరువులు, సరస్సులు ఉండేవట. ఇందులో 'నైనీ' అనే సరస్సు ఎంతో పేరుగాంచింది. ఇక్కడ మహాఋషులు, మునులు నివాసం ఉన్నట్టు స్కందపురాణంలో ఉంది. నైనిటాల్ సరస్సును 'ట్రై రిషి సరోవర్' (ముగ్గురు ఋషుల సరోవరం) అని కూడా పిలుస్తారు. అత్రి, పుస్త్య, పులహ అనే మహాఋషులు... నీరు దొరకకుండా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న నైనిటాల్ లో ఒక సరస్సు నిర్మించాలని తలపెట్టారు. అలా ఒక లోతైన గుంతను తవ్వి... టిబెట్ దగ్గర ఉన్న పవిత్ర మానస సరోవరం నుండి నీటిని తెచ్చి నింపారని స్థానిక కథనం. అలా ఏర్పడిందే నేడు మనం చూస్తున్న నైనిటాల్ సరస్సు. దేశంలో ఉన్న 64 శక్తిపీఠాలలో నైనిటాల్ కూడా ఒకటి. పర్యాటకులు ఇక్కడికి చేరుకోవాలంటే పంత్‌నగర్ విమానాశ్రయం నుంచి రావాలి. ఇది నైనిటాల్ కు 71 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా వెళ్లవచ్చు. రైలు మార్గం ద్వారా చేరుకునే పర్యాటకులు కథోగోదామ్ రైల్వే స్టేషన్ గుండా వెళ్లవచ్చు.


ఆల్మోరా...

ఉత్తరాఖండ్ లో పచ్చదనంతో మైమరిపించే మరో ప్రదేశం ఆల్మోరా. ఇక్కడి ప్రకృతి పచ్చదనానికి పరవశించని పర్యాటకుడు ఉండడంటే అతిశయోక్తి లేదు. ప్రశాంత వాతావరణంతో కొండకోనలతో అలరారుతున్న ఈ ప్రాంతాన్ని చూస్తే ప్రకృతీమాత తన నైపుణ్యాన్నంతటినీ రంగరించి మరీ తీర్చిదిద్దిందా అనిపిస్తుంది. కోశీ, సుయాల్ నదుల ప్రవాహం ఆల్మోరాకు మరింత అందాన్ని చేకూర్చింది. ఆల్మోరా ప్రకృతి అందాలతోనే కాదు, ప్రముఖుల నివాసాలకు ప్రసిద్ధిగాంచింది. స్వామీ వివేకానంద తన హిమాలయాల పర్యటనలో ఆల్మోరాను తాత్కాలిక విడిదిగా ఎంచుకున్నారట. అలా ఆయన కొన్నాళ్లు ఇక్కడే గడిపారట. అంతేకాకుండా స్వాతంత్ర్య సమరయోధుడు గోవింద్ వల్లభ్ పంత్, ప్రముఖ హిందీ విద్వాంసుడు సుమిత్రానందన్ పంత్, నోబెల్ గ్రహీత సర్ రొనాల్డ్ రాస్‌లకు జన్మస్థలం ఆల్మోరా. భారత క్రికెట్ జట్టు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని కూడా తన బాల్యంలో కొంత కాలాన్ని ఇక్కడే గడిపారట. ధోని తండ్రికి రాంచీలో స్థిరపడక మునుపు ఇక్కడ ఫామ్ హౌస్‌లు ఉండేవట. ఇక్కడికి చేరుకోవాలంటే నైనిటాల్‌కు మాదిరిగానే పంత్‌నగర్ విమానాశ్రయం నుండి చేరుకోవాలి. రైలు మార్గం గుండా వచ్చే పర్యాటకులు కోఠ్‌డామ్ రైల్వేస్టేషన్ నుండి చేరుకోవచ్చు.

రాణీఖేత్...

మన దేశంలో గోల్ఫ్ ఆటకు సంబంధించిన మైదానాలకు మారుపేరు రాణీఖేత్. ఎటుచూసిన పచ్చటి తివాచీ పరిచినట్లుండే ఈ ప్రాంతంలో 9 మౌంటేన్ గోల్ఫ్ లింక్‌లు ఉన్నాయి. ఓక్ అడవుల్లో విస్తరించి ఉన్న ఈ గోల్ఫ్ కోర్సులు పర్యాటకులను ఇట్టే కట్టిపడేస్తాయి. చలికాలంలో మంచు దుప్పటి పరుచుకున్నట్లుండే ఈ ప్రదేశం వేసవిలో మాత్రం సైనిక స్థావరంగా సేవలందిస్తుంది. కథోగోదామ్ రైల్వేస్టేషన్ గుండా ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. దూర ప్రాంతం నుండి వచ్చే పర్యాటకులకు దగ్గరి విమానాశ్రయం పంత్‌నగర్. ఇది రాణీఖేత్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.









నేనే నెం.1

టెస్టుల్లో నెం.1 బౌలర్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా

దుబాయ్ : టీమ్ ఇండియా స్టార్ లెఫ్టార్మ్ స్పిన్నర్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటుతున్నాడు. స్వదేశీ టెస్టు సీజన్‌లో సహచర స్పిన్నర్ అశ్విన్‌ను వెనక్కి నెట్టి వరల్డ్ నెం.1 బౌలర్‌గా ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం చేసుకున్న రవీంద్ర జడేజా.. తాజాగా మరో విభాగంలో అగ్రపీఠం దక్కించుకున్నాడు. ఇటీవల బంతితో, బ్యాట్‌తో సమస్థాయిలో రెచ్చిపోతున్న జడేజా.. ఆల్‌రౌండర్‌గా తనెంటో మరోసారి చాటుకున్నాడు. శ్రీలంకతో కొలంబో టెస్టులో అజేయంగా 70 పరుగులు చేయటమే కాదు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. తొలి రెండు టెస్టుల్లో కలిపి ఏకంగా 13 వికెట్లు కూల్చిన జడేజా.. ఐసీసీ ఆల్‌రౌండర్ జాబితాలో అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. బౌలర్ల జాబితాలో 893 పాయింట్లతో జడేజా నెం.1 ర్యాంక్‌లో నిలువగా, 842 పాయింట్లతో అశ్విన్ మూడోస్థానంలో నిలిచాడు. గత ర్యాంకింగ్స్‌లో జడేజా, అశ్విన్‌లు తొలి రెండు స్థానాల్లో నిలిచినా.. ఇంగ్లాండ్ సీమర్ అండర్సన్ (860) రెండో స్థానానికి దూసుకొచ్చాడు. ఆల్‌రౌండర్ జాబితాలో 438 పాయింట్లతో ఉన్న జడేజా తొలిసారి అగ్రస్థానం సాధించాడు. బంగ్లాదేశ్ స్టార్ ఆటగాడు షకిబ్ అల్ హసన్ (431) అగ్రస్థానం కోల్పోయి రెండో ర్యాంక్‌తో సరిపెట్టుకున్నాడు. ఇక ఈ జాబితాలోనూ అశ్విన్ (418) మూడోస్థానంలోనే నిలువటం విశేషం. ఇక బ్యాటింగ్ విభాగంలో టెస్టు స్పెషలిస్ట్ చటేశ్వర్ పుజారా (888) మూడోస్థానానికి ఎగబాకగా.. కెప్టెన్ విరాట్ కోహ్లి (813), అజింక్య రహానె (776)లు వరుసగా 5, 6వ స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ కెప్టెన్లు స్టీవ్ స్మిత్ (941), జోయ్ రూట్ (891)లు తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. 123 పాయింట్లతో టీమ్ ఇండియా నెం.1గా నిలువగా.. దక్షిణాఫ్రికా (110), ఇంగ్లాండ్ (105), ఆస్ట్రేలియా (100), న్యూజిలాండ్ (97), పాకిస్థాన్ (93), శ్రీలంక (92)లు వరుసగా తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

హెరాత్‌కు విశ్రాంతి



పల్లెకల్ : భారత్‌తో సిరీస్‌లో ఆతిథ్య శ్రీలంకకు మరో కోలుకోలేని దెబ్బ. మైదానంలో చావుదెబ్బ తిన్న శ్రీలంక ఇప్పటికే 0-2తో టెస్టు సిరీస్‌ను కోల్పోయారు. ఊరట విజయం కోసం పల్లెకల్ టెస్టు పోరుకు ముందు స్టార్ స్పిన్నర్ రంగన హెరాత్ ఫిట్‌నెస్ సాధించకపోవటంతో.. అతడు మూడో టెస్టుకు దూరం కానున్నాడు. నిజానికి హెరాత్‌కు తీవ్రమైన గాయమేమీ కాకపోయినా.. ఇటీవల మూడు టెస్టుల్లో కలిపి అతడు ఏకంగా సుమారు 200 ఓవర్ల పాటు బౌలింగ్ చేశాడు. రానున్న రెండు మాసాల్లో పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌ను సైతం దృష్టిలో ఉంచుకుని సీనియర్ బౌలర్‌కు విశ్రాంతి ఇస్తున్నట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది. ' ఆటగాళ్ల మేనేజ్‌మెంట్ అంటే ఇదే!. నిజానికి మేం ఎవరినీ బ్రేక్ రావాలని కోరుకోవటం లేదు. గత మూడు టెస్టుల్లో హెరాత్ సుమారు 200 ఓవర్ల పాటు బంతులేశాడు. అతడి వయసు కూడా దృష్టిలో ఉంచుకుని ఫిట్‌నెస్ దృష్ట్యా విశ్రాంతి అవసరమని భావించాం' అని శ్రీలంక క్రికెట్ బోర్డు మేనేజర్ గురుసిన్హా పేర్కొన్నారు. జింబాబ్వేతో ఏకైక టెస్టులో 71.1 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన హెరాత్.. భారత్‌తో తొలి రెండు టెస్టుల్లో కలిపి 91 ఓవర్లు బంతులేశాడు. స్పెషలిస్ట్ సీమర్ నువాన్ ప్రదీప్ ఫెర్నాండో గాయంతో ఏకంగా సిరీస్‌కే దూరం కావటంతో.. శ్రీలంక జట్టులో కొత్తగా ఇద్దరు బౌలర్లను ఎంపిక చేయాల్సి ఉన్నది. భారత్‌తో మూడో టెస్టు ఆగష్టు 12 నుంచి ఆరంభం కానున్నది.

వికెట్ల వెనుక యోధుడు

కొలంబో టెస్టులో ఆకట్టుకున్న సాహా



పల్లెకల్ : శ్రీలంకతో రెండో టెస్టు అనంతరం అశ్విన్, జడేజాల వ్యక్తిగత రికార్డులు సహా టీమ్ ఇండియా వరుస సిరీస్ విజయాలపైనే అందరి దృష్టి నెలకొన్నది. కోహ్లిసేన ద్వీపదేశంలో సాధించిన మరో గొప్ప విజయంపై గణాంకాలు తిరుగగా, అశ్విన్-జడేజా ద్వయం వేగవంతమైన రికార్డులు హైలైట్ అయ్యాయి. కొలంబోలో అర్ధ సెంచరీతో కీలక పాత్ర పోషించటమే కాదు వికెట్ల వెనకాల సుదీర్ఘంగా కాచుకున్న వృద్ధిమాన్ సాహా సాధించిన అరుదైన ఘనత వెలుగులోకి రాలేదు!. వన్డేలు సహా టెస్టుల్లో బాయ్స్ రూపంలో పరుగులు రావటం సహజమే. దీన్ని పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. ఇక టెస్టుల్లో అయితే.. షరామామూలే. ఎంతటి గొప్ప వికెట్ కీపర్ అయినా ఒకటో రెండో బాయ్స్ రూపంలో పరుగులు ఇచ్చుకోవటం అత్యంత సాధారణం. కానీ శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా 116.5 ఓవర్ల పాటు వికెట్ల వెనకాల కాచుకున్న వృద్ధిమాన్ సాహాను దాటి ఒక్క బంతీ పక్కకుపోలేదు. దీంతో బాయ్స్ రూపంలో శ్రీలంకకు ఒక్క పరుగూ రాలేదు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 111 సార్లు బ్యాట్స్‌మెన్ బ్యాట్‌ను దాటి బంతి వికెట్ల వెనకాలకు వెళ్లగా, 62 సార్లు బ్యాట్స్‌మెనే బంతిని వెనకాలకు వదిలేశారు. ఈ అన్ని సందర్భాల్లోనూ బంతిని పట్టుకోవటంలో సాహా సఫలీకృతుడయ్యాడు. ఇదే సమయంలో ఇంగ్లాండ్‌తో టెస్టులో సఫారీ యువ వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ ఈ విషయంలో తడబడ్డాడు. ఇన్ని ఓవర్ల పాటు వికెట్ల వెనకాల ఒక్క అదనపు పరుగూ ఇవ్వకుండా సాహా కొత్త రికార్డు నమోదు చేశాడు. అశ్విన్, జడేజా వంటి క్విక్ స్పిన్నర్ల బంతులను ఒడిసిపట్టడం అంత సులువు కాదు. ఒక్కో బంతి అనూహ్యంగా తిరుగుతుంది. అంచనాలకే అందదు. అయినా వికెట్ల వెనకాల సాహా అద్భుతంగా రాణించాడు. అందుకే టెస్టుల్లో సాహా అత్యుత్తమ వికెట్ కీపర్ అని కెప్టెన్ కోహ్లి కితాబు అందుకున్నాడు. కెప్టెన్, కోచ్‌ల నుంచి కితాబు అందుకోవటం కొత్త ఉత్సాహం ఇచ్చిందంటున్న సాహా.. వికెట్ల వెనకాల బాధ్యత అంత సులువు కాదని చెబుతున్నాడు.

బెట్టింగ్‌పై మీరేమంటారు?

- రాష్ట్ర క్రికెట్ సంఘాలతో లా కమిషన్



న్యూఢిల్లీ : స్పోర్ట్స్ బెట్టింగ్‌కు త్వరలోనే చట్టబద్ధత కల్పించే అవకాశం ఉందా?. ప్రభుత్వమే జూదరులకు సకల సౌకర్యాలతో బెట్టింగ్ ఏర్పాట్లు చేయనున్నాదా? బెట్టింగ్‌కు చట్టబద్ధత కల్పించటంపై లా కమిషన్ నివేదిక అందజేయనున్న నేపథ్యంలో ఈ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అంశంపై అభిప్రాయాలు తెలపాలని లా కమిషన్ రాష్ట్ర క్రికెట్ సంఘాలను కోరింది. ఈ మేరకు లా కమిషన్ సభ్య కార్యదర్శి సంజయ్ సింగ్ బీసీసీఐ అనుబంధ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్లకు ఈ మెయిల్ పంపించాడు. ' బెట్టింగ్‌కు చట్టబద్ధత కల్పించాలా? వద్దా అనే విషయమై లా కమిషన్ అన్ని కోణాల్లో, అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు, సలహాలు తీసుకుంటుంది. ఈ అంశంలో రాష్ట్ర క్రికెట్ సంఘాల ఆలోచన ఎలా ఉందో తెలుసుకునేందుకు కమిషన్ ఆసక్తిగా ఉంది. చట్టబద్ధతపై సిఫారసు చేయటంలో ఈ సూచనలు విలువైనగా భావిస్తున్నాం' అని లేఖలో సంజయ్ సింగ్ పేర్కొన్నారు. జస్టిస్ లోధా కమిటీ నిరుడు చేసిన సిఫారసులో క్రికెట్ బెట్టింగ్‌కు చట్టబద్ధత కల్పించటం. అయితే, ఈ ప్రక్రియ న్యాయ కమిషన్ ద్వారానే జరగాలని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు..ఈ మేరకు బి.ఎస్ చౌహాన్ చైర్మన్‌గా ఉన్న లా కమిషన్‌ను నివేదిక ఇవ్వాలని కోరింది. చౌహాన్ న్యాయ కమిషన్ సిఫారసు మేరకు బెట్టింగ్‌కు చట్టబద్ధత ఆధారపడి ఉంటుంది.



తెలుగు టైటాన్స్

కనీసం ఓటమికి చెక్ పెట్టిన తెలుగు జట్టు

- 21-21తో బెంగళూర్‌తో పోరు డ్రా
- 32-20తో గుజరాత్‌పై హర్యానా విజయం

ప్రొ కబడ్డీ లీగ్-5

నవతెలంగాణ-నాగ్‌పూర్

హమ్మయ్య..! ఎట్టకేలకు తెలుగు టైటాన్స్ కనీసం ఓటమి యాత్రకు ముగింపు పలికింది!. సొంతగడ్డపై వరుసగా ఐదు మ్యాచుల్లో ఓటమిపాలైన తెలుగు టైటాన్స్.. తొలి నాన్ హోమ్ మ్యాచ్‌లో ఆకట్టుకున్నది. మంగళవారం జెర్సీ రంగు సైతం మార్చిన టైటాన్స్.. ఆరంభంలో ఆటను మాత్రం మార్చులేకపోయింది. కానీ ఆఖరి నిమిషంలో జరిగిన హైడ్రామాతో టైటాన్స్ ఓటమి గండం నుంచి గట్టెక్కింది. ఉత్కంఠగా ముగిసిన మ్యాచ్‌లో 21-21తో డ్రా ఆనందం పొందింది. తొలి నుంచీ మ్యాచ్‌పై స్పష్టమైన ఆధిపత్యం చెలాయించిన బెంగళూర్ బుల్స్ అనూహ్యంగా డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తొలి 20 నిమిషాల ఆట ముగిసే సరికి 9-8తో ఒక్క పాయింట్ ఆధిక్యంలో నిలిచిన బెంగళూర్ బుల్స్.. ద్వితియార్థం ఆరంభంలోనే వరుస పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే ఇరు జట్ల డిఫెన్స్ బలంగా ఉండటంతో రైడ్ పాయింట్లు రావటం కష్టమైంది. స్టైలిష్ రైడర్ రోహిత్ కుమార్ 19 సార్లు కూతకెళ్లి కేవలం ఐదు పాయింట్లే సాధించాడు. మరోవైపు తెలుగు టైటాన్స్ స్టార్ రైడర్ రాహుల్ చౌదరి 20 రైడ్లలో 8 పాయింట్లు సాధించగలిగాడు. ఆఖరి రైడ్‌కు ముందు 20-21తో తెలుగు టైటాన్స్ ఓ పాయింట్ వెనుకంజలో నిలిచింది. బెంగళూర్ శిబిరంలో ఇద్దరే మిగిలారు. కూతకెళ్లిన రాహుల్ చౌదరి ఇద్దరినీ అవుట్ చేసే అవకాశం తృటిలో చేజార్చుకున్నాడు. దీంతో ఒక్క పాయింటే సాధించిన టైటాన్స్ 21-21తో టైతో ముగించింది. తెలుగు టైటాన్స్ తరఫున నిలేశ్ సాలుంకె నాల్గు పాయింట్లు సాధించగా, రాకేశ్ కుమార్ రెండు పాయింట్లు సాధించాడు. డిఫెండర్ విశాల్ భరద్వాజ్ రెండు సూపర్బ్ టాకిల్స్‌తో ఆకట్టుకున్నాడు. బెంగళూర్ తరఫున ప్రీతమ్ చిల్లార్ (2), ఆశీష్ కుమార్ (3), మహిందర్ సింగ్ (2), రవీందర్ పహాల్ (2)లు రాణించారు.

మెరిసిన హర్యానా : గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్, హర్యానా స్టీలర్స్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో హర్యానా 12 పాయింట్ల తేడాతో గెలుపొందింది. హర్యానా రైడింగ్, డిఫెన్స్‌లో స్పష్టమైన ఆధిక్యం చూపిన వేళ గుజరాత్ చిన్నబోయింది. వికాస్ ఖండోలా ఆరు రైడ్ పాయింట్లతో మెరిశాడు. మోహిత్ చిల్లార్ ఏడు టాకిల్స్ చేయగా, సురేందర్ నడా ఆరు టాకిల్స్‌తో అదరగొట్టాడు. దీంతో హర్యానా స్టీలర్స్ 32-20తో ఘన విజయం సాధించింది. గుజరాత్ జట్టులో సచిన్ ఐదు రైడ్ పాయింట్లకు తోడు మూడు టాకిల్స్‌తో ఆకట్టుకోగా, మహేంద్ర రాజ్‌పుత్ ఐదు పాయింట్లు సాధించాడు. రైడింగ్‌లో రెండు జట్లు చెరో పది పాయింట్లు సాధించగా.. టాకిల్స్‌లో హర్యానా 16 పాయింట్లతో గుజరాత్ (9)ను వెనక్కి నెట్టేసింది.

అభయహస్తం జాడేది?

ఆన్‌లైన్ ప్రక్రియ పేరుతో నిలిపివేత

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

అభయాస్తం పింఛన్లు గత పది నెలలుగా అందించడం లేదు. స్వయం సహాయక సభ్యులై 60 ఏండ్లు నిండిన వారికి ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టింది. సంఘం సభ్యులై యేటా రూ.365 చెల్లించిన వారికి ప్రభుత్వం అధనంగా మరో రూ.365 జమచేస్తుంది. సభ్యులకు 60ఏండ్లు నిండిన అనంతరం ప్రతి ఒక్కరికీ నెలకు రూ.500 ఇచ్చేలా రూపొందించిన 'అభయహస్తం' పథకం జాడేలేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొనసాగించిన ఈ పథకం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం క్రమక్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. ఆన్‌లైన్ ప్రక్రియ పేరుతో గత పదినెలలుగా ఈపథకం నిలిపేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 93,746మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించిన రూ.28,12,38,000 కోట్ల ప్రీమియం ఇన్సూరెన్స్ కంపెనీల వద్దే మూలుగుతోంది. వీరికి ప్రతినెలా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున చెల్లించాల్సిన ప్రభుత్వం గత అక్టోబర్ నుంచి చెల్లించడం మానేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.46కోట్లా 87లక్షలా 30వేల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

పథకం లక్ష్యం ఇది...

స్వయం సహాయక సంఘాల గ్రూపులలో ఉండి 60ఏండ్లు వచ్చేదాకా ఏడాదికి రూ.365 చెల్లిస్తే వారికి 60ఏండ్లు వచ్చిన తరువాత ప్రభుత్వం అభయహస్తం పింఛన్ల రూపంలో నెలకు రూ.500 చెల్లిస్తుంది. ఇందుకు గానూ లబ్దిదారులకు బాండ్లు ఇచ్చినప్పటికీ 10నెలలుగా పింఛన్ల పంపిణీని మాత్రం నిలిపివేశారు. 93,746 మందికి అందాల్సిన అభయహస్తం పింఛన్ సదరు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఇప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని లబ్దిదారులు విమర్శిస్తున్నారు.





మందుగోలీలకూ డబ్బుల్లేవు

డబ్బులు ఇంకా విడుదల కాలేదంటా... మందు గోలీలు కొనుక్కుందామన్నా డబ్బుల్లేవు. ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. ఇంటి పని తోనే సాగదీస్తున్న. మేం దాచుకున్న డబ్బులకు కూడా ఇబ్బంది పెడుతున్నారు.

చెట్టుమాల సావిత్రమ్మ, కిష్టారం, సత్తుపల్లి మండలం

పదినెలలుగా పండుటాకుల పాట్లు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 46.87 కోట్లు పెండింగ్

ఇన్సూరెన్స్ కంపెనీ వద్ద మూలుగుతున్న రూ. 28.12కోట్ల ప్రీమియం

అభయహస్తం పింఛన్ లబ్దిదారులు

జిల్లా	లబ్దిదారులు	జిల్లా	లబ్దిదారులు
ఆదిలాబాద్	1039	నాగర్‌కర్నూల్	2701
భద్రాద్రి	1810	నల్లగొండ	5315
జగిత్యాల	3522	నిర్మల్	2192
జనగాం	3455	నిజామాబాద్	4955
జయశంకర్	3313	పెద్దపల్లి	4394
జోగులాంబ	832	రాజన్న	3596
కామారెడ్డి	3454	రంగారెడ్డి	3078
కరీంనగర్	5449	సంగారెడ్డి	1662
ఖమ్మం	5958	సిద్ధిపేట	5021
కొమరం భీం	1218	సూర్యాపేట	4859
మహబాద్	4037	వికారాబాద్	1213
మహబూబ్‌నగర్	1737	వనపర్తి	1433
మంచిర్యాల	2816	వరంగల్ (రూ)	6046
మెదక్	1822	వరంగల్ (అ)	3512
మేడ్చల్	524	యాదాద్రి	2783

రాష్ట్రంలో రూ. 46.87 కోట్ల బకాయిలు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లబ్దిదారుల వద్ద రూ.300కోట్లతో నిధిని ఏర్పాటు చేశారు. అప్పట్లో అనేక మంది అభయహస్తంలో చేరారు. వీరంతా ఇప్పటి వరకూ రూ28కోట్ల 12లక్షల, 38వేలు చెల్లించారు. ఈప్రీమియం అంతా సెర్ప్ ఖాతా నుంచి ఇన్సూరెన్స్ కంపెనీకి జమైంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 93,746 మందికి పింఛన్ అందించాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగానే పింఛన్లు అందజేసినా తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిలిపేసింది. పదినెలలకుగాను 93,746 మందికి ఒకొక్కరికి రూ.5000 చొప్పున రూ.46కోట్ల 87లక్షల, 30వేలు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

అక్టోబర్ నుంచి ఆగిపోయాయి

అభయహస్తం పింఛన్లు నిలిచిపోయిన మాట వాస్తవమే. ఇన్సూరెన్స్ కంపెనీ నుండి త్వరలో వస్తే వెంటనే చెల్లించేందుకు సిద్ధంగాఉన్నాం. ప్రస్తుతం ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తున్నాం. అందువల్లనే ఆలస్యం అవుతోంది. 4725మందికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ మాత్రమే మిగిలింది. ఇవి కాగానే ఇన్సూరెన్స్ కంపెనీ నుండి పింఛన్ వచ్చే అవకాశముంది.

మురళీధర్‌రావు (డీఆర్‌డీఏ పీడీ ఖమ్మం)

పింఛన్‌రాక కరువుపనికి వెళ్తున్న

కుటుంబానికి ఆధారం కోసం అందరం కలిసి కరువు పనులకు వెళ్తున్నాం. నాకు పింఛన్ రాక తిప్పలుపడుతున్న. ఆఫీసర్లకు చెప్పుకున్నా పట్టించుకోలేదు. రాలేదంటున్నారు. పదినెలలుగా పింఛన్ ఆగిపోయింది. ఈ ప్రభుత్వంలో అది ఇస్తాం.. ఇది ఇస్తామంటున్నారే గానీ.. ఏదీ సక్రమంగా సమయానికి ఇవ్వడం లేదు.

కొక్కెరగడ్డ మాణిక్యం, కిష్టారం, సత్తుపల్లి మండలం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం వెరిఫికేషన్ పేరుతో కొంత మందిని మినహాయించడంతో ఆందోళనకు గురైన నాగేశ్వర్‌రావు కార్యాలయంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. వెరిఫికేషన్‌లో తీవ్ర అవకతవకలు జరిగాయని కాంట్రాక్టు కార్మికులు ఉన్నతస్థాయి అధికారులకు ఆనాడే ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు.

నాగేశ్వర్‌రావు మృతికి జెన్‌కో యాజమాన్యానిదే బాధ్యత : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ కార్మికుడు నాగేశ్వర్‌రావు మృతికి విద్యుత్ సంస్థల యాజమాన్యానిదే బాధ్యతని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెరిఫికేషన్ కమిటీని మారుస్తామని సీఎండీ ప్రకటించి కూడా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆత్మహత్య చేసుకున్న నాగేశ్వర్‌రావు కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు.

పంచాయతీల యూనిట్‌గా సర్వే నిర్వహించాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ పంచాయతీల యూనిట్ ఆధారంగా సమగ్ర భూసర్వే నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి, కార్యదర్శి టి. సాగర్, ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి 30 సంవత్సరాలకు ఒకసారి భూసర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. దీర్ఘకాలంగా సమగ్ర సర్వే నిర్వహించనిది కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.